www.prajasakti.com

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 39 Vol సంచిక : 08 No | విజయవాడ, మంగళవారం 08 జనవరి 2019 | 12 + 12 పేజీలు వెల : 4.00 Rs.



ఏడు దశాబ్దాల కల నెరవేరింది

టీమిండియాకు ప్రముఖుల ప్రశంసలు

టీమిండియా దశాబ్దాల కల నెరవేరింది. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్ట్ సిరీస్‌ను చేజిక్కించుకొని కొత్త చరిత్ర సృష్టించింది. గతంలో ఏ భారత దిగ్గజ సారథికీ సాధ్యంకాని విజయాన్ని కోహ్లీ సారథ్యంలోని భారత్ జట్టు సాధించింది. నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1తో కైవసం చేసుకుని 71 ఏళ్ల నిరీక్షణకు ముగింపు పలికింది. ఆసీస్ గడ్డపై నూతన అధ్యాయాన్ని లిఖించింది. బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ముద్దాడి కోహ్లీ సేన విదేశీగడ్డపైనా సత్తా చాటింది. దీంతో కోహ్లీ సేనకు భారత రాష్ట్రపతి, ప్రధాని, సచిన్ టెండూల్కర్ తదితరులు ప్రశంసలు తెలిపారు. 1980-81, 1985-86, 2003-04 ఆసీస్ పర్యటనల్లో సిరీస్‌ను భారత్ డ్రాగా ముగించింది. గానీ సిరీస్‌ను మాత్రం చేజిక్కించుకోలేకపోయింది. ఇప్పటివరకు ఆస్ట్రేలియా గడ్డపై ఆడిన 47 టెస్టుల్లో భారత్‌కు ఏడు విజయాలు మాత్రమే దక్కాయి. కాగా నయావాల్ ఛతేశ్వర పుజారా ఈ సిరీస్‌లో 521 పరుగులతో రాణించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ అవార్డులను గెల్చుకున్నాడు.

నేటి నుంచి జెఈఈ మెయిన్స్ 2

నేడు, రేపు

సార్వత్రిక సమ్మె

- సత్తా చాటనున్న కార్మికలోకం
- కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలపై ఢిల్లీలో ర్యాలీ
- పత్రికా గోష్టిలో కార్మిక సంఘాల నేతలు
- రేపు గ్రామీణ భారత్ బంద్



వార్త 8లో..

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ కొల్‌కతా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం జరిగిన ర్యాలీ

రాష్ట్రం సన్నద్ధం

- విస్తృతంగా ప్రచారం
- కార్మిక సంఘాల ఐక్య కార్యాచరణ
- వామపక్షాలు, జనసేన మద్దతు

2

నేడు విద్యాసంస్థల బంద్ విద్యార్థి, యువజన సంఘాలు



నసీరుద్దీన్‌షాకు అమర్త్యసేన్ మద్దతు

కోల్‌కత్తా : 'అమ్నెస్టీ ఇండియా' వీడియోలో నటించడంతో పాటు అల్లరిమూక దాడులపై వ్యాఖ్యలు చేసి ఇటీవల వార్తల్లో నిలిచిన నటుడు నసీరుద్దీన్‌షాకు నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ మద్దతుగా నిలిచాడు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ నటులను కించపరచడం తగదన్నారు. అతను నటించిన రెండు నిమిషాల వీడియోలో మానవ హక్కుల కోసం మాత్రమే డిమాండ్ చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో వివిధ సంస్థలు, వ్యక్తులపై జరుగుతున్న దాడులు సరికాదన్నారు. ప్రస్తుతం దేశంలో రచయితలు, కవులు, నటులు అణచివేతకు గురవుతున్నారని, దీనిపై మేధావులు, జర్నలిస్టులు కూడా మాట్లాడకపోవడంపై నసీరుద్దీన్ తన వీడియోలో ఆవేదన వ్యక్తం చేశా రు. దేశంలో ద్వేషపు గోడల నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీని వలన చాలా మంది అమాయకులు బలవుతున్నారని షా పేర్కొన్నారు.

ఎన్ఐఎకు సహకరించొద్దు

- సిట్‌కు ఏపి సర్కార్ డైరెక్షన్?
- సెలవులో విశాఖ సిపి
- జగన్ కేసులో కానరాని పురోగతి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వైసిపి అధ్యక్షులు వైఎస్ జగన్‌పై గత అక్టోబరు 25న విశాఖ విమానాశ్రయంలో కోడి కత్తితో దాడి జరిగిన కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఎ)కు సహకరించొద్దని విశాఖ సిట్‌కు రాష్ట్ర ప్రభుత్వం డైరెక్షన్ ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ కేసును రెండు నెలల పాటు విశాఖ సిట్ బృందం విచారణ చేపట్టింది. కేసులో ఎవరి ప్రమేయమూ లేదని, నిందితుడు ఆకతాయిగా తాను పాపులర్ అవ్వాలనే దాడి చేశాడని స్పష్టం చేసింది. ఈ కేసుకు సంబంధించి ఆంధ్రా పోలీసులపై నమ్మకం లేదని, కేసును కేంద్ర బృందంతో విచారణ మిగతా 9లో

10న 12 ఒప్పందాలు

సీడ్ డెవలప్‌మెంట్‌పై 10న కీలక ఘట్టం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అమరావతి సీడ్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి 10వ తేదీన కీలక ఘట్టానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1691 ఎకరాల్లో చేపట్టనున్న అంకుర ప్రాంత అభివృద్ధికి సంబంధించి వివిధ కంపెనీలతో 12 ఎంఓయులు కుదుర్చుకోనుంది. అదేరోజు సీడ్ బిజినెస్ డిస్ట్రిక్ట్ మాస్టర్‌ప్లాను పోటీ, ప్రదర్శన గ్యాలరీని ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు చేయడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజాప్రతినిధులు, కంపెనీల ప్రతినిధులు మొత్తం 500 మంది వరకూ ఈ కార్యక్రమానికి హాజరు కానున్నారు. ఏర్పాట్ల కోసం సుమారు కోటి రూపాయలు ఖర్చు చేయనున్నారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం సింగపూర్‌కు చెందిన మంత్రులు ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశం కానున్నారు. 11.15 గంటలకు అమరావతి డెవలప్‌మెంట్ పార్టనర్ భాగస్వాముల మధ్య ఒప్పంద పత్రాలను మార్చుకోనున్నారు. ఈవెంట్ నిర్వహణా బాధ్యతలన్నీ ఇంపల్స్, కెఎంకె ఈవెంట్ మేనేజ్‌మెంట్, అవెన్స్ ఎక్స్‌పొజిషన్స్ కంపెనీలకు అప్పగించారు.

అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్లు

- నేడు పార్లమెంట్‌లో బిల్లు
- ఎన్నికల గిమ్మిక్కు అన్న ప్రతిపక్షం



న్యూఢిల్లీ : మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్న తరుణంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అగ్ర వర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి ప్రభుత్వ విద్యా సంస్థల్లో, ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని కేంద్ర మంత్రిమండలి నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెట్టనుంది. దీనిపై ఓటింగ్ జరిగే అవకాశం వుంది. రు.8 లక్షల్లోపు వార్షికాదాయం వున్న వున్న అగ్ర కులస్తులందరూ ఈ కోటా పరిధిలోకి రానున్నారు. దీర్ఘకాలంగా ఈ డిమాండ్ వున్నప్పటికీ ఎన్నికల వేళ ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. దీన్ని రాజకీయంగా చూడరాదని, ప్రజల మనోభావాలను గుర్తించి, వారి అవసరాలను తీర్చడం ప్రభుత్వ బాధ్యత అని కేంద్ర మంత్రి విజయ్ సాంప్లా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యా సంస్థల్లో ప్రవేశాలకు ఇచ్చే రిజర్వేషన్లు 50 శాతం మించరాదని పేర్కొంటూ 1992లో సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. అయితే 2010లో మరో తీర్పు ఇస్తూ, రిజర్వేషన్లను పెంచడాన్ని సమర్థించేలా శాస్త్రీయమైన డేటా వున్నట్లైతే రాష్ట్రాలు ఆ 50 శాతం పరిమితిని దాటవచ్చని అనుమతించింది. ప్రస్తుతం రిజర్వేషన్లు 49.5 శాతంగా వున్నాయి. వీటిలో ఎస్‌సిలకు 15 శాతం, మిగతా 9లో

ఎవరెవరు అర్హులు

- ఏడాదికి 8లక్షల లోపు ఆదాయం కలిగినవారు
- ఐదెకరాల భూమి కన్నా తక్కువ వున్నవారు
- వెయ్యి చదరపు అడుగుల లోపు ఇంటిస్థలం వున్నవారు
- నోటిఫైడ్ మున్సిపాలిటీలో 100 గజాల కంటే తక్కువ స్థలం
- నోటిఫైడ్ కాని ఏరియాలో 200 గజాల కంటే తక్కువ స్థలం

మేఘాలయలో మరో గని ప్రమాదం

బండరాళ్లు దొర్లిపడటంతో ఇద్దరు మృతి

8

బిజెపితో ఎజిపి కటీఫ్

సిటిజన్‌షిప్ బిల్లుపై వివాదమే కారణం

కొలిక్కిరాని ఎన్టీఆర్ వైద్యసేవలు



అనంతపురం పర్యటలో ఉన్న మంత్రి ఫరూక్‌కు వినతి పత్రం అందజేస్తున్న వైద్యులు

- నేడు ఆస్పత్రి యాజమాన్యాల సమావేశం
- రూ.310 కోట్లు చెల్లించామంటున్న అధికారులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వివిధ సంక్షేమ పథకాలకు అవార్డులొచ్చాయని, వైద్యం కోసం వెచ్చించే సొమ్ము గతంలో కంటే 90 శాతం తగ్గిందని ప్రభుత్వం చెబుతోంది. గత వారం రోజులకు పైగా ప్రజలకు అందాల్సిన వైద్యసేవలపై మాత్రం దృష్టి సారించడంలేదు. ప్రభుత్వ సభలకు, కార్యక్రమాలకు కోట్లాది రూపాయాలు వెచ్చిస్తోందికానీ ప్రజలకు అందాల్సిన మెరుగైన వైద్యసేవలకు బకాయిలను చెల్లించలేకపోతోందన్న విమర్శలొస్తున్నాయి. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వజన ఆస్పత్రుల్లో మందులు అందుబాటులో లేకపోవడంతో బయట కొనుగోలు చేసుకునే వారికి కూడా రీయింబర్స్‌మెంట్ రావడంలేదు. తమకు బకాయిలు చెల్లించాలని, లేనిపక్షంలో సేవలు నిలిపివేస్తామని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు డిసెంబర్‌లోనే హెచ్చరించినా ప్రభుత్వం స్పందించలేదు. దీంతో కొత్త ఏడాది తొలిరోజు నుంచే రాష్ట్రంలో ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిచిపోయాయి. రాష్ట్రంలోని పలు ఆస్పత్రుల్లో ఎన్టీఆర్ వైద్యసేవలు నిలిచిపోయి వారం రోజులు దాటినా సమస్య కొలిక్కిరాలేదు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ నెట్‌వర్క్ మిగతా 9లో

పోలవరం రికార్డులు..

- 24 గంటల్లో 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్
- సిఎంకు రికార్డు పత్రాలు అందించిన గిన్నిస్‌బుక్ ప్రతినిధులు
- మే నాటికి గ్రావిటీతో నీళ్లు, డిసెంబర్‌కల్లా ప్రాజెక్టు పూర్తి
- వడ్డీతో సహా కేంద్రం నుంచి వసూలు : చంద్రబాబు



పోలవరంలో గిన్నిస్ వరల్డ్ రికార్డు పత్రాలను స్వీకరించి చూపుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి/అమరావతి బ్యూరో

పోలవరం ప్రాజెక్టు పనుల్లో సోమవారం రెండు గిన్నిస్ రికార్డులు నమోదయ్యాయి. 24 గంటల్లో అత్యధికంగా 32,315 క్యూబిక్ మీటర్ల కాంక్రీటు వేసినందుకు, నిరంతరాయంగా అత్యధికంగా కాంక్రీటు పోత పోసినందుకు గిన్నిస్ రికార్డులు దక్కాయి. సోమవారం ప్రాజెక్టు ప్రాంతంలో ఏర్పాటు చేసిన సభలో సిఎం నారా చంద్రబాబు నాయుడుకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు రికార్డు పత్రాలను అందించారు. ఈ రికార్డు సాధించిన గుర్తుగా చంద్రబాబు పైలాన్‌ను ఆవిష్కరించారు. నిడదవోలు జన్మభూమి సభలో పాల్గొన్న అనంతరం సాయంత్రం మిగతా 9లో

కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకానికి సిఎం గ్రీన్‌సిగ్నల్

నేడు జీఓ విడుదల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని నాలుగు కార్పొరేషన్లకు ఛైర్మన్లుగా నియమించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సోమవారం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏపీ స్టేట్ క్రిస్టియన్ (మైనార్టీస్) ఫైనాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మద్దిరాల జోసెఫ్ ఇమ్మాన్యుయెల్, సాహిత్య అకాడమీ ఛైర్మన్‌గా ప్రొఫెసర్ కొలకలూరి ఇనాక్, సంగీత నృత్య అకాడమీ ఛైర్మన్‌గా వందేమాతరం శ్రీనివాస్, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ(ఫోక్ అండ్ క్రియేటివ్ అకాడమి) ఛైర్మన్‌గా పొట్లూరి హరికృష్ణలను ఎంపిక చేశారు. ఇందుకు సంబంధించిన జీఓ మంగళవారం విడుదలయ్యే అవకాశాలున్నట్లు తెలిసింది.



పిఎసిఎస్ ఉద్యోగుల పోరాటానికి పిడిఎఫ్ మద్దతు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సహకార రంగ ఉద్యోగులు గట్టిగా నిలబడి పోరాడితేనే విజయం సాధ్యమవుతుందని పిడిఎఫ్ శాసనమండలి పక్షనేత విఠపు బాలసుబ్రమణ్యం అన్నారు. విజయవాడలోని ధర్నాచౌక్‌లో అగ్రికల్చర్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షలను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలయాపన కోసమే వేతన పెంపు సిఫారసుల కమిటీని వేశారన్నారు. కమిటీ వేయడం కోసం ఒక పోరాటం చేస్తే కమిటీ సిఫారసులను మార్చాలని మరో పోరాటం చేయాల్సి వస్తోందన్నారు. ఇతర రంగాల్లో ఉద్యోగుల జీతాలను పెంచేందుకు అంగీకరిస్తున్న ప్రభుత్వం సహకారం రంగాన్ని విస్మరిస్తోందన్నారు. వ్యవసాయానికి సహకార రంగమే మూలమని, అలాంటి రంగాన్ని విస్మరిచడం దారుణమన్నారు. కమిటీ సిఫారసులను మార్చుతారో లేక రాబోయే ఎన్నికల్లో పాలకులనే మార్చుమంటారో ప్రభుత్వమే తేల్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రితో సహకార ఉద్యోగుల సమస్యను మాట్లాడతామని, పిడిఎఫ్ ఎమ్మెల్సీ తరపున పోరాటం చేస్తామని అన్నారు. పిఎసిఎస్ ఉద్యోగుల పోరాటానికి పిడిఎఫ్ ఎమ్మెల్సీల మద్దతు ఉంటుందన్నారు. యూనియన్ గౌరవా ధ్యక్షులు పి అజయ్‌కుమార్ మాట్లాడుతూ కమిటీ సిఫారసుల్ని యథాతథంగా ఆమోదిస్తే కొన్ని నష్టాలున్నాయన్నారు. కమిటీ సిఫారసుల్లో మార్పులు చేసి జీవోను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 10 శాతం వేతనం పెంపునకు అనుకూలంగా లేమని, గ్రాట్యుటీ కూడా భిక్షగా ఉందని అన్నారు. గ్రాట్యుటీ చట్టం ప్రకారం చూసినా కనీసం రూ.5 లక్షలు రావాల్సి ఉందన్నారు.కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు పివి సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి పి సత్యనారాయణ, కోశాధికారి టి వెంకటరామయ్య ప్రభృతులు పాల్గొన్నారు.

సమాఖ్య వ్యవస్థను కాపాడుకోవాలి : జెపి

ఇజిఇ నివేదిక విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

సమాఖ్య వ్యవస్థను కాపాడడానికి రాష్ట్రంలో ఉన్న రాజకీయ పార్టీలన్నీ ఏకం కావాలని ఇండిపెండెంట్ గ్రూప్ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ (ఐజిఇ) కన్వీనర్ డాక్టర్ జయప్రకాష్‌నారాయణ్ (జెపి) కోరారు. సోమవారం నాడిక్కడ విలేకరుల సమావేశంలో ఐజిఇ బృందం నివేదికను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా జెపి మాట్లాడుతూ నివేదిక ప్రకారం రాష్ట్రంలో అభివృద్ధి దక్షిణాది రాష్ట్రాలతో పోలిస్తే చాలా తక్కువగా ఉందన్నారు. వ్యవసాయ, సేవారంగాలు తీవ్రంగా నష్టపోతున్నాయన్నారు.

నివేదికలోని ప్రధానాంశాలు

2014-15 సంవత్సరానికి వనరుల లోటు భర్తీకై చట్టంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం వేసిన అంచానా విలువ రూ.16,078.76 కోట్లు. రూ.4,117.89 కోట్లు ఇవ్వడానికి అంగీకరించిన బిజెపి ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.3,979.50 కోట్లు విడుదల చేసింది. కేంద్ర ప్రతిపాదిత పథకాల అమలు కోసం ఎపికి కేటాయిస్తానని చట్టంలో పేర్కొన్న మొత్తం రూ.16,447 కోట్లు కాగా, నేటికి అందింది కేవలం రూ.45 కోట్లే. జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించిన పోలవరం నిర్మాణానికి కేంద్రం ఫేజ్-1 కింద రూ.8,711 కోట్లు, ఫేజ్-2 కింద రూ.27,494 కోట్లు కేటాయించింది. ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు చేసిన ఖర్చులకు కేంద్రం ఇవ్వాల్సిన రాయితీలు రూ.3,342.40 కోట్లు. 11 జాతీయస్థాయి విద్యాసంస్థల ఏర్పాటు కోసం కేంద్రం వేసిన అంచనా విలువ రూ.12,746.38 కోట్లు కాగా ఇప్పటివరకు రాష్ట్రానికి ఇచ్చిన మొత్తం రూ.845.52 కోట్లు. వైజాగ్-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖ, విజయవాడ, తిరుపతి విమానాశ్రయాల విస్తరణ కోసం రూ.6,769 కోట్లు ఇవ్వాలని అంచనా వేసింది. పెట్రో-కెమికల్ కాంప్లెక్స్, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కుకర్మాగారం అమలులో కేంద్ర ప్రభుత్వం జాప్యం చేస్తోంది. రాజధాని నిర్మాణం కోసం రాష్ట్రం పంపిన ప్రతిపాదనల విలువ రూ.1,09,023 కోట్లు కాగా, ఇప్పటివరకు కేంద్రమిచ్చింది రూ.1,500 కోట్లేనని నివేదికలను వివరాలను జెపి వివరించారు.

చేసింది తక్కువ...చెప్పేది ఎక్కువ

గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన తీరు ఇది

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

నేడు జరగబోయే జన్మభూమి సభల్లో మౌలిక సదుపాయాల కల్పనపై చర్చ జరగనుంది. ఈ అంశంపై ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రం వెల్లడిచేయని అంశాలు ఇవి. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నప్పటికీ లక్ష్యాలను చేరుకోకపోవడంతో నేటికీ గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన అరకొరగానే ఉంది. చేపట్టిన కార్యక్రమాలు కొద్ది శాతం పూర్తయినా ప్రభుత్వం మాత్రం విస్తృతంగా ప్రచారం చేసుకుంటోంది.

రహదారులు : రాష్ట్రంలో 10,755 ప్రధాన రహదారి అనుసంధానం లేని ఆవాసాలు ఉండగా, ఎఐబి, స్టేట్ గ్రాంట్‌తో 5,894 ఆవాసాల అనుసంధానానికి మాత్రమే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో అంతర్గత రహదారులను సిసి రోడ్లుగా అభివృద్ధి చేసినట్లు ప్రభుత్వం చెప్పుకొస్తోంది. అంతర్గత రహదారులు మొత్తం 68,315 కిలోమీటర్లు ఉండగా నేటికీ 21,199 రహదారులను సిసి రోడ్లుగా అభివృద్ధి చేయాల్సి ఉంది.

డ్రైనేజీ : గ్రామాల్లో మురుగునీటి పారుదల వ్యవస్థ అస్థవ్యస్థంగానే ఉంది. పంచాయతీల్లో వారానికి ఒక రోజు కూడా డ్రైన్లు శుభ్రం చేయని పంచాయతీలు ఉన్నాయి. జియోట్యాగింగ్ విధానంతో డ్రైన్ క్లీనింగ్ విధానాన్ని



పర్యవేక్షిస్తామని ప్రభుత్వం చెబుతున్నా ఆచరణలో డ్రెయిన్ల నిర్వహణ సక్రమంగా జరగడం లేదని ఆర్టీజిఎస్ సర్వేలో స్పష్టమయ్యింది. రోజువారీ డ్రెయిన్లు శుభ్రం చేస్తున్నారని 21 శాతం మంది, వారానికి ఒక సారని 42 శాతం, రెండు వారాలకు ఒక సారని 12 శాతం, నెలకు ఒక సారని 25 శాతం మంది సర్వేలో సమాధానం ఇచ్చారు.

అంగన్వాడీ భవనాలు : గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలు సొంత భవనాలు లేక అద్దె ఇళ్లలో కొనసాగుతున్నాయి. ఈ ఏడాది 6,347 అంగన్వాడీ కేంద్రాల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతి ఇవ్వగా తొమ్మిది నెలల్లో కేవలం 973 మాత్రమే పూర్తి చేశారు.

స్టార్ రేటింగ్ : గ్రామాల్లో మౌలిక సదుపాలు, ఇతర అంశాల ఆధారంగా గ్రామాలకు స్టార్ రేటింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం కేటాయించగా 10 స్టార్‌ల లక్ష్యానికి మెజారిటీ గ్రామాలు 5 స్టార్‌లలోపే ర్యాంకింగ్ సాధించాయి. ఎనిమిది స్టార్లు సాధించినవి 8, ఏడు స్టార్లు 494, ఆరు స్టార్లు 4,264, ఐదు స్టార్లు 5,772, నాలుగు స్టార్లు 2,175, మూడు స్టార్లు 205 గ్రామాలు సాధించాయి.

ఎల్ఇడి దీపాలు : గ్రామాల్లో 27.52 లక్షల ఎల్ఇడి వీధి దీపాలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటి వరకూ 21.21 లక్షల ఎల్ఇడి వీధి దీపాలు మాత్రమే ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణ సక్రమంగా లేదు. ఆర్టీజిఎస్ సర్వేలో సమయానికి వెలగడం లేదని 22.07 శాతం, పగలే వెలుగుతున్నాయని 48.41 శాతం, మరమ్మతులు నిర్వహించడం లేదని 29.52 శాతం మంది సమాధానం ఇచ్చారు.

వ్యర్థాల నిర్వహణ : రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా 9 వేల క్లస్టర్లలో ఘన వ్యర్థాల నిర్వహణకు చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకూ 6,565 నిర్వహణ కేంద్రాలు ప్రారంభించారు. వాటిలో 3,355 కేంద్రాల్లోనే ఘన వ్యర్థాల నిర్వహణ అమలవుతోంది.

తాగునీరు : తాగునీటి సమస్య ఆరు జిల్లాల్లో అధికంగా ఉంది. ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలో 1,247 గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. ఈ గ్రామాల్లో ట్యాంకర్లు 7,921 ట్రిప్పులు వేసి నీటి సరఫరా చేయాల్సి ఉండగా 5,800 నుంచి 6,200 వరకూ ట్రిప్పులు మాత్రమే వేస్తున్నారు. కొన్ని చోట్ల అందరికీ తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. రానున్న రోజుల్లో ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశముంది.

మోడీలో అభద్రత పెరుగుతోంది

ఆర్థిక మంత్రి యనమల

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రధాని మోడీలో అసహనం, అభద్రత కొట్టొచ్చినట్లు కనబడుతోందని, అందుకే చంద్రబాబు కుటుంబంపై ఆయన వ్యాఖ్యలు చేస్తున్నారని ఆర్థిక శాఖా మంత్రి యనమల రామకృష్ణుడు అన్నారు. ఏపీ మనుగడను దెబ్బతీసేందుకు మోడీ కుట్రలు చేస్తున్నారని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ఆరోపించారు. ఐదు రాష్ట్రాల్లో బిజెపి చిత్తుగా ఓడిపోవడానికి మోడీ వైఫల్యమే కారణమన్నారు. వెనుబడిన జిల్లాలకు అధిక నిధులిచ్చామని చెప్పడం పచ్చి అబద్ధమని, ఏడాదికి ఒక్కో జిల్లాకు ఇచ్చింది కేవలం రూ.50 కోట్లు మాత్రమేనని అన్నారు. వెనుకబడిన జిల్లాలకు ఇచ్చిన రూ.350 కోట్లు వెనక్కి తీసుకున్న చరిత్ర మోడీదేనన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడే ధైర్యం లేకనే మోడీ వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా కార్యకర్తలతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. జనం నిరసనలకు భయపడే ఏపీ పర్యటనను మోడీ రద్దు చేసుకున్నారన్నారు. రాఫెల్ కుంభకోణంపై మోడీ మౌనం వెనుక మతలబు ఏమిటని ప్రశ్నించారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో అవినీతి గురించి మాట్లాడకుండా ఏపీలో అవినీతి అంటూ ప్రధాని మాట్లాడటం ఏపీపైన ఆయనకెంత కోపం ఉందో ఇట్టే అర్థమవుతోందన్నారు. సన్‌రైజ్ రాష్ట్రాన్ని మోడీ అపహాస్యం చేయడం బిజెపి నీచ ధోరణికి అద్దం పడుతోందన్నారు. తొలి ఏడాది ఆర్థిక లోటుకు ఇంకా రూ.12వేల కోట్లు ఇవ్వాలని ఆయన తెలిపారు. అవినీతి కేసుల్లో కోర్టుల చుట్టూ తిరుగుతున్న వారే అవినీతిపై పుస్తకాలు వేయడమంటే దయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పేర్కొన్నారు. దుష్టశక్తు లన్నీ టిడిపికి వ్యతిరేకంగా ఏకమయ్యాయన్నారు. దుష్టశక్తులకు సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెబుతారని తెలిపారు.

మున్సిపల్ టీచర్ల పిఎఫ్‌కు ఆర్థిక శాఖ ఆమోదం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

మున్సిపల్ టీచర్ల పిఎఫ్‌కు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపినట్లు పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్, ఎమ్మెల్సీ వి బాలసుబ్రమణ్యం తెలిపారు. ఈ సమస్యపై యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి పి బాబురెడ్డితో కలిసి సోమవారం ఆర్థిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఎం రవిచంద్రను కలిశామని, పిఎఫ్ ఖాతాలు ప్రారంభించడానికి ఆయన ఆమోదం తెలిపారని చెప్పారు. పిఎఫ్ ఖాతాలకు ఆర్థిక శాఖ ఆమోదం తెలిపిందని, తగు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ శాఖ డిప్యూటీ సెక్రటరీ వీరాంజనేయులును కోరామని చెప్పారు. కేంద్రప్రభుత్వ పథకంలో భాగంగా యుపి పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేసిన ఉర్దూ పాఠశాలల్లో మంజూరైన ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి తగు చర్యలు తీసుకోవాలని విద్యాశాఖ ప్రత్యేక ముఖ్యకార్యదర్శి ఆదిత్యానాథ్‌దాస్‌ను కోరగా ఆయన సానుకూలంగా స్పందిచారని తెలిపారు.

రాష్ట్రంలో ఉద్యోగులెంతమంది?

14లోగా వివరాలు పంపాలని ఆర్థిక శాఖ ఆదేశం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో ఉద్యోగులపై ప్రభుత్వం వివరాలు సేకరిస్తోంది. ఈ నెల 14లోగా తమతమ శాఖల్లోని ఉద్యోగుల వివరాలను అందించాలని ఆర్థిక శాఖ ఆదేశించింది. ఆయా శాఖల్లో ఎన్ని అనుమతించిన పోస్టులు ఉన్నాయి, వాటిల్లో పనిచేస్తున్న వారు ఎంతమంది అన్న వివరాలను సమర్పించాలంటూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఈ వివరాలను సిఎఫ్ఎంఎస్ ఫేజ్-2లో అమలుచేయనున్న హ్యూమన్ క్యామిటల్ మేనేజ్‌మెంట్‌లో పొందుపరచాలని నిర్ణయించినట్లు వివరించింది. హ్యూమన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌లో అధికారులు, ఉద్యోగుల మొత్తం వివరాలను పొందుపరచాలని నిర్ణయించారు. ఇందులో భాగంగానే ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను కూడా సిద్ధం చేశారు. హ్యూమన్ కేపిటల్ మేనేజ్‌మెంట్ మాడ్యూల్‌లో నిక్షిప్తం కార్యక్రమాన్ని రెండు దశల్లో అమలు చేయనున్నారు. తొలి దశలో ట్రెజరీ అధికారులు విభాగాల వారీగా ఉద్యోగుల వివరాలు అందించాల్సి ఉంటుంది. దీనిని హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఉద్యోగుల పే రోల్స్ నుంచి సేకరిస్తారు. ఈ వివరాలకు అదనంగా కొత్తగా చేరిన వారి వివరాలను జత చేయాల్సి ఉంటుంది. ఇదే సమయంలో ఎంతమంది సెలవులో ఉన్నారు. ఎంతమంది సస్పెన్షన్‌లో ఉన్నారన్న వివరాలు కూడా సమర్పించాల్సి ఉంటుందని ఆర్థికశాఖ స్పష్టం చేసింది. అలాగే ఆర్థికశాఖ అనుమతి పొందిన పోస్టుల వివరాలు కూడా స్పష్టంగా పేర్కొనాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెండో దశలో ఆయా శాఖల డిడిఓలు తమతమ కార్యాలయాల్లో వాటి వివరాలను ప్రదర్శించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియను 14లోగా పూర్తిచేసిన అనంతరం ప్రభుత్వానికి పంపించాల్సి ఉంటుంది. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ప్రకటించాల్సిన నంబర్ స్టేట్‌మెంట్‌కు కూడా ఈ వివరాలు ఉపయుక్తంగా ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

హోదా అడిగితే లాఠీచార్జా?

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో



ఎపికి ప్రత్యేకహోదా అడిగితే లాఠీచార్జి చేస్తారా అంటూ కేంద్రంపై సిపిఐ రాష్ట్రకార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం తమపై చేయించిన లాఠీచార్జిలో 11మంది గాయపడ్డారన్నారు. ఎపి విభజన హామీల్లో భాగమైన ప్రత్యేకహోదా కోరుతూ ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో తమపై లాఠీచార్జి చేయించిన కేంద్ర ప్రభుత్వ నిరంకుశత్వాన్ని ఆయన ఖండించారు. విజయవాడ దాసరిభవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోడీ బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ రాష్ట్రంపై కక్ష సాధిస్తున్నారని విమర్శనాస్త్రాలు సంధించారు. అటు దేశానికీ, ఇటు రాష్ట్రానికీ జరుగుతున్న అన్యాయాన్ని నిరసిస్తూ ఈ నెల 8,9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మె చేపడుతున్నామనీ, ప్రజలందరూ పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం గిన్నిస్‌బుక్ రికార్డు సాధించడానికి కృషి చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి, నిర్విరామ కృషి చేసిన 3600 మంది కార్మికులు, 500 మంది సిబ్బందిని సిపిఐ తరపున అభినందనలు తెలిపారు.

22 నుంచి 104 కాంట్రాక్టు సిబ్బంది సమ్మె

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఉద్యోగుల వేతనాలలో కోతలు విధించడం, వాహనాల మరమ్మతులు తదితర సమస్యలు పరిష్కరించకపోవడంతో ఈనెల 22 నుంచి చంద్రన్న సంచార చికిత్స (104) ఉద్యోగులు నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. సమస్యలపై నిర్వహణ సంస్థ పిరామిల్ యాజమాన్యంతో చర్చలు విఫలమైనందున ఈ నిర్ణయం తీసుకున్నామని 104 కాంట్రాక్ట్ ఉద్యోగుల సంఘం గౌరవాధ్యక్షులు ఎవి. నాగేశ్వరరావు సోమవారం ప్రకటనలో తెలిపారు. సిఎం చంద్రబాబు సమక్షంలో చేసుకున్న ఒప్పందంలోని అంశాలనే సదరు సర్వీస్ ప్రొవైడర్ అమలుచేయలేదని పేర్కొన్నారు. మరో మూడు నెలల్లో సంస్థ కాంట్రాక్ట్ గడువు ముగుస్తున్న నేపథ్యంలోనే కావాలనే ఉద్యోగులకు బకాయిలు చెల్లించకుండా యాజమాన్యం తాత్సారం చేస్తోందని విమర్శించారు. యాజమాన్యంతో చర్చలు జరపగా సిబ్బంది సమస్యలతో తమకు సంబంధంలేదని తేల్చిచెప్పినందున నిరవధిక సమ్మెకు పూనుకుంటున్నామని పేర్కొన్నారు.

సాక్షర భారత్ సమన్వయకర్తలే బాబును గద్దె దింపుతారు : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అక్షరాస్యత పెంచేందుకు మూల కారణమైన సాక్షర భారత్ సమన్వయకర్తలను తిరిగి విధుల్లోకి తీసుకోకపోతే, వచ్చే ఎన్నికల్లో వాళ్లే చంద్రబాబును గద్దె దింపుతారని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ అన్నారు. వయోజన విద్య ఒప్పంద ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విజయవాడ ధర్నా చౌక్‌లో సోమవారం చేపట్టిన మహాధర్నాకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్ని అక్షరాస్యులుగా మారుస్తున్న వారిని తొలగించి, ఇంటికి పొమ్మనడం కన్నా ఘోర మైన విషయం మరొకటి లేదన్నారు. ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు మాట్లాడుతూ సాక్షర భారత్ సిబ్బందిని మార్చిలో తొలగిస్తే జూన్‌లో నోటీసులివ్వడమేంటని ప్రశ్నించారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఆర్‌వి నరసింహారావు మాట్లాడుతూ సాక్షరభారత్ సిబ్బంది తలచుకుంటే చంద్ర బాబు మళ్లీ సిఎం అయ్యే అవకాశమే లేదన్నారు. శ్రామిక మహిళ రాష్ట్ర కన్వీనర్ ధన లక్ష్మి మాట్లాడుతూ కేంద్రం నుంచి నిధులొచ్చేలా చూసుకోవాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పోతిన మహేష్, వయోజన విద్య ఒప్పంద ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిద్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

జైళ్లలో సిసి కెమెరాలకు రూ.10 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని జైళ్లలో సిసి కెమెరాల కోసం రూ.10 కోట్లు వినియోగించుకునేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు హోం శాఖ ముఖ్య కార్యదర్శి ఎఆర్ అనురాధ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సెంట్రల్ జైల్, జిల్లా జైళ్లు, ప్రత్యేక సబ్‌జైళ్లు, సబ్ జైళ్లు మొత్తం కలిపి 44 ప్రాంతాల్లో సిసి కెమెరాల ఏర్పాటు కోసం ఈ నిధులను వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు.

గవర్నరును రక్షణ కోరిన బిజెపి నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని బిజెపి నాయకులకు రక్షణ కల్పించాలని ఆ పార్టీ నాయకులు తెలుగు రాష్ట్రల ఉమ్మడి గవర్నర్ నరసింహన్‌ను కోరారు. హైదరాబాదులోని రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను బిజెపి నాయకుల బృందం సోమవారం కలిసి వినతి పత్రాన్ని అందజేసింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని తెలి పారు. గుంటూరులో బిజెపి రాష్ట్ర అధ్య క్షులు కన్నా లక్ష్మీనారాయణ ఇంటిపై టిడిపి కార్యకర్త ల దాడి, కాకినాడలో బిజెపి మహిళా కార్పొరేట ర్‌ను ఫినిష్ అయిపోతావంటూ సిఎం చేసిన వ్యాఖ్యనించిన విషయాలను వినతి పత్రంలో పేర్కొన్నారు.

ప్రజ్ఞ

1. 42వ భారత సోషల్ సైన్స్ కాంగ్రెస్ ఎక్కడ జరిగింది?
2. సమాచార శాఖ కొత్త చీఫ్?
3. ఒక టెస్టు సిరీస్‌లో 20 క్యాచ్‌లు పట్టిన భారత తొలి వికెట్ కీపర్?
4. ఏ సెక్షన్ ప్రకారం ట్రాన్స్‌జండర్స్ కూడా లైంగిక వేధింపుల కేసు నమోదు చేయవచ్చు?
5. మానవ హక్కుల కమిషన్ ఫిర్యాదుల టోల్‌ఫ్రీ నెంబర్?

సమాధానాలు 7లో

నేటి నుంచి జెఈఈ మెయిన్స్

తొలిసారిగా ఆన్‌లైన్‌లో పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రతిష్టాత్మకమైన ఎన్ఐటి, ట్రిపుల్‌ఐటిలతో పాటు కేంద్ర విద్యా సంస్థల్లో ప్రవేశాలతో పాటు జెఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత కోసం నిర్వహించే జెఈఈ మెయిన్స్‌కు కౌంట్‌డౌన్ మొదలయ్యింది. మంగళవారం నుంచి శనివారం వరకు వరుసగా జెఈఈ మెయిన్స్ పరీక్షలు జరుగనున్నాయి. దేశవ్యాప్తంగా జరిగే ఈ పరీక్షల నిర్వహణకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. తొలిసారిగా ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తున్న జెఈఈ మెయిన్ ఇక నుంచి ప్రతి ఏటా రెండు సార్లు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మొదటి విడత పరీక్షలు ఈనెల 8 నుంచి 12 వరకు జరగనున్నాయి. ఇందుకోసం దేశ, విదేశాల్లో 273 పట్టణాల్లో పరీక్షా కేంద్రాల్ని ఏర్పాటు చేశారు. మొదటి విడత పరీక్షలకు దేశ వ్యాప్తంగా 9.65 లక్షల మంది దరాఖాస్తు చేసుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచి లక్షకుపైగా విద్యార్థులు హాజరయ్యే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏపీ నుంచి సుమారుగా 60 వేల మంది, తెలంగాణ నుంచి 70 వేల మంది వరకు దరఖాస్తు చేసుకున్నట్లు అధికారులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో విజయవాడ, గుంటూరు, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురం, బాపట్ల, భీమవరం, చీరాల, చిత్తూరు, ఏలూరు, కడప, కాకినాడ, కర్నూలు, నెల్లూరు, ఒంగోలు, రాజమండ్రి, శ్రీకాకుళం, తాడేపల్లిగూడెం, విజయనగరం పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. తెలంగాణలో హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, నల్గొండ పట్టణాల్లో పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఫలితాలు ఈ నెల 31న విడుదల చేయనున్నారు. రెండో విడత పరీక్షలు ఏప్రిల్‌లో నిర్వహిస్తారు. జెఈఈ మెయిన్స్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకుకోవాలని అధికారులు తెలిపారు.

నాలుగు రోజుల పాటు జరిగే పరీక్షలను ప్రతి రోజూ రెండు షిఫ్టుల్లో నిర్వహించనున్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు, రెండో షిఫ్ట్ 2:30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయి. విద్యార్థులను రెండు గంటల ముందు పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తారు. ఉదయం పరీక్షకు 8:45 నుంచి 9 గంటల వరకు, మధ్యాహ్నం పరీక్షకు 1:45 నుంచి 2 గంటల వరకు మాత్రమే విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతిస్తామని, ఆ తరువాత నిమిషం లేటైనా అనుమతించబోమని ఎన్‌టిఏ స్పష్టం చేసింది. విద్యార్థులకు కేటాయించిన కేంద్రంలోనే అడ్మిట్ కార్డులో పేర్కొన్న షిఫ్ట్‌లోనే పరీక్ష రాయాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సమరోత్సాహం

సార్వత్రిక సమ్మెకు రాష్ట్రం సిద్ధం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కార్మికుల, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం మంగళ, బుధవారాల్లో జరగనున్న దేశవ్యాప్త సమ్మెకు రాష్ట్రంలో అన్ని కార్మిక, ఉద్యోగ, ప్రజా సంఘాలు ఐక్యంగా సిద్ధమయ్యాయి. సమ్మెకు రాష్ట్రంలో వామపక్షాలు మద్దతు ప్రకటించాయి. జనసేన అధినేత పవన్‌కళ్యాణ్‌ను వామపక్ష నాయకులు కలిసి మద్దతు కోరగా సానుకూలంగా స్పందించారు. సమ్మెలో భాగంగా 8న అన్ని సంఘాలు ఆయా పరిశ్రమలు, సంస్థలవద్ద పదర్శనలు జరిపి సభలను నిర్వహించనున్నారు. 9న ప్రభుత్వ కార్యాలయాలతో పాటు పలు ప్రాంతాల్లో మానవ హారాలు చేపట్టనున్నాయి. 2016 సెప్టెంబర్‌లో నిర్వహించిన సమ్మెలో 18 కోట్ల మంది పాల్గొన్నారని, ప్రస్తుత సమ్మెలో దాదాపు 25 కోట్ల నుంచి 30 కోట్ల మంది పాల్గొంటారని కార్మిక సంఘాల నాయకులు ప్రకటించారు. సార్వత్రిక సమ్మెకు ఏ ఆంక్షలూ పెట్టకుండా ప్రదర్శనలు, నిరసనలను అనుమతించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ సిఐటియు, ఎఐటియుసి నాయకులు శాంతి భద్రతల అడిషనల్ డిజి హరీష్ కుమార్ గుప్తాకు వినతిపత్రం సమర్పించారు. కౌలు, రైతు, కార్మిక సంఘాలూ సమ్మె విజయవంతం కోసం ఐక్య సమావేశాలు నిర్వహించాయి. 9న గ్రామీణ బంద్ పేరుతో చేపట్టే కార్యక్రమంలో రైతులు రాస్తారోకోలు, హైవే దిగ్బంధాలు చేపట్టనున్నారు.

ఈ సమ్మెలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎన్‌టియుసి, హెచ్‌ఎంయు, టియుసిసి, ఐఎఫ్‌టియు, వైఎస్‌ఆర్‌టియు సంఘాలతో పాటు వాటి అనుబంధ సంఘాల కార్మికులు సమ్మెలో పాల్గొనున్నారు. బ్యాంకింగ్, బీమా, టెలికం వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల ఉద్యోగులు, కార్మికులూ సిద్ధమయ్యారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించి బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (బెఫీ), ఆలిండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐబిఇఎ), ఆలిండియా రీజినల్ రూరల్ బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఎఐఆర్‌ఆర్‌బిఇఎ), బీమా రంగంలో ఉన్న ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేన్ (ఎఐఐఇఎ), టెలికం రంగానికి సంబంధించి బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ యూనియన్, బిఎస్‌ఎన్‌ఎల్ ఎంప్లాయీస్ అసోసియేషన్, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ టెలికం ఎంప్లాయీస్ (ఎన్‌ఎఫ్‌టిఇ)తో పాటు ఇతర సంఘాలు సమ్మెలో పాల్గొననున్నాయి.

సమ్మెకు మద్దతుగా ఆర్టీసి బంద్

జాతీయ కార్మిక, ఉద్యోగ సంఘాల పిలుపు మేరకు చేపట్టనున్న దేశవాప్త సార్వత్రిక సమ్మెకు మద్దతుగా మంగళ, బుధవారం ఆర్టీసి బంద్ చేపట్టనున్నట్లు ఆర్టీసి ఎంప్లాయీస్ యూనియన్ (ఇయు), స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), యునైటెడ్ వర్కర్స్ యూనియన్, బహుజన వర్కర్స్ యూనియన్ నాయకులు ప్రకటించారు. ఆర్టీసిలో వేతన సవరణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఎన్ఎంయు ఆధ్వర్యంలో కార్మికులు విధులకు హాజరై నిరసన ప్రదర్శన, ధర్నాలు చేపట్టనున్నారు.

నేడు విద్యాసంస్థల బంద్

విద్యార్థులు, యువకుల పట్ల మోడీ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, పిడీయస్‌యు, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా విద్యాసంస్థల బంద్ నిర్వహించనున్నాయి.

ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శ కసాపురం రమేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రంగన్న, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి సూర్యారావు, ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లెనిన్, పిడియస్‌యు రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యా రంగాన్ని పూర్తిగా ప్రైవేటీకరణ, కాషాయీకరణ చేయడానికి కేంద్రంలోని మోడీ సర్కార్ కుట్ర పన్నుతోందని, దీనికి నిరసనగా కార్మిక సంఘాలు చేపట్టిన సమ్మెకు మద్దతుగా బంద్‌కు పిలుపునిచ్చినట్లు తెలిపారు.

ఎస్టీయు మద్దతు

నేడు, రేపూ నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెకు ఎస్టీయు మద్దతు ప్రకటించింది. ఈ మేరకు యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సిహెచ్ జోసెఫ్ సుధీర్ కుమార్, గాజుల నాగేశ్వరరావు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

అన్ని చోట్లా పెద్ద సంఖ్యలో పాల్గొనాలి

కార్మికులు సమ్మెలో అన్ని చోట్లా పెద్ద సంఖ్యలో పాల్గొనాలి. సిఐటియుగా 22 రంగాలకు సంబంధించిన సమస్యలను వివరిస్తూ ఆయా రంగాలకు వేర్వేరుగా కరపత్రాలు ముద్రించి కార్మికుల్లో ప్రచారం నిర్వహించాం. సమ్మెలో సిపిఎస్ ఉద్యోగులు, ఎన్జీఒ సంఘాలు, స్కీం వర్కర్లు కూడా పాల్గొననున్నారు.

- ఎంఎ గఫూర్, సిఐటియు ప్రధాన కార్యదర్శి

పరిష్కారానికి ప్రభుత్వాలు పూనుకోవాలి

50 లక్షల మంది కార్మికులకు కనీస వేతనాలు అందడం లేదు. అన్ని రంగాల కార్మికులు ప్రభుత్వం పట్ల తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. సార్వత్రిక సమ్మెలో ఆ ఆగ్రహం మరింత ఎక్కువ కానుంది.

- జి ఓబులేసు, ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి

కార్మికులు ఏకస్వరంతో ప్రశ్నించాలి

పది లక్షల మంది ఉద్యోగులు, వారి కుటుంబాల కంటే పది కార్పొరేట్ బకాయి దారుల శ్రేయస్సే ముఖ్యమన్న విధంగా వ్యవహరిస్తున్న మోడీ విధానాలను ఉద్యోగులు, కార్మికులు ఏక స్వరంతో ప్రశ్నించాలి.

- ఆర్ అజయకుమార్, బెఫీ ప్రధాన కార్యదర్శి

సమ్మెతో బిజెపి పతనం ఖాయం

దేశ వ్యాప్తంగా మంగళ, బుధవారాల్లో నిర్వహించే సార్వత్రిక సమ్మెతో కేంద్రంలో బిజెపి ప్రభుత్వ పతనం ఖాయమని ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు జి.సంజీవరెడ్డి వ్యాఖ్యానించారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రయివేటు రంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని విమర్శించారు. అంబానీ, ఆదానీలు వంటి బడా పారిశ్రామిక వేత్తలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షులు సంజీవరెడ్డి

ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లు అరెస్టు

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

రాయచోటి రూరల్ పరిధిలోని సంబేపల్లె, వీరబల్లి, సుండుపల్లె మండలాల్లో నిర్వహించిన దాడుల్లో ఆరుగురు ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు పులివెందుల డిఎస్‌పి నాగరాజు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక అర్బన్ పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ స్మగర్ల నుంచి రెండు వాహనాలు, 14 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నామన్నారు. పోలీసులు దాడులు నిర్వహిస్తుండగా స్మగ్లర్లు ఎదురుదాడి చేశారని చెప్పారు. చింత ధర్మేంద్ర, మడితాడు నాగరాజు, పెనుబడి మల్లికార్జున, రవి, రాజేంద్ర, వెంకటరమణలను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. గతంలో వీరిపై పలు కేసులు నమోదైనట్లు తెలిపారు. సమావేశంలో రాయచోటి రూరల్ సిఐ నరసింహరాజు, సంబేపల్లె ఎస్‌ఐ మహ్మద్‌హాషీం, సుండుపల్లె ఎస్‌ఐ నరసింహారెడ్డి, పాల్గొన్నారు.

శంకుస్థాపన



నిడదవోలులో రైల్వే ఓవర్‌బ్రిడ్జి శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు

అవిశ్వాసం పెట్టినందుకే కక్ష

- నాపై బురద జల్లడానికే ఎన్ఐఎకు జగన్ కేసు
- ఎన్‌టిఆర్ గురించి మాట్లాడే నైతికత మోడీకి లేదు
- నిడదవోలు జన్మభూమి సభలో సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

ప్రధాని మోడీకి ఇగో ఎక్కువని, తాను తగ్గించుకుని సార్..సార్.. అని గౌరవించినా తానిచ్చిన గౌరవాన్ని కాపాడుకోలేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. రాజధాని అమరావతి శంకుస్థాపనకు వచ్చి మట్టి, నీళ్లు ఇచ్చినప్పుడే మోడీ మోసం అర్థమైందన్నారు. హోదా ఇస్తారనే ఆశతోనే కొంతకాలం సహించానన్నారు. పశ్చిమగోదావరి జిల్లా నిడదవోలులో సోమవారం రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సిఎం శంకుస్థాపన చేసి, అన్న క్యాంటీన్‌ను ప్రారంభించారు. అనంతరం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల మైదానంలో జరిగిన జన్మభూమి సభలో ఆయన మాట్లాడారు. టిడిపి అవిశ్వాస తీర్మానం పెట్టినందునే మోడీ తనపై కక్షగట్టారన్నారు. పెద్దనోట్ల రద్దు పిచ్చి తుగ్లక్ పని అని విమర్శించారు. ఎన్‌టిఆర్ గురించి మాట్లాడే నైతిక హక్కు మోడీకి లేదన్నారు. తాత ఎన్‌టిఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వస్తానని చెప్పి రాజకీయ ప్రవేశం చేశారన్నారు. నా కుటుంబాన్ని కూడా వీధిలోకి లాగాలని చూస్తున్నారని మండిపడ్డారు. రాజకీయాలపై తన కుటుంబం ఆధారపడకూడదనే ఉద్దేశంతోనే హెరిటేజ్ సంస్థను స్థాపించానని, తన భార్య ఈ సంస్థను నిర్వహిస్తున్నారని తెలిపారు. ఐటి చదవిన లోకేష్ పంచాయతీరాజ్ శాఖ మంత్రిగా రాణిస్తున్నారన్నారు. మోడీది విభజించి పాలించే విధానమని, తన మాట వినని వారిని కేసుల్లో పెట్టి ఇబ్బంది పెట్టడం మోడీ నైజమని అన్నారు. జగన్‌పై దాడి కేసును ఎన్ఐఎకు అప్పగించడం దీనిలో భాగమేనన్నారు. రూ.43 వేల కోట్ల రాఫెల్ యుద్ధ విమాన కొనుగోళ్లను తన స్నేహితునికి ఇచ్చిన ప్రధానిని చోర్ ప్రధాని అని దేశమంటోందని చంద్రబాబు తీవ్రంగా విమర్శించారు. ఇన్ని అవార్డులొస్తుంటే...జగన్ రాష్ట్రంలో రూ.6 లక్షల కోట్లు అవినీతి జరిగిందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అమిత్‌షా కుమారుడిపై ఎందుకు విచారణలు చేయడం లేదని ప్రశ్నించారు. కార్యక్రమాల్లో మంత్రులు పితాని సత్యనారాయణ, జవహర్, రాజమహేంద్రవరం ఎంపీ మాగంటి మురళీమోహన్, నిడదవోలు ఎంఎల్ఎ బూరుగుపల్లి శేషారావు పాల్గొన్నారు.

డిస్కమ్‌ల లోటును ఎలా భర్తీ చేస్తారు?

- ఛార్జీలు పెరగవని భరోసా ఇవ్వాలి
- ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందా? లేదా? ప్రకటించాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.నర్సింగరావు
- ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణలో రైతుల ఆందోళన



ఎపిఇఆర్‌సి బహిరంగ విచారణలో మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు సిహెచ్.నర్సింగరావు

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

రాష్ట్రంలో సామాన్యులపై విద్యుత్ ఛార్జీలను పెంచబోమని ప్రభుత్వం చెప్పడం 2019 ఎన్నికల స్టంట్‌లో భాగమేనని, ఎన్నికలనంతరం ప్రజలపై విద్యుత్ భారాలు పొంచివుండే ప్రమాదం లేకపోలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు సిహెచ్.నర్సింగరావు చెప్పారు.. విశాఖలో సోమవారం ఇపిడిసిఎల్ కార్యాలయంలో ఎపిఇఆర్‌సి 'పబ్లిక్ హియరింగ్' జరిగింది. విశాఖ జిల్లా నుంచి ఎపి రైతు సంఘం ఆధ్వర్యాన పలువురు రైతులు బెల్లం పంటకు ఉచిత విద్యుత్ ఇవ్వాలని, పరిశ్రమగా కాకుండా వ్యవసాయంగా బెల్లం పంటను చూడాలని నినదించారు. సంఘం నాయకులు బాలకృష్ణ, అప్పారావు, మత్సరాజు ఆధ్వర్యాన పలువురు బెల్లం రైతులు చైర్మన్ భవానీప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్.నర్సింగరావు, ఎపి రైతు సంఘం పూర్వ అధ్యక్షులు బి.తులసీదాస్ వీరికి మద్దతు తెలిపారు.

'రాష్ట్ర డిస్కమ్‌ల రెవెన్యూ లోటు రూ.8963 కోట్లు ఉన్నప్పుడు దీన్ని ఎలా పూడ్చుతారు. ప్రభుత్వం సబ్సిడీ ఏమైనా ఇస్తుందా?. అలా చేస్తేనే ప్రజలపై భారం ఉండదు. ఇచ్చే ఆలోచన ఉంటే వెంటనే ప్రకటించాలి. లేదంటే ఎన్నికల తర్వాత భారం తప్పేలా లేదని ఇఆర్‌సి విడుదల చేసిన టారిఫ్‌లో ఈ అంశం అనుమానాలను రేకెత్తిస్తోంది' అని నర్సింగరావు అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ మిగులు ఉందని, అయితే, ప్రజలకు కొనుగోలు శక్తి పెరగడం లేదని, ఇది ఆందోళన కలిగించే విషయమని వివరించారు. విద్యుత్ రంగంలో ఎపి నెంబర్ వన్ స్థానంలో ఉందని, అయితే దీర్ఘకాలిక విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు (పిపిఎ) సరికాదని అన్నారు. కృష్ణాగోదావరి (కెజి) బేసిన్ నుంచి ఉత్పత్తి అవుతున్న గ్యాస్‌ను రిలయన్స్ కంపెనీ నేరుగా గుజరాత్‌కు తరలిస్తుందని, దీని ఆధారంగా నిర్మించబడిన 3వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన గ్యాస్ ఆధారిత విద్యుత్ కర్మాగారాలకు గ్యాస్ ఇవ్వనందున జిఎంఆర్, వేమగిరి, గౌతమి, జివికె, కోనసీమ కర్మాగారాలు మూతపడ్డాయని అన్నారు. ప్రభుత్వం వీటికి గ్యాస్‌ను సరఫరా చేసే చర్యలు చేపడితేనే పైన రెవెన్యూ లోటు రూ.వేలకోట్ల భారం భవిష్యత్‌లో ప్రజలపై పడకుండా ఉంటుందని సూచించారు. విద్యుత్ ఛార్జీలు పెంచకుండా విద్యుత్ రంగాన్ని బాగా నడపవచ్చున్న విషయాన్ని వైఎస్.రాజశేఖరరెడ్డి 2004లో చూపించాడన్నారు. రాష్ట్రంలో సోలార్, పవన్ (విండ్) విద్యుత్ వినియోగం బాగా పెరిగిందని, అయితే వీరికి చెల్లించే ధరలు అధికంగా ఉంటున్నాయని దేశంలో యూనిట్ రూ.2.35కు లభిస్తున్నా మన రాష్ట్రంలో రూ.4కుపైగా చెల్లించడం దారుణమని పేర్కొన్నారు. ప్రభుత్వ విద్యుత్‌రంగ సంస్థల్లో 50శాతానికి పైగా కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వీరికి సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని సూచించారు. విజయనగరం జిల్లాలో ఫెర్రోఎల్లోయిాస్ పరిశ్రమలు గ్రామీణ ప్రాంత ఆధారంగా ఏర్పాటయ్యాయని, వాటికి రూ.4.16పైసలు యూనిట్ ఛార్జీలు వసూలు చేయడం తగదని నర్సింగరావు పేర్కొన్నారు. దీనికి ఎపిఇఆర్‌సి చైర్మన్ జస్టిస్ భవానీప్రసాద్ స్పందిస్తూ.. పరిశ్రమల బకాయిలను ప్రభుత్వం రద్దుచేసినా, ఆయా యాజమాన్యాలు 'ఓపెన్ యాక్సెస్'కి వెళ్లకుండా కార్మిక నాయకులుగా అడ్డుకోవాలని, సంస్థను కాపాడాలని, డిస్కమ్‌ల విద్యుత్‌నే వాడేలా చేయాలని కోరారు.

ఎపి రైతు సంఘం పూర్వ అధ్యక్షులు బి.తులసీదాస్ ఇఆర్‌సి ఎదుట తన వాదన వినిపిస్తూ...100 యూనిట్ల వరకూ ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఎలా ఇస్తున్నారో, అలాగే వంద యూనిట్లను వాడేవారిని పేదలుగా గుర్తించి ఉచిత విద్యుత్ అందేలా ఎపిఇఆర్‌సి ప్రభుత్వానికి ప్రతిపాదించాలని సూచించారు.

విద్యుత్ ఛార్జీల పెంచమంటూనే ఇంధన, పూల్‌అప్ ఛార్జీలు గతంలో సర్దుబాటు చేస్తూ పెంచారని ఎద్దేవా చేశారు. దీనికి చైర్మన్ భవానీప్రసాద్ స్పందిస్తూ.. రెగ్యులేటరీ అసెట్స్ సృష్టి పేరుతో అలాంటివి జరగవని, ట్రూ అప్స్ (సామాన్యులపై విద్యుత్ భారాలు) ఉండవని, గడచిన నాలుగేళ్లలోనూ చేయలేదని భరోసా ఇచ్చారు. భవిష్యత్‌లో తప్పని పరిస్థితి వస్తుందేమో? అని చైర్మన్ చెబుతూనే.. ప్రభుత్వంపై భారమైనా.. ప్రజలపై వేయబోమన్నారు.

రంగా విగ్రహం తొలగింపు వివాదం

ఆందోళనతో వెనుదిరిగిన అధికారులు

ప్రజాశక్తి - తెనాలిటౌన్ (గుంటూరు జిల్లా)



వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని తొలగించేందుకు మున్సిపల్ అధికారులు ప్రయత్నించటం గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో సోమవారం ఉద్రిక్తతకు దారి తీసింది. పోలీసుల చొరవ, మున్సిపల్ అధికారుల వివరణతో వివాదం సద్దుమణిగింది. స్థానిక నందులపేట టీఎన్‌సీ క్లబ్ రోడ్డులో ఈనెల 6న నిర్వహించిన కాపు సంఘీయుల ఆత్మీయ సమావేశం సందర్భంగా మోహనరంగా విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే దీనికి అనుమతిలేదని తొలగించేందుకు సోమవారం తెల్లవారు జామున పొక్లెయిన్‌తో మున్సిపల్ అధికారులొచ్చారు. విగ్రహం దిమ్మెను పగులగొట్టారు. ఇది తెలిసిన కాపు సామాజిక తరగతికి చెందిన వారు అక్కడికి చేరుకుని విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. ఒన్‌టౌన్, టూటౌన్ సిఐలు సిబ్బందితో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఈలోగా అక్కడికి చేరుకున్న టిపిఐ వెంకటేశ్వరరావు విగ్రహానికి సంబంధించి ఇబ్బందేమీ లేదని, భవిష్యత్‌లోనూ దాని జోలికి రాబోమని పేర్కొనడంతో ఆందోళన విరమించారు.

సంపాదకీయం

ప్రజలా? పశువులా?

'ఆర్య సంతతి నేడు పశుప్రాయమై పోయిందనీ అజ్ఞానమనే మబ్బు ఈ మాతృభూమిని కప్పి వేసిందనీ కలత చెందుతున్నారా? నిజమైన దేశభక్తికి ఈ హృదయ స్పందనే తొలి మెట్టు' అన్న స్వామి వివేకానందుడు సంఘ్ పరివారం వంటి వారి దురాగతాలను నాడే ఊహించి ఉంటారు. హిందూ మతోన్మాదాన్ని భక్తి విశ్వాసాలతో ముడిపెట్టి పశువుల రక్షణ కోసం మనుషులను నిర్దాక్షిణంగా చంపుతున్న అఘాయిత్యాలు ఆధునిక యుగంలో చోటు చేసుకుంటున్నాయి. గోరక్షణ ముసుగులో ఆర్ఎస్ఎస్ పరివారం ముస్లింలు, దళితులపై దుర్మార్గపు దాడులు, హత్యలకు బరితెగిస్తుండటం చూస్తూనే ఉన్నాం. బిజెపి పాలిత రాష్ట్రాల్లో శాంతిభద్రతలు ఎంతగా క్షీణించాయో తెలిసిందే. 'పరివారం' ఒత్తిళ్లననుసరించి పశువుల కొనుగోళ్లు, అమ్మకాలపై కేంద్రం 2017లో నిషేధం విధించింది. అందుకోసమే చూస్తున్న బిజెపి రాష్ట్రాలు పశువుల క్రయ విక్రయాలను, ఒట్టిపోయిన పశువుల కోతను, కబేళాలను నిషేధించాయి. నిషేధాన్ని అమలు చేయడంలో 'నాగపూర్' మానస పుత్రుడు యోగి ఆదిత్యనాథ్ కొలువు దీరిన ఉత్తరప్రదేశ్ ముందు వరుసలో ఉంది. గోసంరక్షణ పేరుతో గ్రామాల్లో స్వైర విహారం చేస్తున్న హిందూ మతోన్మాద ప్రైవేటు సైన్యాల ఆగడాలకు, నిషేధ ఉత్తర్వులను విచక్షణ కోల్పోయి అమలు చేస్తున్న పోలీసులకు, మత విశ్వాసాలకు భయపడుతున్న రైతులు చేసేది లేక ఒట్టిపోయిన ఆవులను, ఎడ్లను వీధుల్లోకి వదిలేశారు. అవి కట్టుతప్పి తమ పొలాలపైనే పడి పంటలను, చివరికి తిండి గింజలను సైతం ధ్వంసం చేస్తుండటంతో ఆగ్రహించి యోగి సర్కారుపై రైతులు సమరానికి దిగారు. రైతుల నిరసనలను తగ్గించేందుకు పశువులను పాఠశాలకు తరలించి పిల్లలకు సెలవులు ప్రకటించింది ప్రభుత్వం. ప్రాథమిక వైద్య కేంద్రాల్లో పశువులను కట్టేసి రోగులకు చికిత్సలను నిలిపేశారు. భావి పౌరులకు విద్యాభ్యాసం, పేద ప్రజలకు వైద్య సౌకర్యాల కంటే ఒట్టిపోయిన పశువుల సంరక్షణే యోగి సర్కారుకు ప్రధానమైంది. అయినా పశువుల బాధ రైతులకు, గ్రామీణులకు తీరలేదు.

పశువుల బెడదకు యోగి సర్కారే కారణమని, సమస్యను పరిష్కరించకపోతే లోక్‌సభ ఎన్నికల్లో బిజెపికి ఓటేసేది లేదని రైతులు అల్టిమేటం ఇచ్చేసరికి, అసలే రైతుల కోపాగ్నికి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలను చేజార్చుకున్న వేళ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో మొత్తానికే తమ పార్టీ పుట్టి మునుగుతుందని భయపడ్డారు సిఎం యోగి. అంతే, ప్రభుత్వం ఆధ్వర్యంలో గోసంరక్షణ కేంద్రాల నిర్వహణకు ప్రజలపై ప్రత్యేకంగా పన్నులు బాదేందుకు నడుంకట్టారు. ఎక్సైజ్ సంబంధమైన మద్యం, ఇతర వస్తువులు, టోల్ ట్యాక్స్ తదితరాలపై అర శాతం సెస్సు విధించారు. ప్రజల వద్దనున్న ఒట్టిపోయిన, ఎందుకూ కొరగాని పశువులను సాకడానికి ప్రజలే అదనపు పన్నులు చెల్లించాలనడం ఎవరిని సంరక్షించే పని? అంతేకాదు, పశువులను బయటికి వదిలే వారిని ప్రభుత్వ భవనాల్లో నిర్బంధించి సంఘ విద్రోహ శక్తులుగా ముద్ర వేస్తామంటున్నారు. దానర్థం ఎలాంటి ఉపయోగం లేకున్నా పశువుల యజమానులు బలవంతంగా వాటిని సాకాలనడమే. ఏదైనా అనాలోచిత పని చేసే వారిపై తెలుగులో ఒక సామెత ఉంది. 'అడుసు తొక్కనేల కాలు కడగనేల' అని. యోగి ప్రభుత్వం వాలకం చూస్తుంటే 'అడుసు తొక్కుతాం. దానితో ఆగకుండా ప్రజలను సైతం అడుసు లోకి నెడతాం' అన్నట్లు కనిపిస్తోంది.

ఇటీవల కేరళ రాష్ట్రాన్ని అనూహ్య వరదలు ముంచెత్తడంతో లక్షలాది మంది ప్రజల బతుకులు ఛిద్రమయ్యాయి. రూ.వేల కోట్ల మేర ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులు, పంటలు నామరూపాల్లేకుండా పోయాయి. కేరళ కుదుట పడాలంటే రూ.వేలాది కోట్ల నిధులు అవసరం. ఘోర కలితో చిన్నాభిన్నమైన ప్రజలకు ఆసరా కల్పించేందుకు, రాష్ట్ర పునర్నిర్మాణానికి నిధుల సమీకరణ నిమిత్తం అక్కడి వామపక్ష సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం జిఎస్‌టి పన్నుపై లెవీ సెస్సును విధించేందుకు ఉపక్రమించింది. జిఎస్‌టి చట్టంలో పొందుపర్చిన క్లాజులకు లోబడి సెస్సు వసూలు చేసేందుకు అనుమతి కోరుతూ కేంద్రానికి, జిఎస్‌టి మండలికి విజ్ఞప్తి చేసింది. ప్రధానంగా ప్రజలు కొనుగోలు చేసే లగ్జరీ వస్తువులపైనే సెస్సు వేయాలనుకుంది. భారీ విపత్తు బారిన పడ్డ కేరళకు నిధులిచ్చే విషయంలో కేంద్రంలోని బిజెపి సర్కారు పక్షపాతం చూపింది. ఎల్‌డిఎఫ్ ప్రభుత్వాన్ని ఇబ్బందులపాల్జేసేందుకు సంఘ్ పరివారం, హిందుత్వ శక్తులు కేరళకు విపత్తు సాయం చేయొద్దని నానాయాగీ చేశాయి. శబరిమల పేరుతో మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ అరాచకాలు సృష్టిస్తున్నాయి. కేంద్రం ఆపన్నహస్తం అందించపోయినా దేశ ప్రజల సంఘీభావంతో, కేరళ ప్రజల మద్దతుతో ఎల్‌డిఎఫ్ సర్కారు రాష్ట్ర పునర్నిర్మాణ కార్యక్రమాలను చేపట్టి జనంలో భరోసా పాదుకొల్పింది. ప్రజల సంక్షేమం కోసం కేరళ ఎల్‌డిఎఫ్ సర్కారు ప్రజలపై పరిమిత సెస్సు వసూలుకు పూనుకోగా, ఇదే సమయంలో యూపిలో యోగి సర్కారు హిందూ మత విశ్వాసాల పరిరక్షణ పేరిట గోసంరక్షణ కేంద్రాల నిర్వహణకు భారీ పన్నులు బాదుతోంది. ఇదీ కేరళకు, యూపికి మధ్య మౌలిక వ్యత్యాసం.

ఇదీ విషయం



మరణం నా చివరి చరణం కాదు
మౌనం నా చితాభస్మం కాదు
నిర్విరామంగా నిత్య నూతనంగా
కాలం అంచున చిగురించే నెత్తుటి ఊహను నేను

- అలిశెట్టి ప్రభాకర్

తృతీయ శక్తిపై కుటిల ప్రచారాలు

విశ్లేషణ



తెలకపల్లి రవి



నూతన సంవత్సరం 2019 తొలి వారమే ఎ.పి రాజకీయాల్లో కీలకమైన మలుపులకూ మార్పులకూ శ్రీకారం చుట్టింది. గతంలో దాగుడు మూతలాడుతున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పోకడలు, టిడిపి వైసీపీ టిఆర్ఎస్ రాజకీయ వ్యూహాలు మరింతగా బహిర్గతమైనాయి. మరో 100 రోజుల్లో ఎన్నికలు వస్తాయన్న అంచనాల మధ్య దేశ రాజకీయమే వేడెక్కుతున్నది. తెలంగాణ ముందస్తు తర్వాత ఎ.పి సాధారణ ఎన్నికలు కూడా అంతకంటే ఉత్కంఠ భరితంగా వుంటాయన్న సంకేతాలు గోచరిస్తున్నాయి.

తెలంగాణ ఎన్నికలలో ఘన విజయం సాధించిన టిఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కెసిఆర్ ఎ.పి రాజకీయాల్లోనూ ప్రవేశించి చంద్రబాబు నాయుడుకు వ్యతిరేకంగా పని చేస్తానని ప్రకటించడంపై చాలానే చర్చ జరిగింది. విశాఖపట్నంలో రాజకీయ క్రియాశీల స్వామి సంపూర్ణానంద ఆశ్రమంలో విందారగించడం, తనను ప్రజలు గొప్పగా స్వాగతించారని కెసిఆర్ చెప్పడం అన్నీ రాజకీయమే. వైసీపీ నేత జగన్‌తో సహా చాలా మందికి ఈ స్వామితో సంబంధాలున్నాయి. ఈ పరిణామాలపై టిడిపి ఆరోపణలు చేసిన తర్వాత కెసిఆర్ ఎన్నడూ లేని స్థాయిలో చంద్రబాబుపై విరుచుకుపడ్డారు. టిడిపి కాలంలో వీరిద్దరూ కలసి పని చేసిన, విభేదించిన ఉదంతాలు ప్రస్తావనకు వచ్చాయి. విభజన తర్వాత కూడా రెండు రాష్ట్రాలలో పాలక వర్గ పార్టీలు, నేతల ప్రయోజనాలు పరస్పరం ముడి పడే వున్నాయని దీన్నిబట్టి విదితం. ఈ పరస్పర పర్యటనలు స్వాగతించదగినవే అయినా ఎ.పి ఎన్నికల పోరాటం కెసిఆర్ కేంద్రంగా జరగబోదు. సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రిగా పని చేసిన చంద్రబాబు తెలంగాణలో ప్రభావం చూపనప్పుడు కొత్త రాష్ట్రాధినేత ఎ.పిలో నిర్వహించగలిగిన ప్రత్యక్ష పాత్ర చాలా పరిమితంగానే వుంటుంది. తెలంగాణ విభజన నేపథ్యంలో మొలకెత్తిన ప్రాంతీయ ప్రభావాలు విముఖతలూ లేకుండా పోవు. కనుక కెసిఆర్‌ను ముందు పెట్టుకుంటే బాగా ప్రయోజనమని ఎవరైనా అనుకుంటే పొరబాటవుతుంది.

గజిబిజి ప్రకటనల ప్రయోగం

తెలంగాణలో భంగపడిన టిడిపి అధినేత దానికి విరుగుడుగా ఎ.పిలో ప్రచారకాండ మరింత ఉధృతం చేశారు. ప్రతిపక్షాలపై దుమ్మెత్తిపోస్తున్నారు. ఓటమి నుంచి సరైన పాఠాలు తీసుకోలేకపోగా కెసిఆర్‌తో జగన్, పవన్, మోడీ కుమ్మక్కయ్యారంటూ దాడి ప్రారంభించారు. 'ప్రత్యేక హోదాకు కెసిఆర్ అడ్డంకి' అని ఆరోపించారు. అయితే దానిపై వెంటనే అనుకూలంగా కేంద్రానికి లేఖ రాస్తానని కెసిఆర్ చెప్పేయడంతో ఆ విమర్శకు విలువ లేకుండాపోయింది. పార్లమెంటులో దీనిపై ఆందోళన చేస్తూనే చంద్రబాబు వైసీపీని విమర్శించేందుకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తున్నారు. పవన్‌ను కూడా వీరితో కలిపేయడం చెల్లుబాటు కావడం లేదని గ్రహించి మినహాయించారు. అదే సమయంలో 'పవన్‌తో కలిస్తే తప్పేంటి' అంటూ జగన్‌కు ప్రశ్నలు సంధించి ఆరోపణలకు ఆజ్యం పోశారు. జనసేనపై అపోహలు అపార్థాలు కల్పించే ప్రయత్నాలు గతంలోనూ చాలా జరిగాయి. వైసీపీతో వారి పొత్తు ఖరారైందని నలభై స్థానాలు ఇస్తారని ఆంధ్రజ్యోతి కథనాలు ప్రచురించడమే గాక చర్చలు కూడా జరిపింది. అప్పుడే పవన్ తమకు ఎవరి దయాదాక్షిణ్యాలు అక్కర్లేదని ఒంటరిగా వెళ్తామని వివరణ ఇచ్చారు. ఒంటరిగా అన్నది బిజెపి వైసీపీలకు తప్ప వామపక్షాలకు వర్తించబోదని కూడా జనసేన వర్గాలు అప్పట్లో పేర్కొన్నాయి. తెలంగాణలో కెసిఆర్‌ను పవన్ బలపరుస్తాడని మరికొన్ని కథలు నడిచినా ఎవరికీ మద్దతునివ్వకుండా మంచి పాలన ఇస్తారనుకునే వారిని ఎన్నుకోవాలని పిలుపిచ్చారు. ఈ పూర్వరంగంలో చంద్రబాబు వ్యాఖ్యల తర్వాత 'సాక్షి'లో పవన్ చంద్రబాబు ఒకటేనని మళ్లీ రుజువైందని కథనాలు మొదలైనాయి. అందువల్లనే ఆయన మరోసారి పొత్తులపై స్పష్టతనిస్తూ వామపక్షాలతో మాత్రమే కలిసి వెళ్తామని 175 స్థానాల్లో పోటీ చేస్తామని తేల్చిచెప్పారు. ఊహాగానాలకు తెరదించారు. అయినా వైసీపీ ఆరోపణలు ఆపింది లేదు. విచిత్రంగా జగన్ కూడా వారిద్దరూ కలసి ఎన్నికలకు వెళితే మంచిదని బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.

ఎ.పిలో ఒక తృతీయ శక్తి లేదా ప్రత్యామ్నాయం ముందుకు రావడం సహించలేకనే జనసేన, సిపిఎం, సిపిఐ గురించిన గందరగోళాలు సృష్టించేందుకు వైసీపీ, టీడీపీ పోటీ పడుతున్నాయి. ఇదొక మ్యాచ్ ఫిక్సింగ్. వారితోనో వీరితోనో జనసేనను కలిపి చూపిస్తూ నిజంగా కలసి పని చేస్తున్న వామపక్షాలను చూడ నిరాకరించడం.

ముందుకొచ్చిన తొలి కలయిక

ఇప్పటికి ఇంత సూటిగా ముందుకొచ్చిన రాజకీయ కలయిక ఇదొక్కటే. వైసీపీ ఒంటరిగా పోరాడతానంటున్నా ఎన్నికల తర్వాత ఎవరితో వెళ్లడం అనేదానిపై తలుపులు తెరిచే వుంచింది. కాంగ్రెస్ తో టిడిపి పొత్తు తెలంగాణలో ఘోరంగా విఫలమైంది గనక వ్యతిరేకత ఇంకా తీవ్రంగా వున్న ఎ.పిలో పునరావృతం చేయడమా అన్న మీమాంసలోనే నేతలు కొట్టుమిట్టాడుతున్నారు. వైసీపీ ఓట్లను చీల్చడానికి తను వెనక వుండి కాంగ్రెస్‌ను ప్రయోగిస్తే ఎక్కువ లాభమన్న యోచన కూడా టిడిపిలో వుంది. నాలుగేళ్ల పాటు పొగిడిన మోడీపై ఇప్పుడు ఎన్ని దాడులు చేసినా విశ్వసనీయత తక్కువే. రాష్ట్ర ప్రభుత్వ తప్పులు అక్రమాల ఆరోపణలు చాలా వున్నాయి. అవన్నీ కలిపి టిడిపికి ప్రభుత్వ వ్యతిరేకత ఒక పెద్ద సవాలు. బిజెపి ఎంత హడావుడి చేసినా ప్రజలు గతంలో కాంగ్రెస్‌కు చేసిన దానికంటే ఇంకా దారుణంగా తుడిచిపెట్టాలని ఓటర్లు చూస్తున్నారు. 2014లో జనసేన బిజెపి మద్దతు వున్నా కేవలం 1.5 శాతం లోపు ఓట్ల ఆధిక్యతతో బతికి బయటపడిన టిడిపి ఇప్పుడు వంటరిగా పోరాడటం తేలిక కాదనే గాభరాలో వుంది. ఫిరాయింపుల కారణంగా దాదాపు పాతిక మంది ఎంఎల్ఎలను ఇతరులను పోగొట్టుకున్న వైసీపీ బలం, ఓటింగు కూడా గతం కంటే తగ్గివుంటే ఆశ్చర్యం లేదు. పైగా జగన్ ఎంతసేపటికీ చంద్రబాబుపై తప్ప మోడీపై ఒక్క మాటనడం లేదనే ప్రశ్న కూడా వుంది. ఎం.పిల రాజీనామాలు, అవిశ్వాస తీర్మానం సాంకేతికమైనవే గాని సాధించేవి గావన్నది బహిరంగ రహస్యం. ఈ విషయంలో ప్యాకేజిని పాచిపోయిన లడ్డూగా వర్ణించి జెఎఫ్‌సి ద్వారా మొదటి స్పష్టత ఇచ్చిన జనసేన పరిస్థితి చాలా మెరుగు. వామపక్షాలు ప్రత్యేక హోదా సాధన సమితి ఎలాగూ మొదటి నుంచి పోరాడుతూనే వున్నాయి. ఈ కారణంగానే జనసేన వామపక్షాల కలయికకు గణనీయమైన జనాదరణ లభించే అవకాశం వుంది. నిరంతరం పాదయాత్రలూ సభలూ కవాతులు జరుపుతున్న పవన్ యువతను బాగా ఆకర్షించగలుగుతున్నారు. ఇందుకు వామపక్షాల సమరశీల శక్తి తోడైతే నూతన మార్పులు అసాధ్యం కాదు.


వైసీపీ టిడిపి మ్యాచ్ ఫిక్సింగ్

ఈ విధంగా ఎ.పిలో ఒక తృతీయ శక్తి లేదా ప్రత్యామ్నాయం ముందుకు రావడం సహించలేకనే జనసేన, సిపిఎం, సిపిఐ గురించిన గందరగోళాలు సృష్టించేందుకు వైసీపీ, టీడీపీ పోటీ పడుతున్నాయి. ఇదొక మ్యాచ్ ఫిక్సింగ్. వారితోనో వీరితోనో జనసేనను కలిపి చూపిస్తూ నిజంగా కలసి పని చేస్తున్న వామపక్షాలను చూడ నిరాకరించడం. జాతీయంగా మోడీని ఓడించేందుకు వాటి సహకారం కోరుతున్న టిడిపి అధినేత రాష్ట్రానికి వచ్చేసరికి వాటి ఉద్యమాలపై నిర్బంధం ప్రయోగిస్తున్నారు. పైగా టిడిపికి టిఆర్ఎస్‌కు పొత్తు కోసం పాకులాడిన ఆయనే తమ మధ్య వైరుధ్యాలను ఎ.పికి తెలంగాణకు మధ్య ఘర్షణగా చిత్రించేందుకు ప్రయత్నిస్తున్నారు. కెసిఆర్‌తో కలవడానికి తాము విఫలయత్నం చేశామంటూనే ఇప్పుడు ఆయనను ఎవరు బలపర్చినా లేక ఆయన ఎవరిని బలపర్చినా అది వారి రాజకీయం. అదేదో రాష్ట్ర ద్రోహమైనట్టు చెబితే ఎలా కుదురుతుంది? బిజెపితో నిన్నటి దాకా కలసి వుండి ఇప్పుడు మోడీ వ్యతిరేక శిబిరంలోకి వచ్చిన చంద్రబాబు ఇదంతా తానే నిర్మించానంటే ఎలా కుదురుతుంది? ఈ దఫా బిజెపి వ్యతిరేక శక్తుల కలయికలోకి అందరికంటే ఆఖరున వచ్చింది ఆయన తప్ప ఆయన వెంట అందరూ రాలేదు. ఇష్టానుసారం శిబిరాలు మార్చిన ఆయన నేపథ్యం కూడా ఎవరూ మర్చిపోలేదు. అయితే ప్రాంతీయ పార్టీల ప్రాబల్యం కాదనలేని నిజం. కేవలం ఆరేడు రాష్ట్రాల్లోనే బిజెపి, కాంగ్రెస్ ముఖాముఖి తలపడతాయి. మిగిలిన అన్ని చోట్ల ఇవే ప్రభుత్వంలోనో ప్రధాన ప్రతిపక్షంగానో వున్నాయి. అవకాశవాదంతో కొన్నాళ్లు కాంగ్రెస్, కొన్నాళ్లు బిజెపి అంటూ ప్రాంతీయ పార్టీల నాయకులు బాగా బలహీనపడిపోయారు. ఆర్థిక విధానాలలో వీరు కాంగ్రెస్ బిజెపిలకు నకలుగా వున్నారు. కనుకనే వారిపై అసంతృప్తి పెరిగి 20కి పైగా రాష్ట్రాల్లో సామదానభేద దండోపాయాలతో బిజెపి అధికారంలోకి రాగలిగింది. ఇప్పుడైనా కెసిఆర్, నవీన్ పట్నాయక్ వంటి వారు నేరుగా మతతత్వ రాజకీయాలపై పోరాడకుండా కాంగ్రెస్, బిజెపిలకు భిన్నమైన ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటు చేస్తామని చెబుతున్నారు. 2014 ఎన్నికల్లో బిజెపికి 31 శాతం కాంగ్రెస్‌కు 19 శాతం వరకూ ఓట్లు వచ్చాయి. అంటే సగానికి సగం ఓట్లు వామపక్షాలకు ఇతర పార్టీలకు వెళ్లాయి. బిజెపికి వ్యతిరేకంగా కాంగ్రెస్ తప్ప శరణం లేదనే చంద్రబాబు వాదన, ఈ రెంటి మధ్యనే తేల్చుకోవాలన్న జగన్ వాదన కూడా పాక్షికమే. బిజెపిని ఓడించడం, ప్రత్యామ్నాయ ప్రభుత్వం తీసుకురావడం, వామపక్షాలు బలం పెంచుకోవడం అనే మూడు అంశాల సిపిఎం ఎజెండా విధానపరంగా విలక్షణమైనది. మోడీ గ్రాఫ్ పడిపోతున్నట్టు పలు సర్వేలు వెలువడుతున్న నేపథ్యంలో ఎ.పిలో ఫలితాలు అంతకంటే ఘోరంగా వుంటాయి. తాజాగా ఢిల్లీలో ప్రత్యేక హోదాకై ఉద్యమించిన వామపక్షాలు జనసేన హోదా సాధన సమితి కార్యకర్తలపై దారుణ లాఠీచార్జికి పాల్పడ్డం కేంద్రం నిర్లక్ష్యానికి, నిరంకుశత్వానికి నిదర్శనం. హోదా పోరు తమ స్వంతమని చెప్పే వైసీపీ గాని టిడిపి గాని ఇందుకు మద్దతుగా గట్టి పాత్ర పోషించడానికి, చేతులు కలపడానికి సిద్ధంగా లేవు. ఎందుకంటే మూడో శక్తి వారికి కిట్టదు. కాని అలాంటి కొత్త గొంతులు లేకుండా మౌలిక సమస్యలు ముందుకు తేకుండా నిజమైన అభివృద్ధి అంటే ప్రజల సంక్షేమం సాధ్యం కాదు. జగన్‌పై హత్యా ప్రయత్నం, చంద్రబాబు తదితరుల అనుచిత స్పందన పోలీసుల పాక్షికత్వం నేపథ్యంలో ఎన్ఐఎ ప్రవేశం ఎన్నికల సంవత్సరంలో పెద్ద వివాదంగానే మారొచ్చు. వీటన్నిటి వల్ల వైసీపీ టిడిపి ద్వంద్వ క్రీడగా కుదించుకుపోయిన ఎ.పి రాజకీయ ఎజెండాను విస్తృత పర్చడానికి వినూత్న చైతన్యం తీసుకురావడానికి తృతీయ శక్తిగా జనసేన– వామపక్షాల కలయిక దిశా నిర్దేశం చేస్తుందని ఆశించవచ్చు.

అవకాశవాదంతో కొన్నాళ్లు కాంగ్రెస్, కొన్నాళ్లు బిజెపి అంటూ ప్రాంతీయ పార్టీల నాయకులు బాగా బలహీనపడిపోయారు. ఆర్థిక విధానాలలో వీరు కాంగ్రెస్ బిజెపిలకు నకలుగా వున్నారు. కనుకనే వారిపై అసంతృప్తి పెరిగి 20కి పైగా రాష్ట్రాల్లో సామదానభేద దండోపాయాలతో బిజెపి అధికారంలోకి రాగలిగింది.

ఉచితంగా గర్భాశయం! పేద మహిళలపై దాడి!

విశ్లేషణ



ఫ్లావియా ఏగ్నెస్



పేద మహిళలు పరాయి పిండాన్ని మోయడం కోసం తమ గర్భాన్ని అద్దెకిచ్చే అన్య గర్భధారణ (సరోగసీ) ప్రక్రియను క్రమబద్ధీకరించడం ద్వారా వారికి మరింత రక్షణ కల్పించాలని ఆరోగ్య రంగ కార్యకర్తలు చాలా కాలంగా కోరుతూ వస్తున్నారు. ఆచరణలో అలా జరక్కపోగా అందుకు పూర్తి విరుద్ధమైన 'సరొగసీ రెగ్యులేషన్ బిల్ 2016' మన ముందుకొచ్చింది. కేంద్రం 2016 సెప్టెంబరులో పార్లమెంటులో ప్రవేశ పెట్టిన ఈ బిల్లును స్టాండింగ్ కమిటీకి సమర్పించారు. అయితే దానివల్ల ఒరిగింది లేకపోగా ఏవో కొన్ని పైపై మెరుగులతో అదే బిల్లును మళ్లీ లోక్‌సభలో ప్రవేశపెట్టగా డిసెంబర్ 19వ తేదీన ఆమోదం పొందింది. ఈ బిల్లు వ్యాపారపరమైన సరొగసీని పూర్తిగా నిషేధించాలంటున్నది.

సంతాన హీనులైన సమీప కుటుంబ బంధువులపై ప్రేమతో సంబంధిత మహిళ కేవలం పరోపకార చర్యగా, సేవాధర్మంగా మాత్రమే పర గర్భధారణ చేయొచ్చని బిల్లు చెప్తోంది. ఈ సేవలందించే సంస్థలు తాము లక్షణంగా చార్జీలు వసూలు చేసుకోవచ్చు. అదే సమయంలో గర్భాన్ని అద్దెకిచ్చిన మహిళలు మాత్రం ఎలాంటి డబ్బు తీసుకున్నా అది 'వ్యాపారాత్మక సరొగసీ'గా పరిగణించబడుతుంది. అలా చేయడాన్ని నేరంగా ప్రకటిస్తూ అందుకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.10 లక్షల వరకూ జరిమానా విధించవచ్చునని ఈ బిల్లు ప్రతిపాదించింది. దీంతోపాటే ఈ విషయమై మరిన్ని నిషేధాలు, ఆంక్షలు విధించబడ్డాయి. సరొగసీకి సిద్ధమైన 'కుటుంబ సన్నిహిత బంధువు' వయసు 25-35 సంవత్సరాల లోపుగానే వుండాలి. తనకు పెళ్లయి, ఒక బిడ్డ కూడా వుండాలి. అంతకు ముందెప్పుడూ తన గర్భాన్ని అద్దెకిచ్చి వుండకూడదు. అంతేగాక, సరొగసీ కోసం ఆమె తన అండాలను ఇవ్వడానికి కూడా అవకాశముండదు.

ఈ వ్యాపారం విలువ సుమారుగా 2.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ 15 వేల కోట్లు) వున్నట్టు అంచనా. ఇందుకోసం సాగుతున్న వైద్యపరమైన దోపిడీలో భాగంగా డబ్బు ఎర చూపి పదే పదే సరొగసీకి ప్రోత్సహించడం ద్వారా పేద మహిళల జీవితాలకు ముప్పు తెచ్చిపెడుతుంటారు. ఈ క్రమంలో వైద్యులు, సరొగేట్ తల్లిదండ్రులు కలసి గాని ఎవరికి వారు గాని కిరాయి మాతృమూర్తి ప్రాథమిక హక్కులను వమ్ము చేసేందుకు కావలసినంత అవకాశం వుంది. సరొగేట్ తల్లిదండ్రులు ఇష్టానుసారం షరతులలో బిగిస్తుంటే అవసరార్థం ఐచ్ఛికంగా ముందుకొచ్చిన పేద గ్రామీణ సరొగేట్ తల్లికి సంబంధించి ఎలాంటి హక్కులు వుండవు. ఆ వైద్యులు గాని సరొగసీ కోసం వచ్చిన జంట గాని అనుకున్న ఒప్పందం నియమాలను ఉల్లంఘించినా ఆమెకు మాత్రం ఎలాంటి పరిష్కార మార్గం వుండదు.

ఈ మహిళలను హాస్టళ్లనబడే వాటిలో దిగ్బంధనంలో వుంచుతారు. గర్భధారణ సమయంలో వారు తమ కుటుంబ సభ్యులను కూడా కలిసే అవకాశమే వుండదు. ఈ గర్భధారణ కారణంగా ప్రసవానికి ముందుగానీ, తర్వాత గానీ ఆరోగ్య పరంగా ఎలాంటి చిక్కులు వచ్చినా బీమా సదుపాయం వుండదు. ఒకవేళ ఆ శిశువు శారీరక, మానసిక వైకల్యాలతో పుడితే తీసుకోవడానికి నిరాకరించే హక్కు సరొగేట్ తల్లిదండ్రులకు వుంటుందిగానీ పుట్టిన బిడ్డను ఇవ్వబోననే హక్కు ఆ మహిళకు వుండదు.

అందుకే అభాగ్యురాలైన ఈ అద్దె తల్లులను అమానుష పరిస్థితుల నుంచి కాపాడటానికి, వారి హక్కులను రక్షించడానికి ఒక బిల్లు అవసరమైంది. అయితే తీరా చూస్తే ఆ పేద మహిళలు తమ గర్భాన్ని అద్దెకు ఇచ్చి అంతో ఇంతో సంపాదించుకునే అవకాశం లేకుండా వ్యాపారాత్మక సరొగసీపై నిషేధం విధించే బిల్లు తీసుకురావడం విడ్డూరం.

ఈ బిల్లులో సరొగసీ ద్వారా బిడ్డను పొందాలనుకుంటున్న తల్లిదండ్రుల మీద కూడా కొన్ని ఆంక్షలున్నాయి. తల్లి 23-50 సంవత్సరాల మధ్య వయస్కురాలై వుండాలి. తండ్రికి కూడా 26-55 సంవత్సరాల మధ్య వయసు వుండాలి. ఐదేళ్లగా వారు స్థిరంగా కాపురం చేస్తున్నవారై వుండాలి. వారికి సొంత బిడ్డ వుండకూడదు. అంతేగాక వైద్య శాస్త్ర పరంగా వారు బిడ్డలను కనలేరన్న ధృవపత్రం వుండాలి.

ఈ బిల్లులో అన్నిటికన్నా ఆందోళన కలిగించే అంశం తిరోగామి భావజాలం. వీటినే ఆరోగ్యశాఖా మంత్రి జె.పి నడ్డా పార్లమెంటులో 'భారతీయ సంస్కృతి'గా వర్ణించారు! ఈ బిల్లు చెప్పే ప్రకారం ఒంటరి మహిళలు, పురుషులు స్థిరమైన సహజీవనంలో వున్నవారు, స్వలింగ సంపర్కులైన లెస్బియన్- గే జంటలకు సరొగసీని ఎంచుకోడానికి లేదు. లింగ మార్పిడి చేయించుకున్నవారికి సైతం ఆ అవకాశం లేదు. అసలు ఒక బిడ్డంటూ వున్నవారెవరూ ఆ బిడ్డకు ప్రాణాంతక వ్యాధి వుంటే మినహా సరొగసీ తలపెట్టడానికే లేదు. అంటే ఈ ఆంక్షల ప్రకారమైతే ఒక కరణ్ జోహార్, ఒక షారుక్ ఖాన్ సరొగసీని ఎంచుకునే అవకాశమే లేదు.

ఒకవైపు స్వలింగ సంపర్కం నేరం కాదన్న చారిత్రక తీర్పు మరోవైపు లింగ మార్పిడి చేయించుకున్నవారికి పౌరసత్వ హక్కులు ప్రసాదించే నల్సా తీర్పు పూర్వరంగంలో ఈ బిల్లు వారి పట్ల వివక్షా యుతమవుతుంది. ఆ విధంగా దాన్ని రాజ్యాంగ ఉల్లంఘనగా పరిగణించవచ్చు.

ఈ బిల్లు అంతర్జాతీయ సరొగసీకి ఎలాంటి మార్గం లేకుండా చేస్తుంది. ఎందుకంటే దీని ప్రకారం కేవలం భారతీయులు మాత్రమే సరొగసీకి అర్హులవుతారు తప్ప విదేశీయులు, ప్రవాస భారతీయులకు అవకాశం వుండదు.

చాలా సంవత్సరాలుగా ప్రపంచంలో భారత దేశం సరొగేట్ కేంద్రంగా వుంది. ఈ ప్రక్రియలో బిడ్డను పొందాలనుకునే జంటలు ప్రపంచం నలుమూలల నుంచి భారత్ రావడం రివాజుగా మారింది. రష్యా, ఉక్రెయిన్, కాలిఫోర్నియా దేశాలలో మాత్రమే వాణిజ్య సరొగసీకి అనుమతి వుండగా సంతానాభిలాషులైన జంటలు దేశంలోని అన్ని ప్రధాన నగరాలలో వున్న సరొగసీ కేంద్రాలను సంప్రదిస్తుండేవి. ఇప్పుడీ బిల్లు ఆ ప్రక్రియకు హఠాత్తుగా ముగింపు పలుకుతోంది. ఈ మొత్తం తతంగం దోపిడీమయమన్నది నిర్వివాదాంశం. ఎటువంటి కనీస హక్కులూ రక్షణలూ లేనందువల్ల సరొగేట్ తల్లి నష్టపోతున్న మాట కూడా నిజం. కాని సరొగసీ కేంద్రాల ద్వారా దోచుకునే వైద్యులకు మాత్రం బహు చక్కగా లాభం కలిగేది. వారు గత రెండు దశాబ్దాలుగా పేద మహిళలను బలి పెట్టే ఈ నీతి మాలిన వైద్య కోవిదుల దోపిడీ నడిచేందుకు రెండు దశాబ్దాలకు పైగా ప్రభుత్వం యథేచ్ఛగా అనుమతించింది. తీరా ఇప్పుడు వారి హక్కులకు ఎలాంటి రక్షణ కల్పించకపోగా, గర్భాన్ని అద్దెకివ్వడం ద్వారా జీవనాన్ని నెట్టుకొచ్చే హక్కును కూడా వారు కోల్పోయేలా కొత్త బిల్లు తెచ్చింది. ఇదే 'భారతీయ కుటుంబ నీతి' అంటూ సూక్తులు వినిపిస్తున్నది. ఇందుకు మూల్యం చెల్లించేవారెవరన్నదే ఇక్కడ కీలక ప్రశ్న. పరోపకార చింతనతో" అన్న ప్రభుత్వ వాదనను స్టాండింగ్ కమిటీ తిరస్కరించింది. నష్టపరిహారం చెల్లింపు అన్నది నియమంగా వుండాలని, ఆ పదానికి బదులుగా 'నష్టపరిహారం' వుంచాలని సూచించింది. పరోపకారం పేరిట సరొగసీ అంటే దోపిడీకి చోటు కల్పించడమేనని స్పష్టం చేసింది.

ఒక తల్లి బిడ్డను కనడం కోసం పడే పునరుత్పత్తి శ్రమకు ఎలాంటి పైకం ఇవ్వకుండా ఆ బిడ్డను ఉచితంగా తీసుకోవడానికి మరొకరిని అనుమతించడం, ప్రసవ వేదన పడ్డ మహిళకు చెల్లింపును అడ్డుకోవడం అత్యంత అన్యాయమైన నిరంకుశమైన చర్య అని స్టాండింగ్ కమిటీ నివేదిక పేర్కొంది. 'ఉదాత్తమైన ఆలోచనతో, దయార్ద్రతతో' ఎలాంటి నష్టపరిహారం లేకుండా పరోపకార సరొగసీ గురించి చెప్పడమంటే సరొగసికి సిద్ధమైన మహిళ నుంచి మరీ ఎక్కువగా తీసుకోవడమేనని కూడా అది వ్యాఖ్యానించింది.

సుప్రీంకోర్టు సహజీవన జంటలను గుర్తించింది గనక అలాంటి జంటలకూ, విడాకులు తీసుకున్న స్త్రీలు, వితంతువులకు కూడా సరొగసీ ద్వారా బిడ్డలను పొందే అవకాశం కల్పించాలన్న స్టాండింగ్ కమిటీ సిఫార్సులను సహితం ప్రభుత్వం విస్మరించింది.


మొత్తంపైన చూస్తే ఈ బిల్లు తీరుతెన్నులు మనను వెనక్కు నడిపించేలా వున్నాయి గాని కాలంతో పాటు ముందుకు తీసుకుపోయేవిగా లేవు. వైజ్ఞానిక పురోగతికి, నిరుపేద గ్రామీణ మహిళల హక్కుల రక్షణకు వ్యతిరేకమైన దిశలో వున్నాయి. ఒక మహిళ శరీరం, గర్భం ఘనమైన భారతీయ కుటుంబ ఆస్తిగా చూసే పితృస్వామిక భావజాలాన్ని బలోపేతం చేసే దిశలో తిరోగమిస్తున్న వైనానికి ఇదొక నిదర్శనంగా నిలుస్తుంది.

(రచయిత మహిళా హక్కుల న్యాయవాది)

ఈ బిల్లు తీరుతెన్నులు మనను వెనక్కు నడిపించేలా వున్నాయి గాని కాలంతో పాటు ముందుకు తీసుకుపోయేవిగా లేవు. వైజ్ఞానిక పురోగతికి, నిరుపేద గ్రామీణ మహిళల హక్కుల రక్షణకు వ్యతిరేకమైన దిశలో వున్నాయి. ఒక మహిళ శరీరం, గర్భం ఘనమైన భారతీయ కుటుంబ ఆస్తిగా చూసే పితృస్వామిక భావజాలాన్ని బలోపేతం చేసే దిశలో తిరోగమిస్తున్న వైనానికి ఇదొక నిదర్శనంగా నిలుస్తుంది.

సోషల్ మీడియా

పెద్ద మోసగాళ్ల వెల్లడికి నై



- ప్రభుత్వానికి.. అంత గోప్యత ఎందుకో!

బ్యాంక్ మోసాలపై ద్వంద్వ వైఖరి.. పార్లమెంట్‌కూ చెప్పని మోడీ సర్కారు

- 'బడా' బాబులున్నందునే వెనుకడుగు! విచారణ చేస్తున్నామని ముక్తాయింపు

బ్యాంకులకు కుంభకోణాల రూపంలో వేల కోట్ల రూపాయలను ముంచిన మోసకారుల పేర్లు చేతుల్లో ఉన్నా.. వాటి వివరాలను మాత్రం సర్కారు బయటకు వెల్లడించలేక పోతోంది. సమాచార హక్కు చట్టం కింద వివరాలు కోరుతున్నప్పటికీ .. ప్రభుత్వం ఎలాంటి సమాచారాన్ని ఇవ్వడం లేదు.

- బ్యాంకులకు ఉద్దేశపూర్వక మోసాల వల్ల గడిచిన మూడు ఆర్థిక సంవత్సరాల కాలంలో దాదాపు రూ.69,755 కోట్ల మేర నష్టం జరిగింది - పార్లమెంట్లో వెల్లడి

- మోసగాళ్ళ పేర్లు ప్రకటించమని బిజెపి భక్తులు ఎందుకు డిమాండ్ చేయరు?

- ప్రకటించక పోవడం దేశద్రోహం కాదా ?

మోడీ దారిలోనే మంత్రులు..



ప్రధాని మోడీ విదేశీ ప్రయాణాలకు అయిన ఖర్చు రూ.2,021 కోట్లు

కేంద్ర మంత్రులకు రూ. 225.30 కోట్లు

సహాయ మంత్రులకు రూ. 13.75 కోట్లు

అభివృద్ధి మంత్రం జపించే మోడీ సర్కార్, దేశంలో కన్నా.. విదేశీ ప్రయాణాలకు ప్రజాధనాన్ని వరదలా ఖర్చు చేసింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇన్ని నిధులను వెచ్చించలేదు.

వారందరి దోస్తీతోనే ...




ఢిల్లీలో ఉన్న అనామిక... గుంటూరు నుంచి నరసింగరావు ఇద్దరూ కాల్ చేశారు.. ఈ రెండు ఫోన్ కాల్స్ నన్ను బాగా ఇబ్బంది పెడుతుంటే ఆ బాధని ఎవరితో చెప్పుకోవాలో అర్థం కాక.. రాత్రి రెండు గంటలప్పుడు రాసుకున్న విషయాలివి.

అనామిక కాల్ చేసి.. 'ఎలా ఉన్నావు? ఏంటి?' అని అడిగాక.. 'అక్కా, ఈ నెల 8, 9 తేదీల్లో స్ట్రైక్ ఉంది.. కుదిరితే రా అక్కా' అంది. నేను వాయిస్ ఆఫ్ వర్కింగ్ ఉమన్ మ్యాగజైన్‌కి పనిచేసేటప్పుడు అనామికతో పరిచయం. ఐఆర్‌సిటిసిలో కాంట్రాక్టు వర్కర్‌గా పనిచేసేది. అదేచోట ఆమె భర్తా పనిచేసేవాడు. రెగ్యులర్ ఎంప్లాయ్‌కీ కాంట్రాక్టు వర్కర్‌కీ ఇచ్చే జీతంలో వ్యత్యాసాల్ని ప్రశ్నిస్తూ మేనేజ్‌మెంట్‌కి లేఖలు రాశాడు. దాంతో అతని జాబ్ పోయింది. కోర్టుకి ఎక్కితే అనామిక జాబ్ కూడా పోయింది. ఈ భార్యాభర్తలది న్యాయమైన డిమాండే కదాని కొందరు కొలీగ్స్ సహాయపడితే వారి ఉద్యోగాలూ పోయాయి. వీరందరూ కాంట్రాక్టు వర్కర్స్ రైట్స్ కోసం యూనియన్‌గా ఏర్పడి, పనిచేస్తున్నారు. ఈ అనామిక 'కామ్ కాజీ' మహిళా మ్యాగజైన్ పేజీ మేకింగ్ చేస్తుంది. యూనియన్ స్ట్రైక్ కాల్ ఇచ్చినప్పుడు ..ధర్నాకి పిలుపిచ్చినప్పుడు.. రోడ్లపై తిరుగుతూ కరపత్రాలను పంచుతుంది. ఒకసారి స్ట్రైక్ క్యాంపెయిన్ కోసం నా సహాయం అడిగింది. 'అక్కా నీకు బండి నడపటం వచ్చుకదా? రాత్రికి ఒక రెండు గంటలు నాతో రావా ప్లీజ్..?' అంది. పోతే.. బ్యాగ్ నిండా పోస్టర్లు, చిన్న బకెట్ మైదా పట్టుకుని ఐఆర్‌సిటిసి గోడలనిండా పోస్టర్లు అతికించింది. మెట్రోస్టేషన్ గోడలపై అందరి దృష్టి పడేచోటా పోస్టర్లు అతికించింది. 'అక్కా పొద్దుపోయింది. సారీ!' అంది నవ్వుతూ.

మర్నాడు స్ట్రైక్ రోజు ఐటిఓలో చక్కా జామ్ (రాస్తారోకో) చేస్తూ తన ఎనిమిదేళ్ల ఆడబిడ్డ చేయి పట్టుకుని, 'ప్రతి అన్యాయానికి నా సమాధానం సంఘర్షణ' గొంతు పగిలి పోయేలా అరుస్తోంది. పోలీసు వచ్చి తిట్టాడు. అయినా జడవకుండా 'ఎలుగెత్తి చాటండి మనమంతా ఒక్కటి!' అని నినాదం ఇచ్చింది. పోలీసోడికి కోపం వచ్చి 'నీ భర్తను (మర్యాద కోసం ఈ పదం రాశాను.. పోలీసోడు ఇంకా పిచ్చిమాట అన్నాడు) అనాలి.. వాడు నిన్నిలా రోడ్లపైకి వదిలాడు' అని తిట్టాడు. అప్పుడు కూడా అనామిక 'హల్లా బోల్ సాతిరే హల్లా బోల్! పోలీస్‌కి జుల్మ్ పర్ హల్లా బోల్!' అని నినదించింది. ఈసారి పోలీస్‌కి మండిపోయి చేయెత్తి కొట్టబోయాడు. పక్కనున్న నేను సెల్‌ఫోన్ తీసి.. 'కొట్టండి సాబ్! నేను జర్నలిస్టుని. నాకు మంచి స్టోరీ కావాలి. ఫొటో తీసుకుంటా..!' అంటే.. గుడ్లురిమి పక్కకి పోయాడు. అప్పుడు అనామిక అరుస్తూ అంది 'పోలీస్ సాబ్ మీకుంది నౌకరి. మీ పిల్లల కోసం జాబ్స్ ఎక్కడున్నాయి? అందుకే రండి మాతో. స్ట్రైక్ చేయండి!' అని. పోలీస్ ఆటుపోతుంటే నెమ్మదిగా 'అక్కా ఈ రోజు పోలీసోడు కొట్టేవాడే.. నీ బుర్ర భలే పనిచేసింది. సరే కానీ, ఇదంతా నా భర్తకి చెప్పొద్దు.. ఇక్కడే మర్చిపో!' అంది. వెంటనే మళ్ళీ నినాదాలు ఎత్తుకుంది. తనే కాల్ చేసింది. 8, 9 సమ్మెకి రమ్మని.

ఇలాంటి అమ్మాయే శ్వేతారాజ్. ఈమె బీహార్ విత్తనం. తల్లితండ్రీ ఉద్యోగరీత్యా ఉత్తరప్రదేశ్‌కి వెళ్లిపోతే యుపీలో పెరిగింది. తల్లితండ్రీ గాంధీ గురించి.. భగత్‌సింగ్ గురించి చెప్పిన కథలు వింటూ పెరిగిన శ్వేతకి రాజకీయ అవగాహనా ఉంది. ఇరవై ఎనిమిదేళ్ల శ్వేత జెఎన్‌యూలో పిహెచ్‌డీ చేస్తోంది. దానితో పాటు ఓ యూనియన్‌లోనూ పనిచేస్తోంది. సమ్మె ప్రచారంలో భాగంగా వర్కర్స్ బస్తీలకు,



జుగ్గిలకి (కొద్దిగా ఇళ్లుండే చిన్నబస్తీలు) పోయి వర్కర్స్ బాధలపై తీసిన సినిమాలు ప్రదర్శించి, వారికి స్ట్రైక్ ఎందుకు చేయాలి? డిమాండ్లు ఏంటి? అనేది తెలియజేస్తోంది. నేను రోడ్డుపై కనపడితే 'స్ట్రైక్‌పై ఏమైనా రాయండి. ఎంతో కొంత ఫండ్ మీరూ మీ ఫ్రెండ్స్ ఇచ్చేలా చూడండి!' అంది.

సమ సమాజం కావాలి. అందరూ బాగుండాలి.. ఆ సమాజంలో నేనుండాలి.. దానికోసం నా వంతు కష్టం నేను పడతా! అనుకునే వ్యక్తులు ఈ ఇద్దరమ్మాయిలు. అనామిక స్వభావరీత్యా తన పని తాను చేసుకుపోయేది. శ్వేత సొంతం కోసం ఎవరి దగ్గరా చేయి చాచదు. కానీ ఇద్దరూ తాము నమ్మిన సమానత్వం కోసం.. అన్యాయాన్ని ఎదురించటం కోసం.. ఎలుగెత్తి తమ గొంతులు వినిపిస్తున్నారు.

మరోవైపు నర్సింగరావు గుంటూరులో ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. సమాజంపై ఆందోళన ఉంది. సమాజం మారాలి అని గుండెనిండా కోరిక. అదే సమయాన మారదని చిన్న నిరాశ. నేను రాసిన 'తెరపైకి నితిన్ గడ్కరీ' ఆర్టికల్ చదివి, అభినందిస్తూ గుంటూరు నుంచి ఫోన్ చేశారు.

'అమ్మా! నేను ఫీడ్‌బ్యాక్ ఇవ్వటానికి ఫోన్ చేశా..! అన్ని రాజకీయ పార్టీలూ దొంగలు. ఓట్ల కోసం 'కులం మతం' అంటారు. ప్రజలని మోసం చేస్తున్నారు. విధానాలపై మాట్లాడరు. గతిలేక ఒకరి తర్వాత ఒకరిని మార్చుతున్నాం. ఈ దొంగల వల్ల సమాజం మారదమ్మా!' అని తిట్టారు.

'మరి సమాజం మారాలి అంటే ఏమి చేయాలి?' అని అడిగా. నరసింగరావు అన్నారు : 'గట్టిగా నిలదీసే పౌరులు ఉండాలి. ప్రజలకి ఉపయోగపడే పాలసీలు కావాలని డిమాండ్ చేసే వాళ్లుండాలి.. కానీ అలా ఉన్నవారెవరు తల్లీ!' అని. 'అలాగా మరి మీరేం చేస్తుంటారు?' అని అడిగా. 'మీలాంటోళ్ళకి ఫీడ్‌బ్యాక్ ఇచ్చి, ఇంకా మంచి ఆర్టికల్ రాయమని రిక్వెస్ట్ చేస్తుంటా..' అన్నారు.

నాకు అనిపించింది పాపం నర్సింగరావుకి తెలియదు కాబోలు.. నాలాంటి గల్లీ రిపోర్టర్లు ఎన్ని వ్యాసాలు రాసిన సమాజం మారదని. మనలో చాలా ంందికి ఒక అపోహ ఉంది. జరుగుతున్న అన్యాయాల పట్ల గొంతెత్తి మాట్లాడేవారు లేరని. అందరూ రాజీ జీవితాలే బతుకుతున్నారని.. అందుకే సమాజం ఇలా అయిపోయిందని.. తెగ బాధపడిపోతూ ఉంటాం. అదే సమయాన అనామిక లాంటివాళ్ళు కరపత్రం ఇస్తే కనీస మర్యాద లేకుండా వారి ఎదురుగానే ఉండగా చుట్టి, నేలపై విసిరేస్తాం. ఆ కరపత్రంలో ఉన్న డిమాండ్లు ఏంటో ఒక్కసారైనా చదవం. ఇంకా శ్వేతలాంటి వాళ్ళు యూనియన్ కోసం ఫండ్ కావాలని అడిగితే వినబడనట్లు వెళ్లిపోతాం. మన ప్రవర్తన ఇలా ఉండి.. సమాజం మారాలి.. మారాలి.. అంటే ఎలా మారుతుంది? నిజానికి సమాజంలో అన్యాయాన్ని ప్రశ్నించే గొంతులను ప్రభుత్వం మాత్రమే కాదు.. 'ఆ యూనియన్ గొడవలు మనకెందుకులే!' అనుకునే వారంతా ప్రశ్నించే గొంతులను నులిమేస్తున్నారు. అన్యాయంపై ఎలుగెత్తే గొంతులను నులిమేసి, నిర్వీర్యుల సమాజం అని బాధపడితే సమాజం మారుతుందా? నాలాంటి గల్లీ రిపోర్టర్‌కి అనామిక దోస్త్.. అటు గుంటూరు నరసింగరావు దోస్త్.. వారి మంచితనాలు నా మనసుకు బాధ ఇస్తే.. ఈ అర్ధరాత్రి రాతలు రాయగలను. కానీ సమాజాన్ని మార్చలేను. సమాజ నుదుటి రాత మార్చే సిరా ఒక్కటే ..

'అనామిక, శ్వేతలతో నరసింగరావుల దోస్తీ'.

- అరుణ, న్యూఢిల్లీ.





ఆధునికతకు తగినట్లు ట్రెండీగా ఉండాలని చాలామంది అమ్మాయిల అనుకుంటారు. ఫ్యాషన్ ప్రపంచంలో పై దుస్తులు ఎంత అవసరమో.. లో దుస్తులూ అంతే ప్రాధాన్యత కలిగినవి. కానీ నేటికీ మన దేశంలో చాలామంది అమ్మాయిలకు లో దుస్తుల గురించిన అవగాహన తక్కువే. వీటి గురించి అంతగా ఆలోచించరు కూడా. షాపునకు వెళ్లి కొనుక్కోవడానికీ బోలెడంత మొహమాటం, సిగ్గు. దీంతో మార్కెట్లో కనిపించినవి ఏవో ఒకటి కొనేస్తారు. దీంతో అసౌకర్యమే కాదు; ఆకృతిపైనా ప్రభావం పడుతుంది. ఈ సమస్యనే తన వ్యాపారంగా మలుచుకున్నారు అర్పితా గణేష్. ఆమె ఆలోచనల్లోంచి పుట్టుకొచ్చిందే 'బటర్‌కప్స్'. లోదుస్తుల వ్యాపారంతో అమ్మాయిల మనసు దోచుకోవడంతో పాటు స్మాల్ బిజినెస్ హీరోస్ అవార్డునూ అందుకున్నారు ఆమె.

అర్పిత @ సక్సెస్

మన దేశంలో లోదుస్తుల గురించి చాలామంది బహిరంగంగా మాట్లాడరు. ఇప్పటికీ చదువుకున్న అమ్మాయిలు సైతం వాటిని కొనుక్కోవడానికి సిగ్గుపడతారు. దీనితో మన దేశంలో 80 శాతం అమ్మాయిలు వారికి సరిగ్గా సరిపోయే లోదుస్తులు వేసుకోరని అధ్యయనాలు చెబుతున్నాయి. లోదుస్తులు అందరికీ అన్ని సైజుల్లో అందుబాటులో ఉండకపోవడం, చాలామందికి తమకు ఎలాంటివి సరిపోతాయో అవగాహన లేకపోవడమే కారణం. అయితే 'బటర్‌కప్స్' మాత్రం అవసరానికి తగినట్లు ప్రత్యేకంగా ప్రశ్నావళిని అందించి, సందర్భం, ఆకృతికి తగినట్లు లోదుస్తుల్ని అందిస్తుంది అంటున్నారు అర్పితా గణేష్.

అర్పితాది బెంగళూరు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో డిగ్రీ చదివారు. అర్పిత ఒకసారి న్యూయార్క్ వెళ్లినప్పుడు అక్కడ ఎదురైన చిన్న సంఘటనే 'బటర్‌కప్స్' స్థాపనకు ప్రేరణ. 'న్యూయార్క్‌లో బోటిక్‌కు వెళ్లి, నా ఆకృతికి సరిపోయే లోదుస్తులు కావాలని అడిగా. వాళ్లు నాతో మాట్లాడి.. సరిగ్గా నాకు సరిపోయే లో దుస్తులు ఇచ్చారు. అవి చాలా సౌకర్యంగా అనిపించాయి. ఆశ్చర్యంగానూ అనిపించింది. నాకున్న కొన్ని సందేహాలను వారితో తీర్చుకున్నా. అదే ప్రేరణతో ఇండియాకు వచ్చాక అలాంటి సేవల్నే నేనూ ప్రారంభించాలనుకున్నా. అలా ఈ సేవల్ని అందుబాటులోకి తెచ్చా' అని తన స్వీయానుభవాన్ని గుర్తుచేసుకున్నారు అర్పిత.

ప్రారంభం ఇలా..

'ఇండియాకు వచ్చాక బొటిక్ పెట్టాలనుకున్నా కానీ నా దగ్గర సరిపడా పెట్టుబడి లేదు. అందుకే ప్రీ ఆర్డర్ అనే విధానాన్ని ప్రారంభించాను. అంటే లోదుస్తులు కావాలనుకున్న వారు ముందుగానే డబ్బులు చెల్లించాలి. నా ప్రాజెక్ట్ సక్సెస్ అయితే లోదుస్తుల్ని అందిస్తానని చెప్పా. ఒకవేళ నా బిజినెస్ స్టార్ట్ చేయకపోతే వారి డబ్బులు వారికి తిరిగిచ్చేస్తానని చెప్పా. దానికోసం సోషల్ మీడియాను మాధ్యమంగా ఎంచుకున్నాను. ఒక పోస్ట్ రాసి, దాన్ని నా స్నేహితులూ, తెలిసినవారికీ పంపా. వారినీ షేర్ చేయమని చెప్పా. అలా చాలామంది షేర్ చేయడం, తెలిసివాళ్లు వారికి తెలిసిన వారికి చెప్పడం చేశారు. అలా 200 మంది మహిళలు డబ్బులు చెల్లించడానికి ముందుకు వచ్చారు. ఒక్కొక్కరు రూ.1500 ఇచ్చారు. అలా వారి ఆదరణే నాకు తొలి పెట్టుబడిగా వచ్చింది. మహిళల సాయంతోనే 15 ఏళ్ల క్రితం ఈ సంస్థను ప్రారంభించా' అంటూ చెప్పుకొచ్చారు అర్పితా. మొత్తం మీద అనుకున్నట్లుగానే కంపెనీని ప్రారంభించారు అర్పితా. అయితే చాలామంది లోదుస్తుల కోసమే అంత ఖర్చు పెట్టాల్సిన అవసరం ఏంటని కూడా అడిగేవారు.

తేలిక చేసినా.. తెలివిగా

అంతేకాదు; లోదుస్తుల బిజినెస్ కూడా ఓ బిజినెస్సేనా? అని కొందరు నవ్వారు. వీటికి తోడు మొదట్లో అనుకున్న ఫలితాలు కూడా రాలేదు. ఒకానొక సమయంలో... సంస్థను మూసేసి, ఎక్కడికన్నా వెళ్లిపోవాలనుకుందట అర్పితా గణేష్. కానీ ఆమె మనసు ఒప్పుకోలేదు. ఆలోచించింది... చాలామంది లోదుస్తులు అని తేలికగా తీసిపారేయటంలోనే– వాటి అవసరత ఏమిటో స్పష్టమవుతుందని ఒక అభిప్రాయానికి వచ్చింది. వాటి అవసరాన్ని తెలియజేయడానికి వివిధ కార్పొరేట్ సంస్థల్ని అధ్యయనం చేశారు. అక్కడ పనిచేసే మహిళల కోసం ఉచితంగా వర్క్‌షాపులు నిర్వహించారు. మంచి స్పందన వచ్చింది. ప్రతి ఒక్కరూ తమకు తెలియని చాలా విషయాలు నేర్చుకున్నాం అనేవారు. అలా వినియోగదారుల సంఖ్యను పెంచుకుంటూ పోయారు. ఇప్పుడు 'బటర్‌కప్స్'కు మూడువేల మందికి పైగా వినియోగదారులు ఉన్నారు. మొదట్లో వేరే కంపెనీలకు వివిధ సైజుల్లో డిజైన్లు పంపిస్తే, వాళ్లే తయారుచేసి ఇచ్చేవారు. వినియోగదారుల సంఖ్య పెరిగేకొద్దీ అర్పితానే సొంతంగా తయారీ చేయాలనుకున్నారు. అలా ఆమె స్వయంగా ఒక యూనిట్‌ను ఏర్పాటు చేశారు. పలు అంతర్జాతీయ సంస్థలతోనూ ఒప్పందం కుదుర్చుకున్నారు.



ఆన్‌లైన్ ఆర్డర్లే ఎక్కువ

ఆన్‌లైన్‌లో 'బటర్‌కప్స్' వెబ్‌సైట్‌లోకి వెళ్లి టేక్ అవర్ క్విజ్ ఆప్షన్ ద్వారా అక్కడ అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలి. ఆ తర్వాత ఆకృతికి సరిపోయే లోదుస్తులు వివిధ రకాల్లో ధరలతో సహా చూసి, సరిపోయే వాటిని ఎంచుకోవచ్చు. ఇదంతా ఆన్‌లైన్ ద్వారానే జరుగుతుంది. ప్రస్తుతం నెలకు దాదాపు 500 ఆర్డర్లు వస్తున్నాయి. అందులో సుమారు 60 శాతం బొటిక్‌ల నుంచే వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో హైదరాబాద్, ఢిల్లీ, ముంబై, చెన్నై సహా ఇతర ప్రాంతాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి. త్వరలోనే దేశవ్యాప్తంగా 'బటర్‌కప్స్' సేవల్ని విస్తరించాలనే ఆలోచన ఉంది.

- అర్పితా గణేష్

నిపుణుల సలహాలతో..

అంతర్జాతీయంగా మొత్తం 150 సైజుల్లో లోదుస్తులు లభిస్తుంటే.. మన దేశంలో ఆ సంఖ్య కేవలం 50 లోపే. ఆ సంఖ్యను పెంచడానికి అర్పితా ప్రయత్నాలు మొదలుపెట్టారు. లోదుస్తులు అంటూ కేవలం శరీరాకృతికి తగినట్లుగా మాత్రమే కాదు.. సందర్భం, అవసరానికి సరిపోయే రకాలనూ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రయత్నాలు మొదలుపెట్టారు. 'బటర్‌కప్స్'లోని అంతర్జాలంలో కొనుగోలు చేయాలనుకుంటే, వారి వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి.. అక్కడ కొన్ని ప్రశ్నలుంటాయి. వాటి ఆధారంగా వాళ్లకు సరిపోయే రకాలను ఆర్డర్ ఇచ్చుకుంటే ఇంటికి పంపిస్తారు. అలాగే బెంగళూరులో ఉన్న బొటిక్ నుంచీ కొనుక్కోవచ్చు. అక్కడ రెండు బొటిక్‌లున్నాయి. సందేహాలుంటే, నిపుణుల సలహాలూ అందించే ఏర్పాటు కూడా చేశారు. వారి సలహాతో కావాల్సిన సైజులో లోదుస్తులు కొనుక్కోవచ్చు.

- జీవన డెస్క్

బహుమతి పొందిన ముగ్గు



జి. లీలాకోటేశ్వరి, ఉప్పలూరు, కృష్ణా జిల్లా.



17 చుక్కలు 7 వరుసలు పెట్టి, చుక్క విడిచి చుక్క 7 వచ్చే వరకు.



ఇ. రమ్య నందిని, కృష్ణా జిల్లా.



25 చుక్కలు 1 వచ్చేవరకు సరిచుక్క

మా చిరునామా:
'రమణుల రంగవల్లి', జీవన,
ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి,
గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇమెయిల్: jeevanapageps@gmail.com ఆదివారం మినహా ఉ.12 గం. సా.6 గం. మధ్య ఫోన్ నెం. 9490099006కు సంప్రదించండి.



మీకోసం

నిప్పు వల్ల లేదా మంటవల్ల పొరపాటుగా శరీరానికి గాయమైతే మెంతుల్ని మంచినీటితో మెత్తగా నూరి, కాలినచోట రాయాలి. క్షణాల్లో మంట తగ్గి, బొబ్బలెక్కకుండా ఉంటుంది.

జీవన సౌరభం

కన్నీటితో ఏమీ సాధించలేం. చెమటచుక్క చిందించితేనే చరిత్ర రాయగలం.

సెన్సెక్స్ ⬆ 155
35,850

నిఫ్టీ ⬆ 44
10,771

రూపాయి ⬆ 44 పై
అమెరికా డాలరుకు రూ.
69.68

ఇండియన్ బ్యాంకు క్యాంపెయిన్..

కరెంట్ ఎకౌంట్, సేవింగ్ ఎకౌంట్‌లపై ప్రభుత్వ రంగంలోని ఇండియన్ బ్యాంకు ప్రత్యేక క్యాంపెయిన్ ప్రారంభించింది. 'ఐబి-కామధేను' పేరుతో హిమాయత్‌నగర్-నారాయణ గూడలో చేపట్టిన ఈ రోడ్ షోనూ ఆ బ్యాంకు హైదరాబాద్ జోనల్ మేనేజర్ ఆర్ మనోహర్ ప్రారంభించారు. ఫిబ్రవరి 28 వరకు ఈ ప్రత్యేక క్యాంపెయిన్‌లో వినియోగదారులు సులభంగా ఈ ఖాతాలు పొందవచ్చన్నారు. అతి పురాతన బ్యాంకుల్లో ఒక్కటైన ఇండియన్ బ్యాంకు మెరుగైన వృద్ధి, లాభాల్లో ఉందన్నారు.



దేశంలోనే అతిపెద్ద స్టార్టప్ కాంప్లెక్స్ కేరళలో ఏర్పాటు

కొచ్చి : దేశంలోనే అదిపెద్ద సమీకృత స్టార్టప్ కాంప్లెక్స్‌ను కేరళ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది. ముఖ్యంగా హార్డ్‌వేర్ రంగాన్ని దృష్టిలో పెట్టుకుని దీన్ని అందుబాటులోకి తెస్తున్నట్లు ఆ రాష్ట్ర ప్రభుత్వ అధికారులు తెలిపారు. కొచ్చిలోని కలమస్సెరిలో ఏర్పాటు చేస్తున్న ఈ ఇన్నోవేషన్ హబ్, ఇంటీగ్రేటెడ్ స్టార్టప్ కాంప్లెక్‌ను జనవరి 13న కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ లాంచనంగా ప్రారంభించనున్నారు. ఇక్కడ ఆధునిక, అత్యున్నత నాణ్యత కలిగిన మౌలికవసతులను కల్పిస్తున్నారు. కేరళ స్టార్టప్ మిషన్ (కెసుమ్)లో భాగంగా ఈ 1.80 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తున్న ఈ టెక్నలాజీ ఇన్నోవేషన్ జోన్ (టిజ్)ను దేశంలోని అన్ని స్టార్టప్‌లకు అంకింత చేయనున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కేంద్రంలో మూడు ఇంక్యూబేటర్లలో ఇప్పటికే 100 స్టార్టప్‌లు వివిధ దశల్లో నిర్వహణలో ఉన్నాయన్నారు. ఇందులోని ఎలక్ట్రానిక్స్ ఇంక్యూబెటర్‌ను కేంద్ర ఐటి మంత్రిత్వ శాఖ, కెసుమ్ సహకారంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నలాజీ అండ్ మేనేజింగ్‌మెంట్-కేరళ (ఐఐఐటిఎం-కె) ఏర్పాటు చేసింది. ఇందులో 65 హార్డ్‌వేర్ స్టార్టప్‌లు పని చేస్తున్నాయి. బయోనెస్ట్ ఇంక్యూబెటర్‌ను రాజీవ్ గాంధీ సెంటర్ ఫర్ బయోటెక్నలాజీ (ఆర్‌జిసిబి), డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్ భాగస్వామ్యంతో కెసుమ్ అందుబాటులోకి తెచ్చింది. ఇందులో 20 బయోటెక్నలాజీ కంపెనీలు కార్యకలాపాలు సాగించడానికి ముందుకు వచ్చాయి. ఇక్కడి నుంచే పని చేసే స్టార్టప్‌లు ఇప్పటికే 30 పేటెంట్ల కోసం దరఖాస్తు చేసుకుని ఉన్నాయి.

కేంద్రానికి రూ.40వేల కోట్లు..!

- ఆర్‌బిఐ మధ్యంతర డివిడెండ్
- మార్చి నాటికి ఇచ్చే యోచన

ముంబయి : కేంద్ర ప్రభుత్వానికి రిజర్వు బ్యాంకు ఆఫ్ ఇండియా మధ్యంతర డివిడెండ్ కింద రూ.30,000- రూ.40,000 కోట్ల (4.32 బిలియన్ డాలర్ల -5.8 బిలియన్ డాలర్ల)మధ్యంతర డివిడెండ్ అందించనుందని తెలుస్తోంది. మిగులు నిధులపై రిజర్వు బ్యాంకు, కేంద్ర ప్రభుత్వం మధ్య గత కొన్ని నెలలుగా ఆందోళనలు చోటు చేసుకుంటున్న వేళ ఈ యోచన జరగడం గమనార్హం. జిఎస్‌టి వల్ల ఇప్పటికే పడిపోయిన పన్ను వసూళ్ల నేపథ్యంలో ఆర్‌బిఐ డివిడెండ్ అందించే నిధులతో ద్రవ్య లోటును పూడ్చుకోవాలని కేంద్రం భావిస్తోంది. ఆర్‌బిఐ నుంచి కేంద్రం రూ.3 లక్షల కోట్ల పైగా మిగులు నిధులను ఆశించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఇది వరకు ఆర్‌బిఐ గవర్నర్ ఉర్జిత్ పటేల్ రాజీనామాకు దారి తీసింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జిడిపిలో ద్రవ్య లోటు 3.3 శాతానికి పరిమితం చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే సర్కార్‌కు రూ.1 లక్ష కోట్ల రెవెన్యూ కొరత ఉంది. వచ్చే ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

నగదు లభ్యత పెంపునకు చర్యలు

ఆర్‌బిఐ గవర్నర్



న్యూఢిల్లీ : ఆర్థిక వ్యవస్థలో నగదు లభ్యత క్షీణిస్తే లిక్విడిటీ పెంపునకు చర్యలు చేపడతామని ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత్ దాస్ అన్నారు. రుణాల పునర్వ్యవస్థీకరణపై సోమవారం దాస్‌తో చిన్న, మధ్యతరహా సంఘాల ప్రతినిధులు భేటీ అయ్యారు. పరిశ్రమల పునర్నిర్మాణం కోసం వచ్చేరుణాల దరఖాస్తుల సాధ్యాసాధ్యాలను పరిశీలిం చాలని శక్తికాంత్ బ్యాంకులకు సూచించారు. ఈ సందర్బంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ నగదు లభ్యత అవసరాలను ఆర్‌బిఐ పూర్తిస్థాయిలో పరిష్కరించిందన్నారు. అవసరమైతే మరింత నగదు లభ్యతను పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రభుత్వం, ఆర్‌బిఐ మధ్య పలు అంశాలపై సంప్రదింపులు జరుగుతున్నప్పటికీ తమ పరిధిలోని అంశాలపై తుది నిర్ణయం ఆర్‌బిఐదేనని అన్నారు. ఆర్‌బిఐ తగినంత నగదు నిల్వలను ఉంచుతుందన్నారు. బ్యాంకింగ్ వ్యవస్థలో నగదు తగ్గడాన్ని ఆర్‌బిఐ కోరుకోదన్నారు. మంగళవారం బ్యాంకింగేతర ఫైనాన్షియల్ కంపెనీలతో సమావేశం కానున్నట్లు శక్తికాంత్ తెలిపారు.

ఎరిక్‌సన్ కేసు.. అంబానీకి నాలుగు వారాల గడువు

- సమాధానమివ్వాలని అనిల్‌కు సుప్రీం నోటీసులు
- చెల్లింపుల్లో ఆర్‌కామ్ రెండో సారి విఫలం ఎఫెక్ట్

న్యూఢిల్లీ : ఎరిక్‌సన్‌కు బకాయిల చెల్లింపుల విఫలంపై రిలయన్స్ కమ్యూనికేషన్స్ ఛైర్మన్ అనిల్ అంబానీకి సుప్రీంకోర్టు మరోమారు నోటీసులు ఇచ్చింది. ఎరిక్‌సన్ ఇండియా దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై నాలుగు వారాల్లోగా సమాధానమివ్వాలని న్యాయమూర్తి ఆర్‌ఎఫ్ నారిమన్ నేతత్వంలోని ధర్మాసనం సోమవారం అంబానికి ఆదేశాలు జారీ చేసింది. దాదాపు రూ.550 కోట్ల బకాయిలను చెల్లించడంలో పలుమార్లు విఫలమైన ఆర్‌కామ్ అధిపతి అనిల్ అంబానీపై స్వీడన్ టెలికం పరికరాల దిగ్గజం ఎరిక్సన్ గత వారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. తమ బాకీలు చెల్లించడంలో డిఫాల్ట్ అవుతున్న అనీల్‌ను, ఆయనతో పాటు మరో ఇద్దరు కంపెనీ ఉన్నతాధికారులను కోర్టు ధిక్కరణ నేరం కింద జైలుకు పంపాలని, బాకీలు చెల్లించేదాకా దేశం విడిచి వెళ్లకుండా ఆదేశాలివ్వాలని అభ్యర్థించింది. దీనిపై తాజాగా నారిమన్ బెంచ్ విచారణ చేపట్టింది. కాగా బకాయి కింద రూ.118కోట్లను చెల్లించడానికి ఆర్‌కామ్ సిద్దంగా ఉందని, ఈ మొత్తాన్ని ఎరిక్‌సన్ అంగీకరించాలని ఆర్‌కాం తరపు సీనియర్ అడ్వకేట్లు కపిల్ సిబల్, ముకుల్ రోహతగి కోర్టును కోరారు. కాగా ఎరిక్‌సన్ దీన్ని తిరస్కరించింది. దీంతో ఆ మొత్తాన్ని డిమాండ్ డ్రాఫ్టు రూపంలో కోర్టు రిజిస్ట్రీలో డిపాజిట్ చేయాల్సింగా ఆర్‌కాంను కోర్టు ఆదేశించింది.



ఆర్‌కామ్ ఆస్తులు విక్రయించగా రూ.3,000 కోట్లు పొందిందని అయినా తమకు చెల్లింపులు చేయలేదని ఎరిక్‌సన్ ఈ సందర్బంగా కోర్టు దృష్టికి తీసుకెళ్లింది. తమకు చెల్లించాల్సిన రూ.550 కోట్లు చెల్లించకుండా కావాలని తాత్సారం చేస్తోందని ఆరోపించింది. బకాయిల చెల్లింపునకు వ్యక్తిగతంగా హామీ ఇచ్చిన అనిల్ అంబానీ గడువు తీరినా స్పందించడం లేదని, తద్వారా కోర్టు గడువును కూడా ఉల్లంఘించారని ఎరిక్‌సన్ ఇది వరకు తన పిటిషన్‌లో పేర్కొంది. ఆర్‌కామ్ ఆస్తుల కొనుగోలుపై అంబానీ అన్నదమ్ములు ఇద్దరు కూర్చుని మాట్లాడుకోవాలని కోర్టు ఈ సందర్భంగా తాజాగా సూచించింది. పరస్పరం సమస్యను పరిష్కరించుకోని పక్షంతో తామేమి చేయలేమని నారిమన్ పేర్కొన్నారు. మరోవైపు స్పెక్ట్రం ట్రేడ్ మార్గదర్శకాలకు కట్టుబడి ఆర్‌కాం కొనుగోళ్లపై సిద్ధంగా ఉన్నారా అని జియోను కోర్టు ప్రశ్నించింది. అయితే ముందస్తు బకాయిల నేపథ్యంలో ఆర్‌కాంకు ఫిజికల్ గ్యారంటీ ఇచ్చేందుకు తాము సిద్ధంగా లేమని జియో సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే కోర్టుకు తెలిపారు. ఈ అంశంలో ట్రాయ్ నిబంధనలను పాటించాల్సి ఉందని అన్నారు.

వివాదమిలా..

దేశవ్యాప్తంగా ఆర్‌కామ్ టెలికం నెట్‌వర్క్ నిర్వహణకు సంబంధించి 2014లో ఎరిక్సన్ ఏడేళ్ల కాంట్రాక్టు దక్కించుకుంది. అయితే 2016 నుంచి చెల్లింపులు చేయకపోవడంతో సెప్టెంబర్ 2017లో ఆర్‌కామ్‌తో పాటు ఆ గ్రూప్‌లో భాగమైన రిలయన్స్ ఇన్‌ఫ్రాటెల్, రిలయన్స్ టెలికంలపై ఎరిక్సన్.. నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్‌ను (ఎన్‌సిఎల్‌టి)లో దివాలా పిటిషన్ వేసింది. ఈ కేసు పలు పరిణామాల మధ్య తుదకు 2017 సెప్టెంబర్ నాటికి రూ.550 కోట్లు చెల్లించాలని ఎన్‌సిఎల్‌టి ఆదేశాలు జారీ చేసింది. గడువులోగా ఈ మొత్తాన్ని చెల్లించకపోవడంతో ఎరిక్సన్ మళ్లీ కోర్టుకెళ్లడంతో డిసెంబర్ 15 నాటికి అవకాశం కల్పించింది. బకాయిలు చెల్లించడంలో ఆర్‌కామ్ రెండు సార్లు విఫలమయ్యింది. దీంతో తాజాగా ఎరిక్‌సన్ అభ్యర్థన మేరకు సుప్రీం మరోమారు కల్పించుకుంది. ప్రస్తుతం ఆర్‌కామ్ రూ.46,000 కోట్ల పైగా అప్పుల్లో ఉంది. ఆస్తుల విక్రయం ద్వారా ఈ అప్పులను రూ.6,000 కోట్లకు తగ్గించుకోవాలని నిర్దేశించుకుంది. అయితే టెలికం శాఖ నిబంధనలతో ఈ ఆస్తుల అమ్మకంలో తీవ్ర గందరగోళం చోటు చేసుకుంది.

పెరిగిన ప్రత్యక్ష పన్నుల వసూళ్లు

న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-డిసెంబరు కాలంలో ప్రత్యక్ష పన్నుల వసూళ్లు 14.1శాతం పెరిగి రూ.8.74లక్షల కోట్లకు చేరినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సోమవారం వెల్లడించింది. ఇదే సమయంలో పన్ను రీఫండ్లు రూ.1.30లక్షల కోట్లుగా చోటు చేసుకున్నాయి. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే రీఫండ్లు 17శాతం ఎక్కువగా ఉన్నాయి. ఇక అడ్వాన్స్ ట్యాక్స్ 14.5 శాతం పెరిగి రూ.3.64లక్షల కోట్లు వసూలయ్యాయి. రీఫండ్లను జారీ చేసిన అనంతరం నికర వసూళ్లు రూ.7.43లక్షల కోట్లుగా నమోదయ్యాయి. బడ్జెట్‌లో నిర్దేశించుకున్న ప్రత్యక్ష పన్నుల వసూళ్ల లక్ష్యం రూ.11.50లక్షల కోట్లలో డిసెంబర్ ముగింపు నాటికి 64.7శాతంగా ఉన్నట్లు ప్రభుత్వం వెల్లడించింది.


సెన్సెక్స్‌కు 155 పాయింట్ల లాభం

ముంబయి : అమెరికా-చైనా మధ్య వాణిజ్య సంబంధాలు మెరుగుపడుతున్నాయనే అంచనాలకు తోడు ప్రపంచ మార్కెట్లు రాణించడంతో దేశీయ ఈక్విటీలకు మద్దతు లభించింది. ఈ నేపథ్యంలో సోమవారం బిఎస్ఇ సెన్సెక్స్ 155 పాయింట్లు లాభపడి 35,850 వద్ద ముగిసింది. ఎన్ఎస్ఇ నిఫ్టీ 44 పాయింట్లు రాణించి 10,772కు చేరింది. నిఫ్టీలో ఐటి సూచీ 1.1 శాతం పెరిగింది. సెన్సెక్స్-30లో యాక్సిస్ బ్యాంకు, టాటా మోటార్స్, మారుతి సుజుకి, ఇన్ఫోసిస్, ఎన్‌టిపిసి సూచీలు అధికంగా లాభపడిన వాటిలో ముందు వరుసలో ఉన్నాయి. మరోవైపు బజాజ్ ఆటో, యస్ బ్యాంకు, హీరో మోటో కార్ప్, బజాజ్ ఫినాన్స్, కోల్ ఇండియా షేర్లు అధికంగా నష్టపోయిన వాటిలో టాప్‌లో ఉన్నాయి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

ఓకేస

మచిలీపట్నం రేవును అభివృద్ధి చేసిన వారు?



ఎవిపి.రాజు,
బిపిఎంఎం హైస్కూల్, విజయనగరం.
సెల్ : 9390465623

ఆంధ్రప్రదేశ్ సామాజిక, సాంస్కృతిక చరిత్ర

1. ఆంధ్రుల ప్రసక్తి ఐతరేయ బ్రాహ్మణంలో ఉంది.
2. శాతవాహనుల మొదటి రాజధాని కృష్ణానది ఒడ్డున ఉన్న శ్రీకాకుళం. తరువాత ధాన్యకటకం (అమరావతి)కి మార్చారు. మూడవ రాజధానిగా మహారాష్ట్రలోని ఫైఠాన్‌ను నిర్ణయించారు.
3. శాతవాహన రాజ్యస్థాపకుడు – సిముఖుడు (శ్రీముఖుడు)
4. శాతవాహనుల్లో 17వ రాజు హలుడు
5. శాతవాహనుల్లో గొప్పవాడు గౌతమీపుత్ర శాతకర్ణి
6. శాతవాహనుల్లో 27వ రాజు యజ్ఞశ్రీ శాతకర్ణి
7. ఇక్ష్వాకులు రాజధాని విజయపురి
8. బృహత్పలాయనుల రాజధాని గూడూరు (కృష్ణాజిల్లా)
9. ఆనందగోత్రులు రాజధాని చేజర్ల (గుంటూరు)
10. శాలంకాయనులు రాజధాని వేంగిపురం
11. విష్ణుకుండినులు గుంటూరు జిల్లాలోని వినుకొండ దగ్గర విష్ణుకుండినపురం వీరి జన్మస్థలం, మాధవవర్మ ఈ రాజ్యస్థాపకుడు.
12. ఆదికవి నన్నయ్య భారత రచన రాజరాజ నరేంద్రుని కాలంలోనే జరిగింది.
13. కాకతీయ వంశస్థాపకుడు గుండయ్య, మొదటి బేతరాజు, రెండో ప్రోలరాజు కాలంలో పశ్చిమ చాళుక్యుల బలహీనతను ఆధారంగా చేసుకుని, కాకతీయులు స్వతంత్రులయ్యారు.
14. గణపతిదేవుని అనంతరం అతని కుమార్తె రుద్రాంబ క్రీ.శ 1261 నుంచి 1296 వరకూ పరిపాలించింది.
15. ప్రోలయ వేమారెడ్డి కుమారుడు అనగా పోతారెడ్డి కాలంలో శత్రువుల బెడద పెరిగింది. రాజధాని కొండవీటికి మారింది.
16. పోతారెడ్డి రాజనీతి చతురుడు కవి. పండిత పోషకుడు, వసంతరాయుడనే బిరుదు వహించాడు.
17. కుమారగిరి రెడ్డి కవి, రసికుడు 'కర్పూర వసంతరాయు'డనే బిరుదును పొందినాడు.
18. హరిహర, బుక్కరాయులనే సంగమ రాజపుత్రులు విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించారు. (1336)
19. విజయనగర సామ్రాజ్యాన్ని సంగమ, సాళువ, తుళువ, అరవీడు వంశాలు పాలించాయి.
20. శ్రీకృష్ణదేవరాయలు బీదర్ రాజ్యాన్ని ఓడించి, తిరిగి వారినే పాలకులుగా నియమించి 'యవన రాజ్య ప్రతిష్టాపన చర్య' అని శ్లాఘింపబడినాడు.
21. శ్రీకృష్ణదేవరాయలు పాలనలో విజయనగర సామ్రాజ్యం ఎంతో వైభవంగా అలరారింది. అతని కీర్తి సాహితీ సమరాంగణ సార్వభౌమునిగా చరిత్రలో స్థిరపడింది.
22. విజయనగర సామ్రాజ్య కాలంలో పంటలో సుమారు 40 నుంచి 50 శాతం వరకూ భూమి శిస్తు వసూలు చేసేవారు.
23. దూర ప్రాచ్యంలో జావా, సుమిత్రా, ఇండోచైనా, మలయా ద్వీపకల్పము, జపాన్ వంటి దేశాలతో కూడా శాతవాహనులకు వర్తక సంబంధాలుండేవి.
24. శాతవాహనుల నాణేలపై ఉన్న ఓడబొమ్మలు వీరి విదేశీ వాణిజ్యాన్ని ముఖ్యంగా కృష్ణానది తీరంలో దొరికిన రోమన్ నాణేల వల్ల వీరి రోమన్ సామ్రాజ్య వర్తక సంబంధాలను తేటతెల్లం చేస్తున్నాయి.
25. శాతవాహన చక్రవర్తి హలుడు స్వయంగా కవి పండితుడు. ఈయన రాసిన గాథాసప్తశతి ఆ కాలపు సాహిత్యంలో మేటిగ్రంథం. హలుడు అనేక కవులను ఆదరించాడు. అందుకే అతనిని కవి వత్సలుడు అని పిలుస్తారు.
26. కాకతీయుల కాలంలోనే సుమతీ శతకం రచించబడింది.
27. బ్రాహ్మణుల వాక్కే నాటి ధర్మశాస్త్రం అని న్యూనిజ్ అన్నారు.
28. విజయనగర రాజ్యానికి అరేబియా, పోర్చుగల్, పర్షియా మొదలైన విదేశాలతో వాణిజ్య సంబంధాలు ఉండేవి.
29. 1443 సంవత్సరంలో విజయ నగరాన్ని దర్శించిన రజాక్ ప్రపంచంలోనే అంతటి గొప్ప నగరం లేదని (విజయనగరం) స్తుతించాడు. నాడు 300 రేవు పట్టణాలు ఉన్నట్లుగా కూడా రాశాడు.
30. విజయనగరంలో వస్త్ర, లోహ పరిశ్రమలు ప్రసిద్ధి చెందాయి.
31. 'సుగంధ పుష్పాలు నగరంలో నిరంతరం దొరుకుతాయి. వర్తకులు వివిధ శ్రేణులుగా ఏర్పడినాయి. రత్నాలు, వజ్రాలు, కెంపులు వీధుల్లో బహిరంగంగా అమ్మేవారు' అని రజాక్ రాశాడు.
32. విజయనగర పాలన కాలంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులు.. అనే చాతుర్వర్ణ వ్యవస్థలున్నట్లుగా అల్లసాని పెద్దన మనుచరిత్రలో పేర్కొన్నాడు.
33. విజయనగర సామ్రాజ్యంలోని స్త్రీలు చిన్నతనం నుంచే సంగీతం, నృత్యం, విద్య నేర్చుకునేవారని న్యూనిజ్ రాశాడు.
34. వైష్ణవ మతంలో రామానుజుని శ్రీవైష్ణవం అత్యధిక పోషణ పొందింది.
35. మధుర విజయం –గ్రంథకర్త – గంగాదేవి, వరదాంబిక పరిణయం గ్రంథకర్త తిరుమలాంబ.
36. రెండో దేవరాయుల కాలంలో ఉన్న శ్రీనాథుడు, పోతన తెలుగు సాహిత్యానికి ఎనలేని కీర్తి ప్రతిష్టలు సంపాదించి పెట్టారు.
37. శ్రీనాథుడు కనకాభిషేకం చేయించుకున్న కవి సార్వభౌముడు ఆయన రాసిన కావ్యాలలో శృంగారనైషధం ముఖ్యమైన వాటిలో ఒకటి.
38. శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా రాసిన ఆముక్తమాల్యద గ్రంథం తెలుగు భాషలోని ఐదు ఉద్గ్రంథాల్లో ఒకటిగా చెప్పబడుతుంది.
39. కళాపూర్ణోదయ కర్త పింగళి సూరన
40. శాతవాహన పరిపాలనా కాలపు ఉత్తర భాగానికి చెందిన ప్రముఖ రసాయనికుడు, బౌద్ధమత ప్రచారకుడు ఆచార్య నాగార్జునుడు. అతడు బౌద్ధంలో మాధ్యమిక ధర్మనాన్ని ప్రవర్తింపజేశాడు. ఇదే మహాయానశాఖగా అభివృద్ధి చెందింది.
41. కాకతీయుల కాలంలో వరంగల్ ఆంధ్రమహా నగరంగా పిలువబడేది.
42. విజయనగర రాజులలో సంగమ వంశస్తులు శైవులు. విరూపాక్షుడు వారి ఆరాధ్యదైవం.
43. విజయనగర సామ్రాజ్యాన్ని స్థాపించిన పదకొండు సంవత్సరాలకు (క్రీ.శ 1347) అల్లావుద్దీన్ జాఫర్‌ఖాన్ బహమనీ దక్కన్ ప్రాంతంలో బహమనీ రాజ్యంగా ఏర్పడింది.
44. బహమనీ రాజ్యంలో మరల ఐదు కొత్త సుల్తాన్ రాజ్యాలు ఏర్పడ్డాయి. అవి. 1. బీరార్‌ను పాలించిన ఇమాద్ షాహీ వంశం. అహమ్మద్ నగర్‌ను పాలించిన నిజాంషాహీ వంశం, బీజాపూర్‌ను పాలించిన ఆదిల్‌షాహీ వంశం, గోల్కొండను పాలించిన కుతుబ్‌షాహీ వంశం, బీదర్‌ను పాలించిన బరీద్‌షాహీ వంశం ప్రధానమైనవి.
45. కుతుబ్‌షాహీ వంశంచే పాలించబడిన గోల్కొండ నవాబులు ముఖ్యంగా ఆంధ్రప్రాంతాన్ని పాలించారు. వీరు పరిపాలించింది తెలుగు ప్రజలు కావడం వల్ల గోల్కొండ నవాబులను ఆంధ్ర సుల్తానులు అని కూడా వ్యవహరించారు.
46. క్రీ.శ 1518లో తెలంగాణ రాష్ట్ర పాలకుడైన కుతుబ్‌షా గోల్కొండను రాజధానిగా చేసుకుని, స్వతంత్రుడయ్యాడు. ఇతని వంశీయులనే కుతుబ్‌షాహీ వంశస్థులని పిలుస్తారు.
47. గోల్కొండలో స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించిన కులీకుతుబ్‌షా పర్షియా, ట్రాన్సోల్జియాలను పాలించిన 'హందము' రాజ వంశమునకు చెందిన తురుష్కుడు.
48. కులీకుతుబ్‌షా ప్రజామన్ననలకు పాత్రుడై బడేమాలిక్‌గా పిలువబడి ఆంధ్ర విఖ్యాతికి మూలకారకుడయ్యాడు. (1512-1543)



49. కులీ కుతుబ్‌షా పదవిని అలంకరించిన వెంటనే తన అధికారమును సుస్థిరం చేసుకోడానికి గోల్కొండ దుర్గమును పటిష్టపరిచి, దానికి మహమ్మద్‌నగర్ అని పేరును మార్చారు.
50. ఇబ్రహీం కుతుబ్‌షా పరమత సహనం ప్రదర్శించి, హిందువుల ప్రేమాభిమానాలు చూరగొన్నాడు. తెలుగు భాషను అభిమానించి, తెలుగు ప్రజలచే మల్కీభరామ అని కీర్తించబడినాడు.(1550-1580)
51. ఇబ్రహీంపట్టణ తటాకం, హైదరాబాద్‌లోని హుస్సేన్‌సాగర్ ఇబ్రహీంపాలన కాలంలో నిర్మించినవే.
52. ఇబ్రహీంషా ఆదరణలో 'కందుకూరి రుద్రకవి' అనే తెలుగు కవి 'నిరంకుశోపాఖ్యానము' అనే కావ్యాన్ని, 'సుగ్రీవ విజయం' అనే యక్షగానాన్ని రచించాడు.
53. ఇబ్రహీం సుల్తాను అయిన వెంటనే కందుకూరి రుద్రకవి, అద్దంకి గంగాధర కవి, మరిగంటి సింగనాచార్యులను పోషించి వారితో 'మల్కీభరామ'గా కీర్తి పొందాడు.
54. ఇబ్రహీం కాలంలో దక్కన్ ఉర్దూ అనే మాండలికం అభివృద్ధి చెందింది.
55. మహమ్మద్ కులీకుతుబ్‌షా పర్షియా పాలకుడు. షా అబ్బాస్ కూడా ఇతని కొలువుకు తన రాయబారిని పంపెను (1580-1612)
56. ఆంగ్లేయులు 1611 మచిలీపట్నంలో మొదటి వర్తక స్థావరాన్ని నిర్మించాడు.
57. మహమ్మద్ కులీకుతుబ్‌షా తన ప్రియురాలు భాగ్యమతి పేర భాగ్యనగరాన్ని 1591లో నిర్మించాడు. తరువాత అది సుల్తాన కుమారుడైన హైదర్ పేరున హైదరాబాద్‌గా మార్చబడింది. ఆ తర్వాత రజధానిని గోల్కొండ నుంచి హైదరాబాద్‌కు మార్చారు.
58. అబ్దుల్ హసన్ తానీషా (1672-1687) కుతుబ్‌షాహీ వంశములో చివరి పాలకుడు. ఇతడు అక్కన్న, మాదన్న అనే హిందూ సోదరుల సహాయంతో 1672లో సింహాసనాన్ని అధిష్టించాడు.
59. అబ్దుల్ హసన్ తానీషాను ప్రజలు తానీషా (మంచి రాజు) అని పిలిచారు.
60. అబ్దుల్ హసన్ తానీషా కాలంలో కంచర్ల గోపన్న (రామదాసు) అనే తహశీల్దార్ ప్రభుత్వ ధనంతో భద్రాచలంలో రామాలయాన్ని నిర్మించాడు.
61. 1687లో గోల్కొండను ఆక్రమించి, ఔరంగజేబు ఆ భూభాగాన్ని తన రాజ్యంలో విలీనం చేసుకున్నాడు.
62. ప్రతి సర్కారుకు పాలనా నిర్వహణాధికారి ఫౌజుదారు.
63. గ్రామపాలనా నిర్వహణను పాలెగాండ్రు నిర్వహించేవారు. గ్రామ మునసుబును తెలంగాణ ప్రాంతంలో పటేలు అంటారు.
64. హిందూ పండగలైన నౌరోద్ (సంవత్సరాది) నాడు కుతుబ్‌షా తను కూడా రాచనగరులో పండగ జరుపుకునేవారు.
65. మచిలీపట్నం రేవును సుల్తానులు అభివృద్ధి చేసి, నౌకా వ్యాపార కేంద్రంగా చేసుకున్నారు. ★

ఉద్యోగాలు

వివిధ పోస్టులకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు విడుదల

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టుల వివరాలు:

1. ఏపీ బాయిలర్స్ సర్వీస్‌లో బాయిలర్స్ ఇన్‌స్పెక్టర్లు : 3

అర్హత: మెకానికల్/ ప్రొడక్షన్/ పవర్ ప్లాంట్/ మెటలర్జికల్ ఇంజనీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు రెండేళ్ల పని అనుభవం ఉండాలి.

వయసు: జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: కంప్యూటర్ బేస్డ్ ఎగ్జామినేషన్/ మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ కాంపిటీటివ్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.

దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 25, 2019.

2. అసిస్టెంట్ కమిషనర్: 7 (ఏపీ ఛారిటబుల్ అండ్ హిందు రెలిజియస్ ఇన్‌స్టిట్యూషన్స్ అండ్ ఎండోమెంట్స్ సర్వీస్)

అర్హత: లా గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో అడ్వకేట్‌గా మూడేళ్ల అనుభవం ఉండాలి.

వయసు: జులై 1, 2018 నాటికి 28-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామినేషన్, ఓరల్ కాంపిటీటివ్ ఎగ్జామ్/ ఇంటర్వ్యూ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 19, 2019.

3.అసిస్టెంట్ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టర్లు: 3 (ఏపీ ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ సర్వీస్)

అర్హత: ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల ప్రాక్టికల్ అనుభవం ఉండాలి.

వయసు: జులై 1, 2018 నాటికి 18-42 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ అభ్యర్థులకు సడలింపు ఉంటుంది.

ఎంపిక: స్క్రీనింగ్ టెస్ట్/ ప్రిలిమినరీ ఎగ్జామినేషన్, మెయిన్ ఎగ్జామినేషన్, రాత/ ఓరల్ కాంపిటీటివ్ ఎగ్జామ్ ఆధారంగా.

దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో.

దరఖాస్తు ఫీజు: అప్లికేషన్ ప్రాసెసింగ్ ఫీజు రూ.250, ఎగ్జామినేషన్ ఫీజు రూ.120.

దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 25, 2019.

పూర్తి వివరాలు : వెబ్‌సైట్‌లో పరిశీలించొచ్చు.

వెబ్‌సైట్: https://psc.ap.gov.in

మహిళల రక్షణ కోరుతూ మానవహారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

మహిళలకు రక్షణ కల్పించాలని, మహిళలపై హింసను అరికట్టాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ, ఐద్వా ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఎవి అప్పారావు రోడ్డులో సోమవారం మానవహారం నిర్వహించారు. సేవ్ గర్ల్స్, స్టాప్ వయొలెన్స్, వుయ్ డోన్ట్ గో బ్యాక్‌వర్డ్ అంటూ పెద్దపెట్టున నినదించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.పవన్ మాట్లాడుతూ మోడీ ప్రభుత్వంలో దేశంలో మహిళలపైనా, విద్యార్థినులపైనా దాడులు పెరిగాయన్నారు. ప్రపంచంలో మహిళలకు రక్షణ లేని దేశాల్లో భారత్ 3వ స్థానం, ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉండటం అత్యంత దారుణమని అన్నారు. డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడుతూ మహిళలపై వివక్ష నేటికీ పైస్థాయి నుంచి కొనసాగుతోందన్నారు. లింగ వివక్షపై మహిళలు గళం విప్పాల్సిన సమయం నేడు ఆసన్నమైందన్నారు.



పుస్తకావిష్కరణ

నేర్చుకుంటూ నేర్పుతూ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రముఖులు

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా ఉండాలి

'నేర్చుకుంటూ నేర్పుతూ' పుస్తకావిష్కరణలో వక్తలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

ఉపాధ్యాయుడు నిత్య విద్యార్థిగా తాను నేర్చుకుంటూ విద్యార్థులకు నేర్పుతుంటే పరిపూర్ణత లభిస్తుందని పలువురు వక్తలు అన్నారు. విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ ఆధ్వర్యంలో నగరంలోని స్వరాజ్య మైదాన్‌లో జరుగుతున్న 30వ పుస్తక మహోత్సవ్‌లో ఉపాధ్యాయులు, విద్యార్థులకు ఉపయోగపడే పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం సాయంత్రం జరిగింది. నేర్చుకుంటూ నేర్పుతూ అనే పుస్తకాన్ని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సంధ్యారాణి ఆవిష్కరించారు. పలక అనే పుస్తకాన్ని పబ్లిక్ లైబ్రరీ డైరెక్టర్ పి.పార్వతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ విద్యా రంగంలో ఎప్పటికప్పుడు వినూత్నమైన మార్పులు వస్తున్నాయని వాటికి అనుగుణంగా ఉపాధ్యాయులు కూడా మారి విద్యార్థులకు నేర్పించాలన్నారు. ప్రముఖ రచయిత సి.వి.కృష్ణయ్య ఉపాధ్యాయుల కోసం నేర్చుకుంటూ నేర్పుతూ అనే పుస్తకం ప్రతి ఉపాధ్యాయుడు ఖచ్చితంగా చదవాలన్నారు. పబ్లిక్ లైబ్రరీ డైరెక్టర్ పి.పార్వతి మాట్లాడుతూ ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులకు సామాజిక అంశాల గురించి తెలియచెప్పాలన్నారు. సభకు అధ్యక్షత వహించిన శాసన మండలి సభ్యులు విఠపు బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ విద్యారంగంలో పాఠశాల విద్యార్థుల బోధనకు సంబంధించి ఎన్నో పుస్తకాలు వచ్చాయని వాటన్నింటికీ భిన్నంగా సివి కృష్ణయ్య పుస్తకం ఎంతో ఉన్నతంగా ఉంటుందన్నారు. ప్రతి బడిలోనూ, ప్రతి ఉపాధ్యాయుని వద్ద ఉండాల్సిన పుస్తకమని అన్నారు. ఇటువంటి పుస్తకాలు విద్యా రంగంలో ఉన్న వారే కాకుండా ప్రతి ఒక్కరూ చదవాలన్నారు. కార్యక్రమంలో దేవినేని సీతారావమ్మ ఫౌండేషన్ నిర్వాహకులు డి.మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం అభ్యుదయ సాహిత్యం - వర్తమాన ఆవశ్యకత అనే అంశంపై సదస్సు జరిగింది. కార్యక్రమంలో ప్రముఖ అభ్యుదయ రచయితలు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ, డాక్టర్ రాచపాళెం చంద్రశేఖరరెడ్డి, పెనుగొండ లక్ష్మీనారాయణ ప్రసంగించారు.

'నిన్ను నమ్మం బాబు' రాజ్యాంగ విరుద్ధం

వైసిపిపై ఎస్పీలకు టిడిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-గుంటూరు సిటీ ప్రతినిధి

గుంటూరు జిల్లా వైసిపి నాయకులు తమ వాహనాలపై 'నిన్ను నమ్మం బాబు' అనే నినాదాన్ని ముద్రించడం రాజ్యాంగ విరుద్ధమని జిల్లా టిడిపి నాయకులు ఈడే మురళీకృష్ణ, కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు పేర్కొన్నారు. ఈ మేరకు గుంటూరు ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వైసిపి నాయకులపై అర్బన్, రూరల్ ఎస్పీలకు ఫిర్యాదు చేశారు. రాజ్యాంగ బద్ధంగా ఎన్నికైన సిఎం చంద్రబాబు ప్రతిష్టకు భంగం కలిగించేలా బ్యానర్లు, స్టిక్కర్లు ముద్రించి ప్రచారం చేస్తున్న వైసిపి నాయకులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. వైసిపి తీరువల్ల వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు పెరిగి శాంతి భద్రతలకు విఘాతం కలిగే ప్రమాదం ఉందన్నారు. చంద్రబాబుపై అసభ్యపదజాలంతో పాటు ఫ్లెక్సీలపై 'మోస్ట్ వాంటెడ్ క్రిమినల్స్' అంటూ ఫొటోలను ముద్రిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

నేనే సిఎం అభ్యర్థిని : కెఎ.పాల్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

ప్రజాశాంతి పార్టీ తరపున తానే సిఎం అభ్యర్థినని ఆ పార్టీ వ్యవస్థాపకుడు కెఎ పాల్ తెలిపారు. కేంద్రంలో మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలనలో ఫెయిలయ్యారని విమర్శించారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం పర్యటనలో భాగంగా స్థానిక ఆనంద్ రీజెన్సీలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీస్ మిషన్ వ్యవస్థాపకుడిగా ప్రపంచాన్ని మార్చేందుకే రాజకీయాల్లోకి వచ్చానని, దేశాన్ని, రాష్ట్రాన్ని మార్చి చూపుతానని అన్నారు. 30 రోజుల్లో రాష్ట్రంలోని 13 జిల్లాల్లో అన్ని నియోజకవర్గాలకు కో-ఆర్డినేటర్లను ప్రకటిస్తామన్నారు. ఫిబ్రవరిలో బహిరంగ సభలు జరుగుతాయని, మార్చిలో అభ్యర్థులను ప్రకటిస్తామని తెలిపారు. రాష్ట్రంలో అవినీతి పెరిగిపోయిందని, ప్రజాప్రతినిధులు రూ.కోట్లు సంపాదిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

విపత్తులను ఎదుర్కోవాలి

అరుణాచల్‌ప్రదేశ్ గవర్నర్

ప్రజాశక్తి - మద్దిలపాలెం, విశాఖ

విపత్తులను ధీటుగా ఎదుర్కోవాలని, ఐక్యత, దేశభక్తి భావాలను ప్రతి ఒక్కరూ అలవర్చుకోవాలని అరుణాచల్‌ప్రదేశ్ గవర్నర్ బిడి.మిశ్రా అన్నారు. సోమవారం ఎయులోని వైవిఎస్.మూర్తి ఆడిటోరియంలో జరిగిన విపత్తు నిర్వహణ జాతీయ సదస్సులో పాల్గొని మాట్లాడారు.సరిహద్దు వద్దనే కాకుండా అంతర్గతంగానూ విపత్తులు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కోడానికి సమాయత్తం, సన్నద్ధత, నైపుణ్యం ఎంతో అవసరమని తెలిపారు.

ప్రజ్ఞ

జవాబులు

1. భువనేశ్వర్ (డిసెంబరు27)
2. సుధీర్ భార్గవ్
3. రిషబ్ పంత్
4. సెక్షన్ 354ఎ
5. 14433

ముమ్మర ప్రచారం...సమ్మెకు సన్నద్ధం

ప్రజాశక్తి - యంత్రాంగం

సమ్మెకు ఆంధ్రావని సన్నద్ధమైంది. మంగళ, బుధవారాల్లో జరిగే దేశవ్యాప్త సమ్మెలో భాగంగా గత నెల రోజులుగా రాష్ట్రంలో అన్ని జిల్లాల్లో సభలు, సమావేశాలు, పాదయాత్రలు, ర్యాలీలు ముమ్మరంగా జరిగాయి.

సిఐటియు, ఎఐటియుసి అధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా పలు రూపాల్లో ప్రచార కార్యక్రమాలు నిర్వహించారు. విశాఖసిటీలోని మద్దిలపాలెం, వెంకోజీపాలెం, ఇసుకతోట, హెచ్‌బి.కాలనీ, సీతమ్మధార, జాలరిపేట, చినవాల్తేరు, లాసెన్స్‌బే కాలనీ, పిఠాపురం కాలనీ, శివాజీపాలెం, అప్పుఘర్, శివాజీపార్క్‌ల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. డెయిరీ కాలనీ వద్ద ప్రచార జాతాను సిఐటియు నగర అధ్యక్షులు ఆర్.కె.ఎస్.వి.కుమార్ ప్రారంభించారు. 37వ వార్డు బాపూజీ నగర్‌లో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. మల్కాపురం జోన్‌లోని హెచ్‌ఎస్‌ఎల్, హెచ్‌పిసిఎల్, డాక్‌యార్డు, భెల్ కంపెనీల వద్ద, గాజువాక, శ్రీనగర్‌లలో పలుచోట్ల ప్రచారం చేపట్టారు. సుజాతనగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. విశాఖపట్నం రూరల్‌లోని రోలుగుంటలో జీపుజాత, అనకాపల్లిలో బైకు ర్యాలీ, నర్సీపట్నం, నాతవరం మండలాల్లో ఆటో ప్రచారం నిర్వహించారు. కర్నూలులోని గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల దిగ్బంధనం చేపట్టాలని కార్మిక సంఘాలతో పాటు, రైతు సంఘాలు పిలుపునిచ్చాయి. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు అందరూ భాగస్వాములవ్వాలని పి.పెద్దిరెడ్డి ఎపి రైతు సంఘ ప్రధాన కార్యదర్శి పిలుపునిచ్చారు. తూర్పుగోదావరి జిల్లా పిఠాపురం నందూరి ప్రసాదరావు భవన్లో సిఐటియు నాయకుడు మోరుకుర్తి సూరిబాబు అధ్యక్షతన రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. అంబాజీపేట, పెదపూడిలో అంగన్‌వాడీలు సమ్మె సమాయత్తానికి సమావేశం నిర్వహించారు. పశ్చిమగోదావరి జిల్లాలో ప్రచార కార్యక్రమాలు పెద్దఎత్తున జరిగాయి. ఈ సందర్భంగా జంగారెడ్డిగూడెం, తాడేపల్లిగూడెంలో ప్రజాసంఘాల ఆధ్వర్యాన బైక్‌ర్యాలీ నిర్వహించారు. తణుకు, గణపవరంలో సమ్మె విజయంతం చేయాలని కోరుతూ సమావేశంలో పిలుపునిచ్చారు. ఏలూరులో మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్, అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యాన సమావేశాలు జరిగాయి. మోటారు వాహనాల చట్ట సవరణ బిల్లుకు, జరిమానాలకు, కఠిన శిక్షలకు, ఆర్‌టిఏ, పోలీసుల వేధింపులకు వ్యతిరేకంగా సార్వత్రిక సమ్మెలో ఆటో కార్మికులందరూ పాల్గొనాలని విజయనగరం పట్టణంలో శ్రీ కనకదుర్గా ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆటో ప్రచారం జరిగింది. అనంతరం ఈ మేరకు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. గుంటూరులో వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాల నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించారు. శంకర్‌విలాస్‌సెంటర్ నుండి లాడ్జిసెంటర్, కొరిటపాడు మీదుగా గుజ్జనగుండ్ల సెంటర్ మీదుగా తిరిగి శంకర్ విలాస్ సెంటర్‌కు ర్యాలీ చేరింది. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కాకుమాను నాగేశ్వరరావు, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడారు. సమ్మెకు ఎస్ఎఫ్ఐ మద్దతిస్తున్నట్లు నాయకులు ప్రకటించారు. మంగళగిరిలో సిఐటియు ఆధ్వర్యంలో ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. సిఐటియు కార్యాలయం నుండి ట్రంకు రోడ్డు మెయిన్ బజార్ మీదుగా ర్యాలీ కొనసాగింది. గుంటూరులోని పలు ఎల్ఐసి బ్రాంచిల్లో ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సంఘీభావ సమావేశాలు నిర్వహించారు. అరండల్‌పేట ఎల్ఐసి కార్యాలయం ఎదుట బ్యానర్ ప్రదర్శించి సమ్మెకు మద్దతుగా నినాదాలు చేశారు. నరసరావుపేటలో భవననిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించి సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. తాడేపల్లిలోని మహానాడు, సుందరయ్య నగర్‌లోని ముఠా కార్మికులతో విస్తృత సమావేశాల్లో ప్రజాశక్తి మాజీ ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ ఎస్.వెంకట్రావు మాట్లాడారు. సీతానగరం, మున్సిపల్ కార్యాలయ సమీపంలో మచ్చర పాయింటు వద్ద సిఐటియు ఆధ్వర్యంలో సమావేశాలు నిర్వహించారు. సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ కృష్ణాజిల్లా నూజివీడు పట్టణంలో సిఐటియు, ఎఐటియుసి, ఐఎఫ్‌టియు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.



విశాఖ ఆరిలోవలో ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

బిజెపికి ఎంఎల్ఎ ఆకుల రాజీనామా?

విశాఖ నేత రామకోటయ్య గుడ్‌బై

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి/ కలెక్టరేట్, విశాఖ

బిజెపికి ఎదురుగాలి వీస్తున్న నేపథ్యంలో ఆ పార్టీకి చెందిన నేతలు రాజీనామాలు చేస్తున్నారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి చెరువు రామకోటయ్య బిజెపికి రాజీనామా చేశారు. విశాఖలోని ఒక హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ఇటీవల కొన్ని సంఘటనలు తనను కలచివేశాయని చెప్పారు. విశాఖపట్నం కేంద్రంగా రైల్వేజోన్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయకపోవడం బట్టి చూస్తే విశాఖ పట్ల కేంద్రం తీవ్ర అలక్ష్యం ఉన్నట్లు స్పష్టమవుతుందన్నారు. తాను ఏ పార్టీలోనూ చేరడం లేదని తెలిపారు. అలాగే రాజమహేంద్రవరం సిటీ ఎంఎల్ఎ ఆకుల సత్యనారాయణ బిజెపికి రాజీనామా చేసి జనసేనలో చేరుతున్నట్లు సోమవారం ఉదయం నుంచి మీడియాలో విస్తృత ప్రచారం సాగింది. ఇప్పటికే ఆయన సతీమణి జనసేనలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఎంఎల్ఎ ఆకుల ఢిల్లీలో బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్‌షాను కలిసేందుకు సోమవారం ప్రయత్నాలు చేశారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో మంగళవారం అమిత్‌షాను కలిసి రాజీనామాపై ఒక నిర్ణయం తీసుకుంటారనే ప్రచారం ఉంది. ఆకుల సత్యనారాయణ ఈసారి ఏ పార్టీ నుండి టికెట్ ఇచ్చినా రాజమహేంద్రవరం ఎంపిగా పోటీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అయితే తాను పార్టీకి రాజీనామా చేయలేదని ఆకుల మీడియాకు చెప్పారు. ఓ ఛానల్‌లో జరుగుతున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు.

వెహికల్ డిపో కార్మికుల ధర్నా

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

విజయవాడ వెహికిల్ డిపోలో పని చేస్తున్న కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సోమవారం గాంధీనగర్‌లోని వెహికిల్ డిపో వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్.బాబూరావు మాట్లాడుతూ వెహికిల్ డిపో కార్మికులకు 8 గంటల పని విధానం అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు విశ్రాంతి తీసుకునే గదికి మరమ్మతులు చేయాలని కోరారు. వెహికిల్ డిపో కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే డిపో కార్మికులంతా సమ్మె చేస్తారని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్‌లో ఉన్న వారిపై కక్షసాధింపు చర్యలకు దిగితే ఆ కార్మికులకు సిఐటియు అండగా ఉంటుందన్నారు. మున్సిపల్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ నగర పాలక సంస్థ ఉన్నతాధికారులు స్వయంగా వచ్చి వెహికిల్ డిపోలో కార్మికులు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితుల్లో పని చేస్తున్నారో పరిశీలన చేయాలన్నారు. వెహికిల్ డిపో కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నేతలు ఎస్.జ్యోతిబసు, ఎం.డేవిడ్ పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరణలో పాల్గొన్న రజక వృత్తిదారుల నాయకులు

రజకవృత్తిదారుల క్యాలెండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - సత్యనారాయణపురం (విజయవాడ)

రాష్ట్రంలో రజకవృత్తిదారులపై భూస్వాములు, పెత్తందారులు చేస్తున్న దౌర్జన్యాలు, దాడులు, గ్రామ బహిష్కరణలు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు నివారించేందుకు రజకవృత్తిదారులకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎం.భాస్కరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. విజయవాడలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రజకవృత్తిదారుల సంఘం రూపొందించిన 2019 క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రజక జెఎసి ఛైర్మన్ బి.సుబ్బారావు, సంఘం ప్రధాన కార్యదర్శి పి.గురుశేఖర్, వృత్తిదారుల సంఘం సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.రామకృష్ణ, సాకిరేవు మన రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పార్థసారథి, సాకిరేవు పత్రిక సంపాదకులు మహేంద్ర, పాల్గొన్నారు.

మోడీ, బాబు ఒకే తాను ముక్కలు

- సిపిఐ, సిపిఐ, జనసేన నేతలు రామకృష్ణ, మధు, పోతిన
- రాష్ట్రాభివృద్ధి పట్టని జగన్
- అవకాశ వాద రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపు



పశ్చిమ నియోజకవర్గ మ్యానిఫెస్టోను విడుదల చేస్తున్న సిపిఐ, సిపిఎం, జనసేన నేతలు రామకృష్ణ, మధు, పోతిన తదితరులు

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

కేంద్రంలో పాలన సాగిస్తున్న నరేంద్ర మోడీ, రాష్ట్రంలో పాలన సాగిస్తున్న చంద్రబాబు ఒకే తానులోని ముక్కలేననీ, దొందూ ..దొందేననీ సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శులు పి మధు, కె.రామకృష్ణ, జనసేన రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్ అన్నారు. రాష్ట్రంలో ప్రతిపక్ష నేతగా బాధ్యతతో ఉండాల్సిన వైఎస్ జగన్ ఒకే ఒక లక్ష్యం ముఖ్యమంత్రి పదవి సాధించడమే తప్ప రాష్ట్రాభివృద్ధిపై లేదన్నారు. చంద్రబాబు ఎప్పుడూ ముఖ్యమంత్రి పదవి నుండి దిగుతారా, ఆ పదవిలోకి తాను ఎప్పుడు ఎక్కుదామా అని జగన్ కాచుకుని కూర్చున్నారని విమర్శించారు. ప్రజా సమస్యలపై అధికార పక్షాన్ని నిలదీయడం మానివేశారని విమర్శించారు. ఇటువంటి అవకాశవాద రాజకీయశక్తులను తిప్పికొట్టేందుకు రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమైందన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాల కోసం సిపిఐ, సిపిఎం, జనసేన పార్టీల ఆధ్వర్యాన విజయవాడ వన్‌టౌన్ నెహ్రూబొమ్మ సెంటరులో సోమవారం ప్రజాభేరి బహిరంగ సభ నిర్వహించారు. ఈ సభలో తొలుత సిపిఎం, సిపిఐ, జనసేన నేతలు గాలిలోకి బెలూన్లు ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ కాపులను బిసిల్లో చేరుస్తానని ఎన్నికలకు ముందు చంద్రబాబు హామీ ఇచ్చి అమలు చేయలేదని వివరించారు. తాజాగా అగ్రకులాలలో వెనుకబడిన వారు ఉన్నారని, వారికి పది శాతం రిజర్వేషన్ ఇవ్వడానికి సిద్ధమని మోడీ మాట్లాడుతున్నారన్నారు. చంద్రబాబు నాలుగేళ్లల్లో రూ.6 లక్షల కోట్ల మేర అవినీతికి పాల్పడ్డారని జగన్ అంటుంటే, జగన్ లక్ష కోట్ల అవినీతి చేశారని చంద్రబాబు అంటున్నారని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే వామపక్షాలు రాజకీయ చైతన్యం గల జనసేనతో కలిసి ముందుకు సాగేందుకు సిద్ధమయ్యాయని వివరించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర, దేశ రాజకీయాల్లో పెనుమార్పులు సంభవించబోతున్నాయన్నారు. కేంద్రంలో బిజెపి పాలనకు చరమగీతం పాడే రోజులు అతిత్వరలో ఉన్నాయన్నారు. తాజాగా ఐదు రాష్ట్రాలలో జరిగిన ఎన్నికల్లో బిజెపి మూడు రాష్ట్రాల్లో ఓడిపోవడమే దీనికి సంకేతమన్నారు. మోడీతో జతకట్టిన నేతలు ఒక్కొక్కరుగా దూరమవుతున్నారనీ, దళితులు, వ్యాపారులు, రైతులు, ఉద్యోగులు, కార్మికులు, అన్ని వర్గాల ప్రజలు మోడీ పాలనా విధానాలపై విస్మయం వ్యక్తం చేస్తున్నారనీ వివరించారు.. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో జనసేన, కమ్యూనిస్టులు కలిసి నూతన రాజకీయ ఒరవడికి శ్రీకారం చుట్టబోతున్నాయన్నారు. జనసేన రాష్ట్ర నాయకులు పోతిన వెంకట మహేష్ మాట్లాడుతూ 2019 ఎన్నికలు చంద్రబాబు అవినీతి పాలనకు, కమ్యూనిస్టులు, జనసేన నీతివంతమైన కూటమి మధ్య జరగబోతున్నాయన్నారు. రోజుకో పార్టీ, పూటకో జెండా పట్టుకునే నేతలను ఇంటికి సాగనంపాలన్నారు.

ఈ సభలో పశ్చిమ నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం రూపొందించిన మ్యానిఫెస్టోను విడుదల చేశారు. విజయవాడలో అరాచక శక్తుల పాలనను, పోలీసులతో కలిసి వడ్డీ వ్యాపారులు చేస్తున్న అరాచకాలను సాగనివ్వబోమన్నారు. సభకు సిపిఐ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షత వహించారు. సిపిఎం, సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, జల్లి విల్సన్, జిల్లా కార్యదర్శులు డి.వి.కృష్ణ, అక్కినేని వనజ తదితరులు పాల్గొన్నారు.

పోడు భూములకు పట్టాలతోనే గిరిజనాభివృద్ధి

- ప్రత్యామ్నాయ రాజకీయాలను బలపరచాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

ఆదివాసీలను మోసం చేసిన బిజెపి, టిడిపి, కాంగ్రెస్, వైసిపికి ఓట్లడిగే హక్కు లేదని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు వి.శ్రీనివాసరావు అన్నారు. ఆదివాసీలు, ప్రజల హక్కులు, ప్రయోజనాల పరిరక్షణ కోసం పనిచేస్తున్న సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీలను బలపరచాలని పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా అరకులోయలో సోమవారం సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సురేంద్ర అధ్యక్షతన జరిగిన నూతన రాజకీయ ప్రత్యామ్నాయ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. పార్టీలు, ప్రభుత్వాలు మారినా అరకు నియోజకవర్గం అభివృద్ధి కాలేదని పేర్కొన్నారు. మోడీ, చంద్రబాబు పాలనలో సహజ సంపదను కొల్లగొట్టే దోపిడీ వర్గాలు లాభపడ్డాయని, గిరిజనులు అభివృద్ధి చెందలేదని తెలిపారు. గిరిజనుల ఆదాయాలు పెంచేందుకు పోడు భూములపై పట్టాలిచ్చి, సాగునీటి వసతి, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. టూరిజం అభివృద్ధి వల్ల గిరిజనులకు ఆదాయాలు పెరగలేదన్నారు. బాక్సైట్ తవ్వకాల జిఓ 97ను రద్దు చేయకుండా గిరిజనుల మనోభావాలను చంద్రబాబు దెబ్బతీస్తున్నారని దుయ్యబట్టారు. అధికారంలోకి వస్తే నల్లధనం వెలికితీసి దేశంలోని ప్రతి కుటుంబానికీ రూ.15 లక్షలు జమ చేస్తామని చెప్పిన మోడీ, ప్రజలపై రూ.15 లక్షల కోట్లు భారాలు వేశారని విమర్శించారు. రాష్టానికి ప్రత్యేక హోదా ఇస్తామని మోసగించారన్నారు. ఎస్టీ, ఎస్సీల రిజర్వేషన్లు ఎత్తేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయకుండా ఆదివాసీలకు అన్యాయం చేశారన్నారు. ప్రజలకు ఇచ్చిన మాట తప్పిన మోడీ, చంద్రబాబును గద్దెదించాలని పిలుపునిచ్చారు.

ప్రతిపక్ష బాధ్యత నిర్వహించలేని వైసిపికి అధికారమిస్తే ఏమి చేయగలుగుతుందని ప్రశ్నించారు. కేరళలో వామపక్ష ప్రభుత్వం రుణ విముక్తి చట్టం తీసుకొచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. పేదలు, ఆదివాసీలు, దళితులు, కష్టజీవుల ప్రయోజనాలు, అభివృద్ధి కోసం పనిచేసే వామపక్ష, నూతన రాజకీయ శక్తులను బలపర్చాలని విజ్ఞప్తి చేశారు. సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సిపిఐ జిల్లా నాయకులు కె.భూషణరావు, జనసేనా నాయకులు ఎస్.ఆనంద్, సిపిఎం డివిజన్ నాయకులు వి.విజయ తదితరులు ప్రసంగించారు. సభకు ముందు స్థానిక ఎన్‌టిఆర్ మైదానం నుంచి మూడురోడ్లు జంక్షన్ వరకు వేలాది మందితో భారీ ప్రదర్శన నిర్వహించారు. డప్పుల వాయిద్యాలు, థింసా నృత్యాల మధ్య ఈ ప్రదర్శన సాగింది.

నేడు, రేపు సార్వత్రిక సమ్మె

సత్తా చాటనున్న కార్మికలోకం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వ కార్మిక వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, జాతి వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు మంగళ, బుధవారాల్లో దేశవ్యాపిత సమ్మెకు కార్మికవర్గం సిద్ధమైంది. సెప్టెంబరు28న న్యూఢిల్లీలో జరిగిన జాతీయ సదస్సులో కేంద్ర కార్మిక సంఘాలు ఈ రెండు రోజుల సమ్మెకు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఈ చారిత్రాత్మక సార్వత్రిక సమ్మె ద్వారా యావత్ కార్మికలోకం తన సత్తా ఏమిటో మోడీ ప్రభుత్వానికి చూపిస్తాయని సిఐటియు ప్రధాన కార్యదర్శి తపన్ కుమార్ సేన్ చెప్పారు. అధికారంలోకి వచ్చిన తొలిరోజు నుంచి కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపే రోజులు దగ్గర పడ్డాయన్నారు. సోమవారం నాడిక్కడి ఎఐటియుసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పది కార్మిక సంఘాల నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా తపన్ సేన్ మాట్లాడుతూ, మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా కార్మికవర్గం నిరంతరం పోరాడుతోందన్నారు. 2015 సెప్టెంబరు2న ఒకసారి, 2016 సెప్టెంబరు2న మరోసారి రెండు సార్లు సార్వత్రిక సమ్మెలు నిర్వహించామన్నారు. 2017 నవంబరు9,10,11 తేదీల్లో పార్లమెంటు ఎదుట మహాపడావ్‌లో పెద్దయెత్తున కార్మికులు పాల్గొన్నారు. ఆ తరువాత 2018 జనవరి 17న తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని కోరుతూ 80 లక్షల మంది అంగన్‌వాడీ, ఆశా, మిడ్డే మీల్ కార్మికులు, ఇతర స్కీమ్ వర్కర్స్ సమ్మె చేశారు. 2018లోదేశవ్యాపితంగా కార్మిక సంఘాలు జాతీయ స్థాయిలోను, రాష్ట్రాల స్థాయిలోను, జిల్లా కేంద్రాల్లోను రంగాలవారీ ఆందోళనలు సాగిస్తున్నాయి. అయినా కేంద్ర ప్రభుత్వం వీటిపై స్పందించలేదు. కార్మిక సంఘాలతో త్రైపాక్షిక చర్చలకు ఎలాంటి చొరవ చూపలేదు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్‌ను మూడున్నరేళ్ళ అయినా జరపడం లేదు. పైగా కార్మిక హక్కులపై దుర్మార్గంగా నిరంకుశంగా దాడులకు దిగుతున్నది. కార్మికుల జీవన ప్రమాణాలను దెబ్బతీస్తున్నది. యజమానులకు అనుకూలంగా లేబర్ చట్టాలను మార్చేస్తున్నది. క్రోడీకరణ పేరుతో 44 కేంద్ర చట్టాలను నాలుగు చట్టాలకు కుదించేసింది. కార్మిక సంఘాల అభిప్రాయాలను పెడచెవిన పెట్టిందని ఆయన విమర్శించారు. ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి అమర్ జీత్ కౌర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తున్న మోడీ సర్కార్‌పై సమరభేరి మోగిస్తామన్నారు. జాతీయ సమ్మెకు ఇప్పటికే అన్ని కార్మిక సంఘాలు మద్దతు తెలిపినట్లు వివరించారు. బ్యాంకింగ్ రంగం, కోల్, పెట్రోలియం, పోస్టల్, టెలికమ్, ఇంజనీరింగ్, స్టీల్, డిఫెన్స్, హెల్త్, ఎడ్యుకేషన్ తదితర రంగాలకు చెందిన కార్మిక సంఘాలు జాతీయ సమ్మెలో పాల్గొంటున్నట్లు చెప్పారు. ముఖ్యంగా వ్యవసాయ కార్మిక సంఘం తరపున రైతులు, రైతు కూలీలు గ్రామాల్లో హర్తాళ్ నిర్వహించేందుకు సన్నద్ధమైనట్లు తెలిపారు. ఐఎన్‌టియుసి జాతీయ అధ్యక్షుడు అశోక్ సింగ్ మాట్లాడుతూ తాము కార్మికుల హక్కుల కోసం పోరాడుతుంటే, మోడీ సర్కార్ కార్మికులపై దాడిని మరింత పెంచిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటువంటి తరుణంలో కార్మికులంతా ఏకమై, మోడీ సర్కార్ మెడలు వంచాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎఐయుటియుసి నేత ఆర్‌కె శర్మ, సిఐటియు నేత ఎఆర్ సింధూ, హెచ్‌ఎంఎస్, టియుసిసి, ఎస్ఈడబ్ల్యూఎ, ఎఐసిసిటియు, ఎల్‌పిఎఫ్, యుటియుసి తదితర సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ ఎస్మా జారీ
సిఐటియు ఖండన

జాతీయ సమ్మెలో పాల్గొనే విద్యుత్ ఉద్యోగులు, ఇంజనీర్లపై ఎస్మా ప్రయోగిస్తామని ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నోటిఫికేషన్ విడుదల చేయడాన్ని సిఐటియు ఖండించింది. ఈ మేరకు సిఐటియు ప్రధాన కార్యదర్శి సోమవారం ప్రకటన విడుదల చేశారు. పశ్చిమ బెంగాల్, తమిళనాడు సహా వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్యోగం నుంచి తొలగించడం, ఎనిమిది రోజుల వేతనంపై కోత విధించడం వంటి వివిధ బెదిరింపు చర్యలను కూడా సిఐటియు ఖండించింది. ఈ బెదిరింపులు కార్మికుల, ఉద్యోగులు రాజ్యాంగ, చట్టబద్ధ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని పేర్కొంది.. ఈ సమ్మెలో సంఘాలకు అతీతంగా ఉద్యోగులు, కార్మికులు పాల్గొని ఇలాంటి బెదిరింపులకు చారిత్రాత్మక సమాధానం ఇవ్వాలని సిఐటియు పిలుపు నిచ్చింది.

డిమాండ్స్

- ధరల నియంత్రణకు తక్షణమే చర్యలు తీసుకోవాలి. ప్రజా పంపిణీ వ్యవస్థను సార్వత్రికం చేరాలి. వస్తు మార్కెట్‌లో ఫ్యూచర్ ట్రేడింగ్‌ను నిషేధించాలి.
- ఉద్యోగ కల్పనకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలి. నిరుద్యోగాన్ని నియంత్రించాలి.
- ఏవిధమైన మినహాయింపు లేకుండా కార్మిక చట్టాలు అమలుకు చర్యలు తీసుకోవాలి. కార్మిక చట్టాలను ఉల్లంఘించే వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలి.
- కార్మికులందరికీ అన్ని విధాల సామాజిక భద్రత కల్పించాలి.
- నెలకు రూ.18 వేలకు తగ్గకుండా కనీస వేతనం ఇవ్వాలి.
- నెలకు రూ.ఆరువేలు తగ్గకుండా పెన్షన్ ఇవ్వాలి.
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణ, వ్యూహాత్మక అమ్మకాలు ఆపివేయాలి.
- శాశ్వత ఉద్యోగాల్లో కాంట్రాక్టీకరణను ఆపాలి. కాంట్రాక్టు ఉద్యోగులకు, ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చే వేతనం, ప్రయోజనాలు కల్పించాలి.
- చెల్లింపులు, బోనస్ అర్హత, పిఎఫ్‌లపై ఉన్న ఆంక్షలు తొలగించాలి. గ్రాట్యుటీ పెంచాలి.
- దరఖాస్తు చేసుకున్న 45 రోజుల వ్యవధిలో తప్పనిసరిగా కార్మిక సంఘాలను రిజిస్ట్రేషన్ చేయాలి. ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్(ఐఎల్ఒ) సి 87, సి 98 కన్వెన్షన్లను వెంటనే ఆమోదించాలి.
- కార్మిక చట్టాల సవరణను వ్యతిరేకించాలి.
- రైల్వే, ఇన్సురెన్సు, రక్షణ రంగాల్లో ఎఫ్‌డిఐలను వ్యతిరేకించాలి.

బిజెపితో ఎజిపి పొత్తు కటీఫ్

సిటిజన్‌షిప్ బిల్లుపై వివాదమే కారణం

న్యూఢిల్లీ : మిత్రపక్షాలు బిజెపికి టాటా చెప్పడం కొనసాగుతున్నది. సిటిజన్‌షిప్ బిల్లు విషయంలో కాషాయ పార్టీతో సంబంధాలు తెగతెంపులు చేసుకోవాలని నిర్ణయించినట్లు అసోం గణ పరిషత్ (ఎజిపి) సోమవారం తెలిపింది. వివాదాస్పదమైన ఈ అంశంపై ప్రభుత్వం నుండి బయటకు వస్తున్నట్లు అసోం మాజీ ముఖ్యమంత్రి ప్రపుల్ల కుమార్ మహంతా తెలిపారు. గతంలో కూడా ఎజిపి ఈ బిల్లుపై అభ్యంతరాలు వ్యక్తం చేసింది. ఈ బిల్లు వల్ల అసోం ఒప్పందం అర్థరహితంగా మారుతుందని పేర్కొంది. అసోం ఒప్పందం, ఇతర అంశాలపై బిజెపితో వచ్చిన అవగాహన మేరకే ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాలని ఆనాడు నిర్ణయించామని తెలిపింది. కానీ భారత ప్రభుత్వం సిటిజన్‌షిప్ (సవరణ) బిల్లు 2016ని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టడం ద్వారా ఆ అవగాహనను ఉల్లంఘించిందని ఎజిపి ఒక లేఖలో పేర్కొంది. ఈ బిల్లుపై తమ పార్టీకి గల అభ్యంతరాలను వెలిబుచ్చుతూ ఎజిపి అధ్యక్షుడు అతుల్ బొరా, బిజెపి చీఫ్ అమిత్ షాకు ఒక లేఖ రాశారు. అసోం ప్రస్తుత ముఖ్యమంత్రి శర్వానంద సోనోవాల్ మాదిరిగానే ఎజిపి కూడా అక్రమ బంగ్లాదేశ్ శరణార్థులు చొరబడడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. 126 మంది సభ్యులు గల అసోం శాసనసభలో బిజెపి నేతృత్వంలో అసోం గణ పరిషత్, బోడోలాండ్ పీపుల్స్ ఫ్రంట్ కూటమికి 86 సీట్లు వున్నాయి. వాటిలో బిజెపికి 60 వుండగా, ఎజిపికి 14, బిపిఎఫ్‌కి 12సీట్లు వున్నాయి. అందువల్ల ఎజిపి బయటకు వచ్చినా ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం వుండబోదు.

రాఫెల్‌పై ప్రధాని చర్చకు రావాలి

- రాహుల్ గాంధీ డిమాండ్
- హెచ్‌ఎఎల్‌ను ఆర్థిక సంక్షోభంలోకి నెడుతున్నారని ఆవేదన
- తప్పు దారి పట్టిస్తోన్న కాంగ్రెస్ : రక్షణ మంత్రి



న్యూఢిల్లీ : రాఫెల్ ఒప్పందంపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధం కావాలని ప్రధాని నరేంద్ర మోడీకి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ సవాల్ విసిరారు. సోమవారం పార్లమెంట్ వెలుపల విలేకర్లతో మాట్లాడుతూ ఆయన, ప్రధానితో మాట్లాడేందుకు ఒక్క 15నిముషాలు సమయం ఇస్తే చాలు, అన్ని విషయాలు రుజువు చేస్తానని, ఈ దేశం వాస్తవాలను తెలుసుకుంటుందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థ అయిన హిందూస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఎఎల్)ను ప్రభుత్వం బలహీన పరచడానికి ప్రయత్నిస్తోందని విమర్శించారు. ఆ సంస్థను దెబ్బ తీస్తూ ఆర్థిక సంక్షోభంలోకి నెడుతోందని అన్నారు. హెచ్‌ఎఎల్‌ను బలహీనపరచాలన్నది ప్రభుత్వ వ్యూహంగా వుందన్నారు. ఆ సంస్థకు నిధులివ్వకుండా, దేశ వ్యూహాత్మక సామర్థ్యాన్ని నాశనం చేస్తోందని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానితో ముఖాముఖి చర్చ జరపాలన్న తన డిమాండ్‌ను పునరుద్ఘాటిస్తూ, 'ప్రధాని మోడీ లోక్‌సభ అంటే భయపడుతున్నారు. ప్రశ్నిస్తారేమోనని ఆందోళన చెందుతున్నారు. అందుకే సభకు రావడం లేదు.' అని వ్యాఖ్యానించారు. హెచ్‌ఎఎల్‌కు లక్ష కోట్ల విలువ చేసే కాంట్రాక్టులు ఇచ్చామంటూ రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో అబద్ధాలు చెబుతున్నారని రాహుల్ విమర్శించారు. సభలో చాలా విషయాలు మాట్లాడారు కానీ తాను అడిగిన వాటికి సమాధానాలు చెప్పలేదన్నారు. రాఫెల్ ఒప్పందంలో ప్రధాని జోక్యం చేసుకున్నారా లేదా అన్న తన ప్రశ్నకు నేరుగా సమాధానం చెప్పలేదన్నారు. కాగా, హెచ్‌ఎఎల్ కాంట్రాక్టులకు సంబంధించి తాను చేసిన ప్రకటనపై కాంగ్రెస్ సందేహాలు వ్యక్తం చేయడాన్ని రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ తప్పు పట్టారు. కాంగ్రెస్ తప్పుదారి పట్టిస్తోందని విమర్శించారు. రు.26వేల కోట్ల విలువ చేసే కాంట్రాక్టులు హెచ్‌ఎఎల్‌కు ఇచ్చామని, మరో రు.73వేల కోట్ల విలువైన కాంట్రాక్టులు ఇవ్వనున్నామని తెలిపారు.

అంతకుముందు రాహుల్ ట్వీట్టర్‌లో స్పందిస్తూ, "ఉద్యోగస్తులకు వేతనాలు చెల్లించడానికి హెచ్‌ఎఎల్ వద్ద తగినన్ని నిధులు కూడా లేవు. అనీల్ అంబానీకి రాఫెల్ ఒప్పందం వచ్చింది. ఇప్పుడు ఆయనకు హెచ్‌ఎఎల్‌లోని అత్యంత ఉత్తమమైన ఇంజనీర్లు కావాలి, వేతనాలు లేకపోతే హెచ్‌ఎఎల్‌లోని ప్రతిభావంతులైన వారందరూ అంబానీ గ్రూపునకు వెళ్ళిపోతారు." ఇదీ ప్రభుత్వ వ్యూహమని ట్వీట్ చేశారు. కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్ కూడా ఈ విషయమై ప్రభుత్వంపై విమర్శలు చేశారు. ఇప్పటికే పూర్తి చేసిన ప్రాజెక్టులకు కూడా హెచ్‌ఎఎల్‌కు చెల్లించాల్సిన మొత్తాలు చెల్లించ కుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, దాంతో కంపెనీ ఆర్థిక సంక్షోభంలో పడుతోందని రాహుల్ విమర్శించారు. ఇదేనా మేక్ ఇన్ ఇండియా అంటే అని ఆయన ప్రశ్నించారు. ఒక్క విమానాన్ని కూడా అందచేయని దసాల్ట్ కంపెనీకి ఇప్పటికే రు.20 వేల కోట్లు చెల్లించారని హెచ్‌ఎఎల్‌కి మాత్రం రు.15,700 కోట్లు బకాయి పడ్డారని రాహుల్ పేర్కొన్నారు.

బీహార్‌లో బాలికలపై బ్రిజేష్ అకృత్యాలు వెల్లడించిన సిబిఐ

పాట్నా : బీహార్‌లోని ముజఫర్‌పూర్ వసతిగృహం కేసులో ప్రధాన నిందితుడు బ్రిజేష్‌ఠాకూర్‌పై 73 పేజీల చార్జిషీట్‌ను సిబిఐ నమోదు చేసింది. ఈ చార్జిషీట్‌లో పలు విస్మయ పరిచే అంశాలను వెల్లడించింది. అసభ్యకరమైన పాటలకు బాలికలతో డాన్సులు చేయించడం, వారికి మత్తు మందు ఇచ్చి అత్యాచారం చేయడం వంటి అఘాయిత్యాలకు పాల్పడినట్లు చార్జిషీటులో తెలిపింది. బ్రిజేష్‌కు చెందిన పలువురు 'అతిధులు' వారిపై అత్యాచారాలకు పాల్పడినట్లు సిబిఐ పేర్కొంది. ఈ అఘాయిత్యాలను నిరాకరించిన బాలికలను కొట్టడం, హింసిచడం వంటివి చేసినట్లు తెలిపింది. ఈ కేసులో బ్రిజేష్‌తో పాటు మరో 20మందిపై పోక్సో చట్టం కింద సిబిఐ కేసులు నమోదు చేసింది. కాగా, బ్రిజేష్‌కు అధికారిక జనతాదళ్ (యునైటెడ్)కు సన్నిహితుడు కావడంతో విచారణకు అవరోధం కలిగించవచ్చుని, దీంతో అతనిని రాష్ట్రానికి వెలుపల ప్రత్యేక జైలుకు తరలించాలని సుప్రీంకోర్టు సూచించింది. బ్రిజేష్‌కు నితీష్‌కుమార్ ప్రభుత్వం మద్దతుగా ఉందని ఆర్‌జెడి వ్యాఖ్యానించింది. సామాజిక సంక్షేమ శాఖ మంత్రి మంజువర్మ భర్త చంద్రశేఖర వర్మను కూడా ఈ ఘటనలో నిందితుడిగా పేర్కొనడం గమనార్హం. ఇటీవల టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్‌సైన్సెస్ (టిస్) సంస్థ ప్రభుత్వం నిర్వహిస్తున్న వసతి గృహాలపై చేపట్టిన దర్యాప్తులో బాలికలపై జరుగుతున్న ఈ అఘాయిత్యాలు వెలుగులోకివచ్చిన సంగతి తెలిసిందే. అనంతరం వసతిగృహంలోని 42మంది బాలికలలో 34మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

మేఘాలయలో మరో గని ప్రమాదం

బండరాళ్లు దొర్లిపడటంతో ఇద్దరు మృతి

గుహవతి : మేఘాలయలో మరో గనిలో ప్రమాదం చోటుచేటుసుకుంది. జయంతియా జిల్లాలోని ముకనార్ గ్రామంలోని అక్రమంగా నిర్వహిస్తున్న మరో గనిలో బండ రాళ్లు దొర్లిపడటంతో ఇద్దరు మైనర్‌లు మృతి చెందినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్రంలో అక్రమంగా నిర్వహిస్తున్న మైనింగ్‌లపై చర్యలు తీసుకోవాలన్న ఎన్‌జిటి ఆదేశాల మేరకు పలు గనులను పరిశీలిస్తుండగా గత వారం జరిగిన ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. గని యజమాని కోసం గాలింపులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇదేవిధంగా రాష్ట్రంలో పలు అక్రమగనులను గుర్తించామని, వాటి యజమానులపై కేసులు నమోదు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. గత నెలలో జయంతియా హిల్స్‌లోని బొగ్గు గనిలో 15మంది మైనర్‌లు చిక్కుకుపోయిన సంగతి తెలిసిందే.

30వేల మంది 'బెస్ట్' వర్కర్ల నిరవధిక సమ్మె

ముంబయిలో అర్ధరాత్రి నుంచి మొదలైన నిరసన

ముంబయి: బృహన్‌ముంబయి ఎలక్ట్రిసిటీ సప్లై అండ్ ట్రాన్స్‌పోర్టు(బీఈఎస్‌టీ-బెస్ట్) కార్మికులు సోమవారం అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగారు. తమ డిమాండ్లను నెరవేర్చడంలో అడ్మినిస్ట్రేషన్ అలసత్వం వహిస్తోందని దాదాపు 30 వేల మంది బెస్ట్ వర్కర్లు.. బస్సు డ్రైవర్లు, కండక్టర్లు సహా నిరసనకు దిగారు. 2007 తర్వాత నియామకమైన కార్మికులకు మాస్టర్ గ్రేడ్‌కింద వేతనాలు, బెస్ట్ బడ్జెట్‌ను బృమన్ మున్సిపల్ కార్పొరేషన్(బీఎంసీ)కి చెందిన ఎ విభాగపు బడ్జెట్‌లో విలీనం, 2016 మేలో అందజేసిన డిమాండ్లపై చర్చించాలని బెస్ట్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు శశాంక్ రావు డిమాండ్ చేశారు. హామీలనివ్వడం కాదు, తమ డిమాండ్లను నెరవేర్చాలని ఆయన అన్నారు. కాగా, బెస్ట్ హెడ్‌క్వార్టర్‌లో సోమవారం జరిగిన ఓ సమావేశం తర్వాత బెస్ట్ సంయుక్త కామ్‌గర్ కృతి సమితి సోమవారం అర్ధరాత్రి నుంచి నిరవధిక సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ సమ్మె కారణంగా 3,300 బస్సులు డిపోలోనే నిలిచిపోనుండటంతో ముంబయి ప్రయాణికులు తీవ్ర అంతరాయాన్ని ఎదుర్కోనున్నారు. రోజుకు సుమారు మూడు కోట్ల రూపాయల నష్టం చేకూరనున్నట్లు అంచనా వేస్తున్నారు.

7.38 శాతానికి పెరిగిన నిరుద్యోగం : సిఎంఐఇ

న్యూఢిల్లీ : దేశంలో నిరుద్యోగం 27 నెలల గరిష్టానికి చేరుకోగా, కార్మికుల భాగస్వామ్యం కూడా అంతే స్థాయిలో పడిపోయిందని సిఎంఐఇ నివేదిక వెల్లడించింది. డిసెంబర్ 2018 నాటికి నిరుద్యోగ రేటు 27 నెలల గరిష్టానికి పెరిగిందని అంటే 7.38 శాతానికి చేరుకుందని కేంద్ర ఆర్థిక వ్యవస్థ పర్యవేక్షణ సంస్థ (సిఎంఐఇ) వెల్లడించింది. నిరుద్యోగ రేటు కంటే పనిలో బాగస్వాములయ్యేవారి సంఖ్య (ఎల్‌పిఆర్) చాలా ముఖ్యమని దాని ద్వారా ఎంతమంది ప్రజలు పనిచేయడానికి ఇష్టపడుతున్నారేది స్పష్టమౌతుందని 2018 అక్టోబర్‌లో రాసిన వ్యాసంలో సిఎంఐఇ ఎండి, సిఇఒ మహేష్ వ్యాస్ పేర్కొన్నారు. ఉద్యోగుల శాతం గడిచిన 12 నెలల్లో 1.09 కోట్లకు పడిపోయిందని, 2017 డిసెంబర్‌లో 40.78 ఉన్న ఉద్యోగుల సంఖ్య 2018 డిసెంబర్ నాటికి 39.69 కోట్లకు తగ్గిందని నివేదికలో పేర్కొంది. 1.58 లక్షల నివాసాలను పరిగణలోకి తీసుకుని 'భారత్‌లో నిరుద్యోగ రేటు'ను అంచనా వేసి ఈ నివేదికను రూపొందించినట్లు వెల్లడించింది. నిరుద్యోగం పెరగడంతో, కార్మిక భాగస్వామ్య రేటు కూడా పడిపోయిందని పేర్కొంది. సెప్టెంబర్ 2016 నాటి నుండి నిరుద్యోగిత రేటు 8.46 శాతం అధిక స్థాయిలో నమోదైందని తెలిపింది. డిసెంబర్ 2017లో గ్రామీణ ప్రాంతాల్లో కూడా ఉద్యోగుల సంఖ్య 26.94కు తగ్గిందని, డిసెంబర్ 2018 నాటికి ఇంకా తక్కువగా 26.03 కోట్లకు చేరుకుందని పేర్కొంది. పట్టణ ప్రాంతాల్లో 17.9 లక్షలమంది ఉద్యోగాలు కోల్పోయారు. అంటే మొత్తం 13.84 కోట్ల నుండి 13.66 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది.

ప్రభుత్వ బాకాగా ఆల్‌ఇండియా రేడియో

ప్రతిపక్షాల వాణికి తావులేదు ● ఎఫ్‌ఎం రేడియోల్లోనూ వార్తలు




న్యూఢిల్లీ : ఆల్ ఇండియా రేడియో (ఎఐఆర్)ను ప్రభుత్వం తమ ప్రచారానికే ఉపయోగించుకోనుంది. ఇందుకు ఉదాహరణగా ఒక సంఘటన వెల్లడయింది. ఇటీవల పార్లమెంట్‌లో రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్‌కు-కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీకి మధ్య జరిగిన సంభాషణల్లో కేవలం మంత్రి వ్యాఖ్యలను మాత్రమే అనువాదం చేయాలని, మంత్రి వ్యాఖ్యలనే ప్రసారం చేయాలని ఎఐఆర్ కేంద్రాలకు ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చిన సంఘటన బయటకు వచ్చింది. గౌహతి, హైదరాబాద్, కొచ్చి, కోల్‌కతా, చండీఘర్, శ్రీనగర్, చెన్నై, బెంగళూరు, తిరువనంతపురంలోని ఎఐఆర్ అధికారులకు ఈ ఆదేశాలు వచ్చాయి. కాగా, ఇక నుంచి ప్రభుత్వం తమ ప్రచారానికి, తమ పథకాల ప్రచారానికి ప్రైవేట్ ఎఫ్‌ఎం రేడియోలను కూడా ఉపయోగించుకోనుంది. ఎఐఆర్ వార్తలు మంగళవారం నుంచి ప్రైవేట్ ఎంఎఫ్ రేడియోల్లోనూ ప్రసారం కానున్నాయి. మరింత ఎక్కువ మందికి చేరువకావడానికి, దేశవ్యాప్తంగా ప్రసారం కావడానికి ప్రైవేట్ ఎఫ్‌ఎంల్లోనూ . ఎఐఆర్ వార్తలు ప్రసారం చేయడానికి నిర్ణయం తీసుకున్నామని ప్రసార భారతి పైకి చెబుతున్నా.. ప్రభుత్వ ప్రచారం కోసమే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ వార్త బులెటెన్లు కోసం ఎఐఆర్ ప్రత్యేకంగా అనువాద బృందాన్ని కూడా ఏర్పాటు చేసుకుంది. కాగా, ప్రసారభారతి తాజా నిర్ణయం ప్రకారం ఎఐఆర్ వార్తలను ఉచితంగానూ, షరతులకు లోబడి, ప్రయోగాత్మకంగానూ ఎఫ్‌ఎం ఛానెళ్లు ప్రసారం చేసుకోవచ్చు. ఏడాది మే 31 వరకూ ఎఐఆర్ వార్తలను ప్రసారం చేసుకునే అవకాశాన్ని ప్రసార భారతి కల్పించింది. అయితే ఎఐఆర్ వార్తలను అదే సమయంలో గానీ, 30 నిమిషాల వ్యవధి దాటకుండా గానీ ప్రసారం చేసుకోవాలి. అలాగే ఎఐఆర్ వార్తల సారాంశాన్ని మార్చడం గానీ, వార్తల మధ్యలో ప్రకటనలు వేయడాన్ని కానీ ఎఫ్‌ఎం సంస్థలు చేయకూడదు. ఈ వార్తలు ఇంగ్లీష్‌లో గానీ, హిందీలో కానీ ఉంటాయి.

ఉత్తరాదిన చలి 'పంజా'

న్యూఢిల్లీ : గత కొన్ని రోజులుగా ఉత్తరాది రాష్ట్రాలను మంచు దుప్పటి కప్పేస్తోంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, జమ్ముకాశ్మీర్‌లో ఎముకలు కొరికే చలి ఉండగా...హిమాచల్‌ప్రదేశ్‌ను మూడు రోజుల శీతల వాతావరణం అనంతరం సూర్యుడు దర్శనమిచ్చాడు. ఢిల్లీలో ఆదివారం స్వల్పంగా వర్షం కురియడంతో కొంత మేర వాయు కాలుష్యం తగ్గుముఖం పట్టింది. కానీ హిమపాతం అదే స్థాయిలో సంభవించింది. రాజధానిలో కనిష్ట ఉష్ణోగ్రత 7.1 డిగ్రీలు ఉండగా, గరిష్ట ఉష్ణోగ్రత 19 డిగ్రీల వద్ద నమోదయ్యాయి. పొగ మంచు వల్ల పలు విమానాలు, రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం వాటిల్లింది. ఉత్తరప్రదేశ్‌ను చలి వణికిస్తోంది. భారీగా కురుస్తున్న హిమపాతానికి మరోసారి లక్నో, తదితర ప్రాంతాల్లో పాఠశాలలను మూసివేయాల్సి వచ్చింది. అక్కడ కూడా తేలికపాటి వర్షాలు కురిసాయి. నాలుగు రోజుల పాటు ఇంకా చలి వాతావరణం కొనసాగనుందని వాతావరణ విభాగం(మెట్) అధికారులు వెల్లడించారు. జమ్ము కాశ్మీర్ ఏకంగా మంచుతో గడ్డుకట్టుకుపోయింది. అక్కడ ఉష్ణోగ్రతలు మైనస్ డిగ్రీలకు పడిపోయాయి. జమ్ములోని ద్రాస్ పట్టణంలో మైనస్ 24.8 డిగ్రీలు నమోదు కావటంతో జలశయాలన్నీ గట్టకట్టుకుపోయాయి.

మిమ్మల్ని జైలుకు పంపిస్తాం

ఐటి చట్ట దుర్వినియోగంపై అధికారులకు 'సుప్రీం' హెచ్చరిక



న్యూఢిల్లీ : సమాచార సాంకేతిక చట్టం(ఐటి)లో తొలగించిన సెక్షన్ కింద అరెస్టులు చేయడాన్ని నిరోధించడంలో విఫలం కావడంతో ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు సోమవారం తప్పుపట్టింది. సైబర్, ఈ కామర్స్ నేరాలపై చర్యలకు అనుమతి కల్పించే ఐటిచట్టంలోని 66(ఎ) సెక్షన్‌ను అస్పష్టమైన, రాజ్యాంగ విరుద్ధమైనదిగా పేర్కొంటూ 2015లో సుప్రీం తీర్పునిచ్చింది. అయినప్పటికీ ఈ సెక్షన్ కింద 22 మందిపై విచారణ జరిగిందని పీపుల్స్ యూనియన్ ఫర్ సివిల్ లిబర్టీస్(పియుసిఎల్) అనే ఎన్‌జివో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను విచారించిన సుప్రీం కోర్టు... ఈ సెక్షన్ కింద అరెస్టు చేసిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని జస్టిస్ రోహింగ్టన్ నారిమన్, వినీత్ శరణ్‌లతో కూడిన ధర్మాసనం హెచ్చరించింది. మీడియా కథనాలు, జాతీయ క్రైమ్ రికార్డు బ్యూరో నుండి సేకరించిన సమాచారం, ఆన్‌లైన్‌లోని డేటాబేస్ కేసుల ఆధారంగా పరిశోధించి పిటిషన్ దాఖలు చేసినట్లు పియుసిఎల్ వెల్లడించింది. ఈ డేటా సంబంధిత అంశాలపై సమగ్ర సమాచారం అందించలేదని, శ్రేయా సింఘాల్ కేసులో ఈ సెక్షన్ చెల్లదని తీర్పు వెలువడినా.. ఇంకా ఈ సెక్షన్ కొనసాగుతుందని పిటిషన్‌లో పేర్కొంది. ఈ సెక్షన్ రద్దుకు ముందు ..ఇంటర్నెట్‌లో అభిప్రాయాలను వెల్లడిస్తున్న వారిని అరెస్టులు చేశారు. భావ ప్రకటనా స్వేచ్ఛను హరించే సెక్షన్ 66(ఎ)ను తొలగించాలని సామాజిక కార్యకర్తలు పిటిషన్‌లు దాఖలు చేయడంతో 2015లో ఈ సెక్షన్ చట్టవిరుద్ధమని కోర్టు తీర్పునిచ్చింది.

ఆకలిని తట్టుకోలేక గిరిజన చిన్నారి ఆత్మహత్యాయత్నం

న్యూఢిల్లీ : ఆకలిని తట్టుకోలేక గిరిజన చిన్నారి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఘటన మధ్యప్రదేశ్‌లోని రత్నాం జిల్లాలో చోటుచేసుకుంది. గత నెల 31న జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. రేషన్ షాపులో గోధుమలు ఇవ్వాలని పలుమార్లు చిన్నారి అభ్యర్థించినా..వాటిని ఇవ్వకపోవడంతో ఆకలిని భరించలేక ఈ దురాగతానికి పాల్పడిందని అధికారులు తెలిపారు. ప్రసుత్తం ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనపై బాలల హక్కుల పరిరక్షణ జాతీయ కమిషన్(ఎన్‌సిపిఆర్‌సి) విచారణ ప్రారంభించింది. ఈ సంఘటనపై దర్యాప్తు చేయడానికి ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎన్‌సిపిఆర్‌సి అధికారులు తెలిపారు. అయితే చిన్నారి వయస్సును మాత్రం అధికారులు బహిర్గతం చేయలేదు.

హెచ్‌సియు విద్యార్థుల నిరసనలు

హైదరాబాద్ : హైదరాబాద్ యూనివర్శిటీలో మరోసారి నిరసనలు మిన్నంటాయి. విశ్వవిద్యాలయ ప్రాంగణంలో తాత్కాలికంగా నిర్మించిన 'వెలివాడ'ను యూనివర్శిటీ పరిపాలన యంత్రాంగం ఆదివారం తొలగించడంతో ఆందోళనలు మొదలయ్యాయి. ఈ తాత్కాలిక నిర్మాణంలో కుల వివక్షతపై పోరాడిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, పెరియార్, అయ్యంకళి, సావిత్రిబాయి, జ్యోతిరావు పూలే తదితరుల చిత్రాలను పొందుపరిచారు. ఈ వెలివాడను ధ్వంసం చేయడంతో 200 విద్యార్థులు తమ మనోభావాలను దెబ్బతీశారంటూ పరిపాలన యంత్రాంగానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనివర్శిటీ విద్యార్థులైన రోహిత్ వేములతో పాటు మరో నలుగురు హాస్టల్ నుండి సస్పెండ్ చేయడంతో ఈ తాత్కాలిక నిర్మాణం చేపట్టి అక్కడి నుండి నిరసనలు తెలిపిన సంగతి తెలిసిందే.

ప్రత్యేకం

"గోరక్షకుల" ప్రేమ ఎవరి మీద?

ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

యోగి ఆదిత్య నాథ్ జంతు ప్రేమికుడు. అందుకే గోవధ నిషేధాన్ని ప్రకటించాడు. గోవుల రక్షణ కోసం ప్రత్యేకంగా కొంత పన్ను విధించాడు. ఇదంతాచూసి యోగి, ఆయన పార్టీ నిజంగా గోరక్షణ కోసమే పాటుపడుతున్నారని కొందరు అమాయక గోవులనుకుంటున్నారు. బిజెపికి పశువులపై నిజంగా ప్రేమ ఉందా? ఉంటే ముందు పశువులు మేతమేయడానికి అన్ని గ్రామాల్లోనూ కొంత స్థలాన్ని కేటాయించాలి. కాని బిజెపి ప్రభుత్వం, చాలా రాష్ట్ర ప్రభుత్వాలు అలా పశువులు మేసుకునే భూములను కార్పొరేట్ కంపెనీలకు కేటాయించారు. లేదా పాలక పార్టీల నేతలు ఆ భూమలన్ని కబ్జా చేసేశారు. సమీపంలోని అడవులలో మేతకు తోలుకెళ్తే ఫారెస్టు అధికారులు పశువుల్ని లాక్కుపోతున్నారు. ప్రభుత్వం విధించిన నిషేధం వలన మార్కెట్లో పశువులు ధరలు దారుణంగా పడిపోయాయి. ముఖ్యంగా కోడె దూడలను ఎవరూ కొనడంలేదు.

ఈ మొత్తం ఆంక్షల ప్రభావాన్ని పరిశీలిస్తే ఇదేమీ గోవులపై ప్రేమ వలన వచ్చినది కాదని అర్థం అవుతుంది. రైతులు, పశువుల కాపరులు ప్రస్తుతం పశువుల మార్కెట్‌లో పాత్రధారులుగా ఉన్నారు. వీరందరినీ పక్కకునెట్టి కార్పొరేట్ వ్యాపారులు ఈరంగాన్ని తమ చేతుల్లోకి తీసుకోవాలని చూస్తున్నారు. అలా జరగాలంటే రైతులు, పశువుల కాపర్లు తమంతట తామే తప్పుకోవాలి. అలా వత్తిడి పెంచడానికే ఈ ఆంక్షలు.

పశువులపై ప్రేమ నిజమైతే పశువైద్యశాలలు తగిన సంఖ్యలో పెంచాలి. కోపరేటివ్ డైరీలను ప్రోత్సహించాలి. వట్టిపోయిన ఆవులను, ముసలి ఎద్దులను ఏంచెయ్యాలో స్పష్టం చేయాలి.

గోశాలాల పేరుతో విస్తారమైన భూములను చేజిక్కించుకోడమేగాక, ప్రభుత్వం నుండి సబ్సిడీలు, దేవాలయాలట్రస్టుల నుండి, ఇతర దాతల నుండి ఉదారంగా నిధులు విరాళాలుగా పొందుతున్న వారు పాలక పార్టీ పెద్దలే. కాని ఆగోశాలల్లో అక్కడ పశు సంరక్షణకు ఏర్పాట్లు లేకున్నా పర్యవేక్షించే నాధుడులేడు.

పశుమాంసం ఎగుమతి దారులలో 95 శాతం హిందువులే. 15.60 లక్షల టన్నుల పశుమాంసాన్ని 2017-18లో ఎగుమతి చేసింది మనదేశం. 2026 నాటికి 19.30లక్షల టన్నుల లక్ష్యాన్ని ప్రకటించింది. మెజార్టీ వ్యాపారం హిందువులే చేస్తుండగా గోరక్షకుల దాడులన్నీ ముస్లింలపైనే ఎందుకు జరుగుతున్నాయి? గోవధనిషేధం గురించి మాట్లాడుతూ ఇంకోపక్క పశుమాంసం ఎగుమతి లక్ష్యాన్ని ఎందుకు పెంచారు?

యోగి ఆధిత్యానాధ్ సిఎంగా ఉన్న రాష్ట్రంలో పెద్దపెద్ద కబేళాలు ఉన్నాయి. అల్ నూర్ ఎక్స్‌పోర్ట్స్ కంపెనీ అందులో ఒకటి. యజమాని సునీల్ సూద్. ఇతడు హిందువు. 35 విదేశీ కంపెనీలకు పశు మాంసం ఎగుమతి చేస్తాడు.

ఎ.వోబి ఎక్స్‌పోర్ట్స్: ఇది ఇంకో కంపెనీ. యజమాని ఒ.పి. అరోరా. ఇతడూ హిందువే. స్టాండర్డ్ ఫ్రోజెన్ ఎక్స్‌పోర్ట్స్. దీని యజమాని కమల్ వర్మ. వీరంతా యుపిలో పశుమాంసం ఎగుమతి వ్యాపారం చేసేవారే.

ముస్లింలపై దాడులను రెచ్చగొట్టడం, తద్వారా హిందువుల ఓట్లను కొల్లగొట్టడం అనేది రాజకీయ లక్ష్యం అయితే, గోవధ నిషేధం పేరుతో స్థానిక పశు మాంస విక్రయాలను పూర్తిగా తగ్గించేస్తే విదేశాలకు ఎగుమతి చేయాడానికి చౌకగా మాంసం దొరుకుతుందని, అప్పుడు లాభాలను ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవచ్చునన్నది అసలు లక్ష్యం

గోరక్షకులపేరుతో సంఘవ్యతిరేక శక్తులు, గుండాలు తాము చేసే అసాంఘిక చర్యలకు ఒక ముసుగు తొడుక్కుంటున్నారు. వారు అరాచకాలు చేసి శిక్షలుపడకుండా తప్పించుకుంటున్నారు. ఎక్కడైనా కేసులు పెట్టినా బెయిలుసులువుగా దొరుకుతోంది.

గోవధనిషేధం విధించినా 5స్టార్స్ హోటళ్లలో పశుమాంసం వంటకాలపై నిషేధం పెట్టలేదు. గోవా ముఖ్యమంత్రి అయితే రాష్ట్రంలో పశుమాంసం కొరత లేకుండా తగు చర్యలు తీసుకుంటానని అసెంబ్లీలో 18-7-2017న ప్రకటన చేశాడు. ఈశాన్య భారతంలో బిజెపినేతలు గోవధ గురించి కిక్కురుమనకుండా నోరు మూసుకుని ఉన్నారు. ఇది వీరి ద్వంద్వ వైఖరికి నిదర్శనం.

సంక్షిప్తం

తమిళనాడు మంత్రికి జైలు శిక్ష

చెన్నై: సుమారు రెండు దశాబ్దాల క్రితం అల్లర్ల కేసులో తమిళనాడు మంత్రి పి.బాలకృష్ణా రెడ్డికి కోర్టు మూడేళ్ల జైలు శిక్ష విధించింది. 1998లో హెూసూర్‌కు సమీపంలోని బగలూర్‌లో బస్సుపై రాళ్లదాడికి పాల్పడిన కేసులో యువజన సంక్షేమం, క్రీడాభివృద్ధి శాఖ మంత్రి బాలకృష్ణారెడ్డితో పాటు 15 మందిని దోషులు పేర్కొంటూ ప్రత్యేక న్యాయస్థానం సోమవారం తీర్పు వెలువరించింది. ఈ కేసులో 108 మంది నిందితులు ఉండగా, వారిలో 15 మందిని కోర్టు దోషులుగా తెల్చింది. ఈ తీర్పుతో బాలకృష్ణారెడ్డి ఎమ్మెల్యే, మంత్రి పదవిని కోల్పోనున్నారు. అయితే ప్రత్యేక కోర్టు తీర్పుపై బాలకృష్ణారెడ్డి మంగళవారం మద్రాసు హైకోర్టును ఆశ్రయించనున్నారు. 49 ఏళ్ల బాలకృష్ణారెడ్డి హెూసూర్ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. బిజెపి నుంచి తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు.

మిమ్మల్ని రెండేళ్ల క్రితమే విడిచిపెట్టేశాం...!

బిజెపి 'ఒంటరిపోరు'పై శివసేన విసుర్లు

ముంబయి: బిజెపి అహంకారమే ఆ పార్టీని అందరికీ దూరం చేస్తోందని శివసేన ఘాటుగా విమర్శించింది. మహారాష్ట్రలో బిజెపి ఒంటరిగానే పోటీ చేస్తుందంటూ బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా చేసిన ప్రకటనపై శివసేన తీవ్రంగా స్పందించింది. ఆ పార్టీ ప్రతినిధి సంజయ్ రౌత్ సోమవారం ఇక్కడ ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో మాట్లాడుతూ 'మిమ్మల్ని రెండేళ్ల క్రితమే విడిచిపెట్టేశాం. మీరు వద్దనుకున్నాం. ఇంకా మమ్మల్ని ఎందుకు వెంటాడుతున్నారు. ఇటీవల జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో కూడా ప్రజలు మిమ్మల్ని వద్దనుకున్న విషయాన్ని మరువ వద్దు. మేం గత 50 ఏళ్లుగా ప్రజలతో మమేకమయి వుండబట్టే ప్రస్తుత స్థితిలో కొనసాగుతున్నాం' అని వ్యాఖ్యానించారు. లాటూర్‌లో బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో అమిత్‌షా మాట్లాడుతూ 'ఏదైనా పొత్తు కుదిరితే భాగస్వామ్య పార్టీ అభ్యర్థులకు కూడా మనం సహకరిస్తాం. శివసేనతో పొత్తుపై ఆలోచించాల్సిన పని లేదు. ఒంటరి పోరుకు సమాయత్తం కండి' అని పిలుపునిచ్చారు. దీనిపై స్పందించిన రౌత్ 'మీ వైఫల్య భయంతోనే మీరీ మాటలు మాట్లాడుతున్నారు. ఓటమి భయం మీకు.. మాకు కాదు. ఎదుటి వారికి గుండెపోటు (ఓటమి) అంటూ ఎందుకు మాట్లాడతారు? ఐదు రాష్ట్రాల ఎన్నికలతో గుండెపోటు వచ్చింది మీకు. ఈ రాష్ట్రాల ప్రజలు మిమ్మల్ని పక్కన పెట్టేశారు.

సామూహిక నిరాహార దీక్షకు పాలస్తీనా ఖైదీలు సిద్ధం

జెరూసలేం : జైళ్ళలో పరిస్థితులను మరింత అధ్వాన్నం చేసేలా కొత్త చర్యలు చేపట్టాలని ఇజ్రాయిల్ ప్రభుత్వం భావిస్తోంది. అదే గనుక జరిగితే మూకుమ్మడిగా నిరాహార దీక్ష చేపట్టేందుకు ఇజ్రాయిల్ జైళ్ళు, నిర్బంధ కేంద్రాలు, ఇంటరాగేషన్ కేంద్రాల్లోని వందలాదిమంది పాలస్తీనియన్లు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఖైదీలు, పాలనాపరమైన నిర్బంధితులు (ఎలాంటి అభియోగాలు లేకుండా జైలు శిక్ష అనుభవిస్తున్నవారు) ఒక సంయుక్త ప్రకటన చేశారు. ఇజ్రాయిల్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయం కొత్త తరహా అణచివేత చర్య అని వారు వ్యాఖ్యానించారు. ఈ నిర్ణయం తీసుకోవడమంటే యుద్ధం ప్రకటించడమేనని, దీంతో తమ పోరాటంలో కొత్త దశ ఆరంభమైందని ఆ సంయుక్త ప్రకటన పేర్కొంది. తమకు సంఘీభావంగా నిలబడాల్సిందిగా వారు పాలస్తీనా వర్గాలను, కార్యకర్తలను కోరారు. దేశవ్యాప్తంగా ప్రదర్శనలు నిర్వహించాలని కోరారు. ఇజ్రాయిల్‌లో 5500 పాలస్తీనా ఖైదీలు వున్నారు.

ట్రంప్,నాటో చర్యకు నిరసన



ట్రంప్ ప్రభుత్వ, నాటో కూటమి యుద్ధోన్మాద, జాతి వివక్ష విధానాలకు వ్యతిరేకంగా మార్చి 30న అమెరికా అంతటా భారీ ప్రదర్శనలు నిర్వహించాలని హక్కుల సంఘాలు పిలుపునిచ్చాయి. ఏప్రిల్ 4న మార్టిన్ లూథర్‌కింగ్ (జూనియర్) వర్ధంతిని పురస్కరించుకొని ఈ ఆందోళన చేపట్టాలని నిర్ణయించాయి.

నయా సంపన్నులపై 70 శాతం పన్ను..!

అమెరికన్ యువ ప్రజా ప్రతినిధి ప్రతిపాదన

వాషింగ్టన్: నయా సంపన్నులపై 60 నుండి 70 శాతం మేర పన్ను విధించి పర్యావరణ పరిరక్షణకుద్దేశించిన న్యూ గ్రీన్ డీల్ అమలుకు నిధులు సమకూర్చాలని అమెరికన్ కాంగ్రెస్‌లో ఒక యువ ప్రజా ప్రతినిధి ప్రతిపాదించారు. అమెరికన్ కాంగ్రెస్ ప్రతినిధుల సభలో తొలిసారిగా అడుగుపెట్టిన యువ ప్రజా ప్రతినిధి అలెగ్జాండ్రియా అకాషియో కార్టెజ్ ఈ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. పాత న్యూయార్క్ నగరానికి చెందిన కార్మిక దంపతుల కుమార్తె అయిన ఈ 29 ఏళ్ల యువ ప్రజా ప్రతినిధి తన ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుతున్నారు. ఆదివారం ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో ఆమె ఈ సంగతి వెల్లడించారు. 2030 నాటికి కర్బన ఉద్గారాల విడుదలను నిలిపివేసే లక్ష్యంతో కుదిరిన 'గ్రీన్ న్యూ డీల్' పన్నుల విధానంపై ఆమె మాట్లాడుతూ ఈ విధానానికి అవసరమైన నిధులు సమకూర్చేందుకు దేశంలో నయా సంపన్నులపై పన్నులు పెంచాల్సిందేనన్నారు. ప్రస్తుతం అనుసరిస్తున్న పన్నుల విధానం, పన్ను రేట్లు 60వ దశకం నాటివని గుర్తు చేసిన ఆమె ఇప్పుడు ఆధునిక వ్యవస్థకు తగినట్లుగా పన్నురేట్లు కూడా వుండాలని సూచించారు. అధ్యక్షుడు ట్రంప్ ఆర్థిక సంస్కరణల పుణ్యమా అంటూ గతంలో 39.6 శాతం వున్న పన్ను రేటు ఇప్పుడు 37 శాతానికి తగ్గింది. యువ ప్రజా ప్రతినిధి చేసిన ప్రతిపాదనకు విశేష మద్దతు లభిస్తోంది.

త్వరలోనే ఇయు బుడగ పేలిపోతుంది!

ఆర్థిక విశ్లేషకుల హెచ్చరిక

బ్రస్సెల్స్: ఐరోపా కూటమి ఆర్థిక వ్యవహారాల బుడగ త్వరలోనే పేలనున్నదని ప్రముఖ విశ్లేషకులు మిచ్ ఫీర్‌స్టీన్ హెచ్చరించారు. తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గ్రీస్ సరసన మరో దేశం చేరనున్నదని ఆయన ఒక మీడియా సంస్థకిచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఐరోపాకు గడ్డుకాలమే. బ్రెగ్జిట్, ఇతర సభ్యదేశాలు బెదిరింపులు ఈ కూటమిని బలహీనపరుస్తున్నాయని ఆయన తెలిపారు.. ఫ్రాన్స్‌లో కొంతకాలంగా కొనసాగుతున్న నిరసనలు దీనికొక సంకేతం. త్వరలోనే ప్రపంచ వ్యాప్తంగా తీవ్ర అశాంతి తలెత్తనున్నదని, దీనికి ఇటలీ నాంది కావచ్చు. పొదుపు చర్యల పేరుతో ప్రజలపై ఎనలేని భారాలు మోపుతున్నారు. గ్రీస్ బాటలోనే ఇటలీ, ఫ్రాన్స్ నడుస్తున్నాయని ఆయన వివరించారు. ఇటలీ రుణభారం నాలుగు లక్షల కోట్ల డాలర్లకు చేరుకుందన్నారు.. ఫ్రాన్స్‌లో కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోందన్నారు.

ఇటుచర్చలు.. అటు కవ్వింపు చర్యలు

ద.చైనా సముద్రంలో అమెరికన్ యుద్ధ నౌక సంచారం - చైనా ఆగ్రహం



బీజింగ్: ఒకవైపు చైనాతో వాణిజ్య చర్చలు ప్రారంభమవుతుండగా మరో వైపు అమెరికా తన అధునాతన యుద్ధ నౌకను దక్షిణ చైనా దీవులకు పంపింది. అమెరికా కవ్వింపు చర్యను చైనా ఖండించింది. నావికా స్వేచ్ఛ' పేరుతో అమెరికా మోహరించిన యుఎస్ఎస్ మెక్‌కాంప్‌బెల్ ' అనే యుద్ధనౌకను నిలువరించేందుకు చైనా తన యుద్ధ నౌకలను, యుద్ధ విమానాన్ని ఆ ప్రాంతానికి పంపింది. గైడెడ్ మిసైల్ డిస్ట్రాయర్ నౌక సోమవారం నాడు పారాసెల్ దీవుల సమీపంలో 12 నాటికల్ మైళ్ల పరిధిలో సంచరించిందని అమెరికా పసిఫిక్ నౌకాదళం వెల్లడించింది. ఇతర దేశాలు అత్యుత్సాహంతో చేస్తున్న సముద్ర పరిధి ప్రకటనలను సవాలుచేసేందుకే తాము ఈ ఆపరేషన్‌ను నిర్వహించినట్లు పసిఫిక్ నౌకాదళ ప్రతినిధి రాచెల్ మెక్‌మార్ వివరించారు. తమ అనుమతి లేకుండా పారాసెల్ దీవుల ప్రాంతంలోకి అమెరికా యుద్ధ నౌక ప్రవేశించిందని చైనా విదేశాంగశాఖ ఒక ప్రకటనలో ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిపై తాము అధికారికంగా అమెరికాకు నిరసన తెలియచేశామని వెల్లడించింది. వెంటనే ఇటువంటి కవ్వింపు చర్యలకు తెరదించాలని తాము అమెరికాను కోరుతున్నట్లు చైనా విదేశాంగశాఖ ప్రతినిధి లూకాంగ్ చెప్పారు. ఈ నౌకను గుర్తించి హెచ్చరించేందుకు తాము యుద్ధ నౌకలు, యుద్ధ విమానాన్ని పంపామని ఆయన వివరించారు. సోమవారం నాడు అమెరికా చైనా మధ్య వాణిజ్య చర్చలపై దీని ప్రభావం వుంటుందని పరిశీలకులు భావిస్తున్నారు.

వెనక్కి తగ్గిన ట్రంప్


అమెరికా-మెక్సికో గోడ నిర్మాణాకు బదులుగా స్టీల్ కంచె



వాషింగ్టన్: మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెనక్కి తగ్గారు. గోడ నిర్మాణానికి బదులుగా స్టీల్‌తో ధృడమైన కంచె ఏర్పాటు చేయాలని ట్రంప్ యంత్రాంగం నిర్ణయించింది. ఈ విషయాన్ని ట్రంప్ వెల్లడించారు. అమెరికా పాక్షిక షట్‌డౌన్ ముగిసేంత వరకు తన యంత్రాంగం, డెమొక్రటిక్ పార్టీ నేతలతో చర్చలు జరుపుతుందని అన్నారు. అతి త్వరలో ఈ సమస్యకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. మెక్సికోతో సరిహద్దులో గోడ నిర్మాణానికి నిధులు కేటాయించినట్టయితే ద్రవ్య వినిమయ బిల్లు ఆమోదిస్తానని ట్రంప్ పట్టుబట్టడం.. అందుకు డెమొక్రటిక్ నేతలు అంగకరించకపోవడంతో అమెరికాలో పాలన స్తంభించిన సంగతి తెలిసిందే.ఈ విషయంలో డెమొక్రటిక్ నేతలు కూడా పట్టుదలతో ఉండడంతో షట్‌డౌన్ ముగించేందుకు ట్రంప్ కాస్త తన పట్టు వీడారు. 'మేము ప్రస్తుతం సరిహద్దులో కాంక్రీటు గోడకు బదులుగా స్టీలు కంచె ఏర్పాటు చేయాలని ప్రణాళిక వేస్తున్నాం. ఇది ధృఢంగా ఉండటమే కాకుండా వలసలను అడ్డుకుంటుంది. ఇదే మంచి పరిష్కారం' అని ట్రంప్ అన్నారు. అమెరికా ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్, పలువురు కీలక డెమొక్రటిక్ నేతలతో చర్చలు జరిపిన అనంతరం ట్రంప్ ఈ నిర్ణయం తీసుకున్నారు. డెమొక్రట్లకు, పెన్స్‌కు జరిగిన సమావేశం ఫలవంతంగా జరిగిందని ట్రంప్ తెలిపారు. సరిహద్దు రక్షణ అంశంపై అనేక అంశాలు చర్చకు వచ్చాయని అన్నారు. స్టీలు కంచె విషయంపై కూడా చాలా మంది అభిప్రాయాలు తీసుకున్నామని అన్నారు.

శరణార్థుల రక్షణ బాధ్యత అంతర్జాతీయ సమాజానిదే

పోప్ ఫ్రాన్సిస్



రోమ్ : శరణార్థులను, వలస వచ్చేవారిని రక్షించాల్సిన బాధ్యత అంతర్జాతీయ సమాజానికి వుందని పోప్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు. శరణార్థులు, వలసలు ప్రత్యేకించి యూరప్, ఉత్తర అమెరికాల్లో పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వాలు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం పెరిగిపోయిందని, భయాందోళనలు కూడా ఎక్కువయ్యాయని పోప్ పేర్కొన్నారు. సార్వజనీనమైన ఈ సమస్యకు ఇటువంటి పాక్షికమైన పరిష్కారాలు ఎంత మాత్రమూ తగవని తాను అభిప్రాయపడుతున్నట్లు చెప్పారు. వలసలపై ఐక్యరాజ్య సమితి ఒప్పందాన్ని ఆయన ప్రశంసించారు. ప్రజల కదలికలను ఎలా నిర్వహించాలో మార్గదర్శకాలను ఈ ఒప్పందంలో పొందుపరిచారు. గతేడాది మొరాకోలో జరిగిన ఈ సమావేశాన్ని అమెరికా, ఇటలీ, హంగరీ, పోలెండ్‌లు బహిష్కరించాయి. ఆయుధ వ్యాపారాన్ని, అణ్వాయుధాలు కలిగి వుండడాన్ని పోప్ ఖండించారు.

జర్దారీ ఆస్తులను జప్తు చేయండి

పాక్ కోర్టు ఆదేశాలు



ఇస్లామాబాద్: నకిలీ ఖాతాల ద్వారా సుమారు రూ.22 వేల కోట్ల మేర అవినీతికి పాల్పడిన కేసులో పాకిస్తాన్ మాజీ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ ఆస్తులను జప్తు చేయాల్సిందిగా జాయింట్ ఇన్వెస్టిగేషన్ టీం (జేఐటీ) సుప్రీంకోర్టుకు సిఫారసు చేసింది. ఈమేరకు జేఐటీ కరాచీ, లాహోర్‌లలోని ప్రఖ్యాత బిలావల్ హౌజ్, ఇస్లామాబాద్‌లోని జర్దారీ ఇంటిని జప్తుచేయాలని కోరుతూ శనివారం సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పించింది. కరాచీలోని 5 ప్లాట్లతో పాటు న్యూయార్క్, దుబాయిల్లో ఉన్న జర్దారీ ఆస్తులను కూడా జప్తు చేయాలంది. దర్యాప్తు బృందం జర్దారీ పట్టణ, వ్యవసాయ భూములు, జర్దారీ గ్రూప్, అతని సోదరి ఫరీల్ తాల్పూర్ ఆస్తులపై విచారణ జరపాల్సిందిగా నివేదికలో కోరింది. జర్దారీ, ఓమ్ని గ్రూప్స్ ప్రభుత్వ నిధుల్లో అక్రమాలకు పాల్పడినట్లు, నగదును 'హుండి', 'హవాలా' ద్వారా దేశం నుంచి బదిలీ చేసినట్లు ఆరోపించింది. ఆయన ఆస్తులను దేశం నుంచి బదిలీ చేసే అవకాశం ఉన్నందున ఈ కేసులో తీర్పు వెలువడే వరకు ఆస్తులను జప్తు చేయాల్సిందిగా కోరింది. కాగా, జర్దారీ, తాల్పూర్‌లు ఈ నివేదికను ఊహాగానాలుగా, రాజకీయ వేధింపులను లక్ష్యంగా చేసుకుని రూపొందించారని ఆరోపించారు. జర్దారీ, ఇక్బాల్ మెమాన్ పేరుతో ఓ బినామీ కంపెనీని స్థాపించగా, దాన్ని 1998లో జప్తు చేశారు. ఈ కేసులో జర్దారీ అత్యంత సన్నిహితుడైన హుస్సేన్ లవాయి గతేడాది జూలైలో అరెస్టు కాగా, మరో సన్నిహితుడు ఓమ్ని గ్రూప్ చైర్మెన్ అన్వర్ మాజీద్, అతని కుమారుడు అబ్దుల్ ఘనీ మజీద్‌ను గతేడాది ఆగస్టులో అరెస్టు చేశారు.

మొదటి పేజీ తరువాయి

కొలిక్కిరాని ఎన్టీఆర్ వైద్యసేవలు

ఆస్పత్రుల జాబితాలో ఉన్న దాదాపు 450 ఆస్పత్రులలో సేవలు కొనసాగడంలేదని ఏపి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల సంఘం (ఆశా) వెల్లడించింది. ప్రభుత్వం గతనెలలో విడుదల చేశామని ప్రకటించిన రూ.230 కోట్లు ఇప్పటివరకు తమ ఖాతాల్లో చేరలేదని ఆశా ప్రతినిధులు తెలిపారు. సమస్య పరిష్కారమయ్యే వరకు సేవలు కొనసాగించేదిలేదని స్పష్టం చేశారు. సేవల కొనసాగింపు, డిమాండ్లపై మంగళవారం విజయవాడలో సమావేశమవుతామని ఆశా రాష్ట్ర అధ్యక్షులు వి. మురళీకృష్ణ తెలిపారు. ఇదిలా ఉంటే ఈ సమస్యపై సోమవారం ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ అధికారులు సమావేశమై అంతర్గతంగా చర్చించారు. ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలకు పెండింగ్‌లో ఉన్న యాభై శాతం క్లెయిమ్స్ వరకు విడుదల చేసేలా నిర్ణయించామని ఎన్టీఆర్ వైద్యసేవ సిఇఒ డాక్టర్ ఎన్. సుబ్బారావు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ కింద ఉన్న 435 నెట్‌వర్క్ ఆస్పత్రులలో కేవలం 96 ఆస్పత్రులలోనే సేవలు కొనసాగడంలేదని, మిగిలిన ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయని తెలిపారు. యాభై శాతం క్లెయిమ్స్‌కు అడ్వాన్సులు చెల్లించేందుకు నిర్ణయించామన్నారు. ఎన్టీఆర్ వైద్యసేవల కింద సోమవారం రూ.98 కోట్లు విడుదల చేశామని తెలిపారు. మొత్తం రూ. 500 కోట్లుకు గాను గడిచిన ఇరవై రోజుల్లోనే విడతల వారీగా రూ. 310 కోట్లు ప్రయివేటు ఆస్పత్రులకు చెల్లించామని స్పష్టం చేశారు. ఈ ఏడాది ఆఖరి త్రైమాసిక బడ్జెట్‌లో కూడా రూ.250 కోట్లు విడుదల చేశామని, ఈ బడ్జెట్‌తో మిగిలిన బకాయిలు కూడా రెండు మూడు రోజుల్లోనే సదరు ఆస్పత్రుల ఖాతాల్లోకి చేరేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇదిలా ఉంటే తమ ఖాతాల్లోకి అసలు నగదు జమ కాలేదని ప్రయివేటు ఆస్పత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయి.

ఎన్‌టిఆర్ వైద్య సేవ బిల్లులు చెల్లించాలి
మంత్రి ఫరూక్‌కు వైద్యుల వినతి

ఎనిమిది నెలలుగా పెండింగ్‌లో వున్న ఎన్టీఆర్ వైద్య సేవ బిల్లులను విడుదల చేయాలని మంత్రి ఫరూక్‌ను అనంతపురం జిల్లాలోని పలువురు వైద్యులు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.350 కోట్లు ప్రభుత్వం విడుదల చేయాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి ఫారుక్‌ను ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. వైద్యులు మాట్లాడుతూ నెలల తరబడి బిల్లులను మంజూరు చేయకుంటే ఆసుపత్రుల నిర్వహణ కష్టంగా ఉందని తెలిపారు. మంత్రి స్పందిస్తూ రెండు మూడు రోజుల్లో యాభై శాతం బిల్లులను మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో మెడికల్ కాలేజీ ప్రిన్సిపల్ డాక్టరు వెంకటేశ్వరావు, ఆస్పత్రి సూపరింటెండెంట్ జగన్నాథ్, ప్రముఖ వైద్యులు డాక్టర్ సోమయాజులు, కేతిరెడ్డి మోహన్‌రెడ్డి, గుత్తారవీంధ్ర, మనోరంజన్‌రెడ్డి ఉన్నారు.

పోలవరం రికార్డులు..

నాలుగు గంటలకు సిఎం పోలవరం చేరుకున్నారు. ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభించి సోమవారం ఉదయానికి 24 గంటల్లో కాంక్రీటు పనుల్లో నవయుగ కంపెనీ గిన్నిస్ రికార్డు సాధించింది. గతంలో దుబాయ్ పేరిట ఉన్న రికార్డును ఈ సంస్థ తిరగరాసింది. ఈ సందర్భంగా ప్రాజెక్టు ప్రాంతంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. గిన్నిస్ పత్రాలు అందుకున్న తర్వాత సిఎం మాట్లాడుతూ ప్రపంచంలో పోలవరం అరుదైన ఘనతను దక్కించుకుందన్నారు. తన జీవితంలో ఎన్నడూ కలగని సంతోషం కలుగుతోందన్నారు. దీనిలో పనిచేసిన ఇంజినీర్లు, సిబ్బందితో పాటు, సహాయ సహకారాలందించిన ఉభయగోదావరి జిల్లాల కలెక్టర్లు, జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును అభినందిస్తున్నట్లు తెలిపారు. మార్చిలో ఈ రికార్డును నవయుగ కంపెనీ బ్రేక్ చేయాలని, ఒకేరోజు 65 వేల క్యూబిక్ మీటర్ల కాంక్రీటును వేయాలన్నారు. అన్ని రంగాల్లోనూ ఎపి ముందంజలో ఉందన్నారు. ఇప్పటి వరకూ 670 అవార్డులు వచ్చాయన్నారు. ఇది రైతుల ప్రాజెక్టు అని అన్నారు. 84 సార్లు వర్చువల్, 30సార్లు నేరుగా పోలవరం పనులు పరిశీలించినట్లు చెప్పారు. డయాఫ్రంవాల్, జెట్‌గ్రౌంటింగ్ సమయంలో ఇబ్బందులు వచ్చినా ముందుకు సాగామన్నారు. 62 ప్రాజెక్టులకు నాంది పలికామని, 17 ప్రాజెక్టులు సాగుతున్నాయని, ఏడు ప్రాజెక్టులు పూర్తయ్యాయని తెలిపారు. రెండుకోట్ల ఎకరాలకు నీరివ్వాలన్నదే లక్ష్యమన్నారు. వ్యవసాయంలో దేశం 2.4 శాతం వృద్ధిసాధిస్తే.. రాష్ట్రం 11శాతం వృద్ధి సాధించిందన్నారు. నవయుగ కంపెనీ బాగా పనిచేస్తుందని కితాబు ఇచ్చారు.

2019 జూన్‌కు గ్రావిటీతో నీళ్లు

2019కు గ్రావిటీతో కుడి, ఎడమ కాలువలకు నీళ్లిస్తామని చెప్పారు. 2018లో కేంద్రం సిబిఐపి అవార్డుసైతం పోలవరానికి దక్కిందన్నారు. 2019 డిసెంబర్‌కు పోలవరం పూర్తిచేస్తామన్నారు. డిపిఆర్ ఫైనల్ చేసి కేంద్రం వెంటనే డబ్బులు ఇవ్వాలన్నారు. సాకులతో కాలక్షేపం చేయడం మంచిది కాదన్నారు.

రాజకీయ లబ్ధి కోసమే..

ఇబిసిలకు రిజర్వేషన్లపై టిడిపి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

అగ్రవర్ణాల పేదలకు 10 శాతం రిజర్వేషన్లు ఎలా అమలు చేస్తారో వివరణ ఇవ్వకుండా, కనీస అధ్యయనం కూడా చేయకుండా ప్రకటించడం సరికాదని టిడిపి ఎంపీలు అభిప్రాయపడ్డారు. రాష్ట్రానికి బిజెపి చేసిన ద్రోహాన్ని నిరసిస్తూ పార్లమెంటు ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఆందోళన చేపట్టిన సందర్భంగా టిడిపి ఎంపీలు సుజనా చౌదరి, రమేశ్ తదితరలు మీడియాతో మాట్లాడారు. ఎన్నికల్లో లబ్ధి కోసమే కేంద్ర ప్రభుత్వం ఇబిసి రిజర్వేషన్లకు మోడీ సర్కార్ పూనుకుంటోందని విమర్శించారు. రాజకీయ లబ్దికోసం రిజర్వేషన్లు పెంచరాదని, రాష్ట్రాల్లో జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఇబిసి రిజర్వేషన్లపై అధ్యయనం చేసి అనంతరం పార్టీ వైఖరి స్పష్టం చేస్తామని ఆ పార్టీ ఎంపీ సుజనాచౌదరి తెలిపారు. ఎలాంటి అధ్యయనం, చర్చ లేకుండా ఇబిసి రిజర్వేషన్ల అంశం తీసుకొచ్చారని ఎంపీ రమేష్ విమర్శించారు. బిజెపి సీనియర్ నేత అద్వానీకి వెన్నుపోటు పొడిచి మోడీ ప్రధాని అయ్యారని ఎంపి కనకమేడల రవీంద్ర కుమార్ దుయ్యబట్టారు. ఏపికి బ్రాండ్ అంబాసిడర్ చంద్రబాబు అని మోడీనే అన్నారని, వెన్నుపోటు అంటూ అవగాహన లేకుండా మాట్లాడొద్దని సూచించారు. రాజకీయ లబ్ధికోసమే ఈబిసి రిజర్వేషన్లు తెస్తున్నారని ఎంపి నిమ్మల కిష్టప్ప విమర్శించారు.

అంతకు ముందు లోక్‌సభలో వెల్‌లో ఆందోళన చేస్తున్న ఎంపి శివప్రసాద్‌ను స్పీకర్ సుమిత్రా మహాజన్ రెండు రోజుల పాటు సస్పెండ్ చేశారు. ఆయనతో పాటు అన్నాడిఎంకెకి చెందిన ముగ్గురు సభ్యులను కూడా సస్పెండ్ చేసింది. అనంతరం ఏపికి ప్రత్యేక హోదా, విభజన హామీలు నెరవేర్చాలంటూ పార్లమెంట్ ఆవరణలో గాంధీ విగ్రహం వద్ద టిడిపి, వైసిపి ఎంపిలు వేర్వేరుగా సోమవారం ఆందోళన చేశారు. తమిళనాడు మాజీ సిఎం ఎంజి రామచంద్రన్ వేషధారణలో చిత్తూరు ఎంపి శివప్రసాద్ నిరసన తెలిపారు. రాష్ట్రానికి న్యాయం చేయాలంటూ ఎంపిలు నినాదాలు చేశారు. టిడిపి ఎంపిల నిరసనపై బిజెపి ఎదురుదాడికి దిగింది. నిరసన తెలుపుతున్న ఎంపిల వద్దకు కేంద్ర మంత్రి పియూష్ గోయల్, ఆ పార్టీ ఎంపి జివిఎల్ నరసింహారావు చేరుకుని మీడియాను పిలిపించి మాట్లాడారు.

టిడిపివి డ్రామాలు : పియూష్ గోయల్

టిడిపి డ్రామాలు ఆడుతోందని కేంద్ర రైల్వే శాఖ మంత్రి పియూష్ గోయల్ విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాకు బదులుగా ప్రత్యేక ప్యాకేజీ ఇస్తే రాష్ట్ర అసెంబ్లీలో తీర్మానం చేసి స్వాగతించిన చంద్రబాబు... ప్రధాని నరేంద్ర మోడీని, కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీని అభినందించారని తెలిపారు. ఏపికి ప్రత్యేక ప్యాకేజి ఇస్తే అభినందించి, ఇప్పుడు నిరసన పేరుతో డ్రామాలు ఆడుతున్నారా? అంటూ ప్రశ్నించారు. ఏపిలో భారీ అవినీతి కుంభకోణాలకు పాల్పడిన టిడిపి నేతలు, వాటిని కప్పిపుచ్చుకునేందుకు ఇలాంటి డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. ఏపికి ప్రత్యేక హోదాతో సమానమైన ప్యాకేజీ, ఆర్థిక లోటు భర్తీకి అదనంగా నిధులు ఇచ్చామని అన్నారు. తెలంగాణ ప్రజలు ఏవిధంగా టిడిపి, కాంగ్రెస్ కూటమిని తిరస్కరించారో, అదే విధంగా ఆంధ్ర ప్రజలు కూడా టిడిపికి తగిన బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

చంద్రబాబు అవినీతి చక్రవర్తి: విజయసాయి రెడ్డి

ఏపి ప్రత్యేక హెూదాను డిమాండ్ చేస్తూ వైసిపి రాజ్యసభ సభ్యులు విజయసాయి రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిలు పార్లమెంట్ ముందు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా విజయసాయి రెడ్డి మాట్లాడుతూ విభజన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు అవినీతి చక్రవర్తి అని, ఆయన పేరును గిన్నిస్ బుక్‌లో రికార్డు చేయాలని ఎద్దేవా చేశారు. చంద్రబాబు నాలుగున్నరేళ్ల అధికారంలో ఉండి రూ. లక్షల కోట్లు అవినీతికి పాల్పడ్డారని విమర్శించారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో 25 ఎంపి సీట్లను గెలిపిస్తే ప్రత్యేక హోదా సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు

ఎన్ఐఎకు సహకరించొద్దు

మొదటి పేజీ తరువాయి

చేయించాలని వైసిపి నాయకులు కోర్టును ఆశ్రయించారు. దీంతో ఈ కేసును ఎన్ఐఎకు అప్పగించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎన్ఐఎ రాష్ట్రంలో విచారణను మొదలు పెట్టింది. విచారణలో భాగంగా ఎన్ఐఎకు విశాఖ సిట్ బృందం సహకరించాలని కోర్టు పేర్కొన్నప్పటికీ ఎన్ఐఎకు సిట్ ఏ మాత్రమూ సహరించడం లేదు. ఈ కేసుపై సిట్ దర్యాప్తు పూర్తి చేస్తున్న క్రమంలో ఎన్ఐఎకు బదిలీ చేయడాన్ని రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్నట్లు తెలుస్తోంది. కేసును జాతీయ దర్యాప్తు సంస్థకు కేంద్రం ఇవ్వడంపై రాష్ట్ర ప్రభుత్వం అప్పీల్‌కు వెళ్లాలని నిర్ణయించినట్లు సమాచారం. ఈ విషయంలో సాధ్యాసాధ్యాలపై సిఎం చంద్రబాబునాయుడు ఈనెల 6న రాష్ట్ర డిజిపి, అడ్వకేట్ జనరల్‌తో గంట పాటు సమీక్ష నిర్వహించారు. అప్పీల్‌కు వెళ్లేందుకు ఏయే అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుంది? జాతీయ దర్యాప్తు సంస్థ విచారణ ప్రారంభిస్తే రాష్ట్ర ప్రభుత్వం ఎలా వ్యవహరించాల్సి ఉంటుంది? గతంలో ఇటువంటి సంఘటనలు ఇతర రాష్ట్రాల్లో ఏమైనా జరిగాయా? ఇటువంటి విషయాలన్నీ సిఎం, న్యాయ నిపుణుల మధ్య చర్చల్లో ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. విశాఖ సిటీ పోలీస్ కమిషనర్‌ను సెలవుపై పంపితే బాగుంటుందన్న అభిప్రాయం సమావేశంలో వచ్చినట్లు తెలుస్తోంది. ఆ మరుసటి రోజు నుంచే సిపి మహేష్ చంద్ర లడ్డా ఈ నెల 8 వరకు సెలవు పెట్టారు. దీంతో ఎన్ఐఎ చేతుల్లోకి ఈ కేసు వెళ్లడాన్ని జీర్ణించుకోలేక చంద్రబాబు ప్రభుత్వమే సిపిను సెలవుపై పంపిదన్న అభిప్రాయానికి బలం చేకూరింది. హైకోర్టు ఆదేశాల మేరకు తాజాగా విశాఖపట్నం చేరుకున్న ఎన్ఐఎ అధికారులు కేసు వివరాలను, ఆధారాలను అప్పగించాలని సిట్ అధికారిని కోరారు. అయితే సిట్ దగ్గర ఉన్న కేసు వివరాలను అందించాలంటే రాష్ట్ర ప్రభుత్వం అనుమతి తప్పనిసరని ఆయన స్పష్టం చేసినట్లు తెలిస్తోంది. హడావుడిగా మీడియా ముందుకు వచ్చి జగన్‌పై హత్యాయత్నం కేసు కేవలం ప్రచారం మాత్రమేనని స్పష్టం చేసి ఫైల్‌ను క్లోజ్ చేసిన పోలీస్ కమిషనర్ సెలవులో ఉండటంతో ఎన్ఐఎకు విశాఖ సిట్ నుంచి కావాల్సిన సహకారం అందడంలేదు. దీంతో కోడికత్తి కేసులో పురోగతి కానరావడం లేదు. ఓ వైపు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఉంటేనే తప్ప కేసు వివరాలు ఇవ్వబోమని విశాఖ పోలీసులు చెబుతుండటం, మరో పక్క సిపి సెలవులో వెళ్లిపోవడంతో వెనుక చంద్రబాబు ప్రభుత్వం డైరెక్షన్ ఉందని స్పష్టమవుతోంది. విచారణకు సిట్ సహకరించాలని హైకోర్టు ఆదేశించినా స్థానిక పోలీసులు ఎన్ఐఎ విచారణకు సహకరించడం లేదని వైసిపి నేతలు సైతం ఆరోపిస్తున్నారు. మొదటి నుంచీ ఈ కేసులో జగన్‌కు వ్యతిరేకంగా ఉన్న చంద్రబాబు ప్రభుత్వం సిట్ నివేదికను అప్పగించేందుకు అనుమతి ఇస్తుందా? లేదా? అన్న సందేహం నెలకొంది.

అగ్రవర్ణల్లో పేదలకు 10 శాతం రిజర్వేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

ఎస్‌టిలకు 7.5 శాతం, ఒబిసిలకు 27 శాతం రిజర్వేషన్లు వున్నాయి. తాజా పెంపుతో మొత్తం రిజర్వేషన్లు 59.5 శాతానికి చేరతాయి.

రాజ్యాంగ సవరణ అవసరం

కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయాన్ని అమలు చేయడానికి రాజ్యాంగంలోని 15, 16 అధికరణలకు సవరణలు చేయాల్సి వుంది. ఇందుకోసం మంగళవారం తో ముగియనున్న పార్లమెంట్ సమావేశాలను మరో రెండు రోజులు పొడిగించే అవకా శం వుందని భావిస్తున్నారు. కుల ఆధారిత రిజర్వేషన్లు 50 శాతం మించరాదని గతంలో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో రాజ్యాంగ సవరణ తప్పనిసరి అయింది.

విఫలమైన పివి సర్కార్

మాయావతి, రాందాస్ అత్‌వాలే వంటి రాజకీయ నేతలు గతంలో ఇలాంటి సూచనలు చేసినా తాజాగా ఈ మార్పు కోసం రాజ్యాంగ సవరణకు సమాయత్తం కావడం ఇదే మొదటిసారి. గతంలో నరసింహారావు ప్రభుత్వ హయంలో ఇటు వంటి చర్య తీసుకోవడానికి విఫల యత్నం జరిగింది. మండల్ కమిషన్ సిఫార్సుల అమలుకు వ్యతిరేకంగా తలెత్తిన రాజకీయ ఆగ్రహాన్ని సమసిపోయేలా చేసేందుకు ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్లు అందించేందుకు ప్రయత్నించారు. అయితే దీనివల్ల 50 శాతం పరిమితి దాటిపోతోందని సుప్రీం కోర్టు పేర్కొంది. దాంతో పివి సర్కార్ ప్రయత్నం నిష్ఫలమైంది.

ఎవరెవరు ఏమంటున్నారు

కాంగ్రెస్ నేత అభిషేక్ సింఘ్వి : నాలుగేళ్ళ 8నెలలుగా గుర్తు రాలేదా, ఇప్పుడే గుర్తొచ్చిందా? ఎన్నికల ప్రవర్తనా నియమావళి మరో మూడు నెలల్లో అమల్లోకి వస్తోంది.ఇప్పుడీ ప్రకటన అంటే ఇది ఎన్నికల జిమ్మిక్కు తప్ప మరొకటి కాదు.

- **ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ :** ఇది ఎన్నికల స్టంట్ తప్ప మరొకటి కాదు. ప్రభుత్వానికి ధైర్యముంటే పార్లమెంట్‌లో సవరణ బిల్లు తీసుకురావాలి.
- **కేంద్ర మంత్రి శివ ప్రతాప్ శక్లా :** ఎన్నికలకీ ఈ ప్రకటనకీ సంబంధం లేదు
- **యశ్వంత్ సిన్హా :** ఇదో పెద్ద నాటకం. ఇందులో ఎన్నో చట్టబద్ధమైన ఇబ్బందులు వున్నాయి. పార్లమెంట్ ఉభయ సభల్లో ఈ సవరణలన్నీ ఆమోదం పొందే సమయం లేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వ ఉద్దేశ్యం ఏమిటన్నది స్పష్టమై పోతోంది.
- **సిపిఐ నేత రాజా :** ఇది రాజకీయ ప్రయోజనం కోసం తీసుకున్న నిర్ణయం
- **హార్దిక్ పటేల్ :** ఎన్నికలు సమీపిస్తున్న వేళ మోడీ అమ్ముల పొదిలోని ఆఖరి అస్త్రం.

కేశఖండన శాలల్లోని ఉద్యోగుల్ని పర్మినెంట్ చేయాలి

- ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష
- ప్రజాసంఘాల మద్దతు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయాల్లోని కేశఖండన శాలల్లో పనిచేస్తున్న కార్మికుల్ని వెంటనే పర్మినెంట్ చేయాలని, 2018 జూన్‌లో ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఏపీ దేవాదాయ, ధర్మాదాయ ఆలయాల నాయిబ్రాహ్మణ బార్బర్స్ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ(జెఎసి) ఆధ్వర్యంలో సోమవారం అలంకార్ సెంటర్ ధర్నా చౌక్‌లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా జెఎసి గౌరవాధ్యక్షులు అన్నవరపు బ్రహ్మయ్య మాట్లాడుతూ కేశఖండన కార్మికుల సమస్యల్ని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులకు సరిపోని ఆదాయంతో దుర్భర జీవితం గడుపుతున్నారన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యాలు కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిటైర్ అయిన వారికి నెలకు రూ.5వేలు పెన్షన్ ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గౌరవ సలహాదారు మల్కాపురం కనకారావు, ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు, కోశాధికారి ఏలూరి నారాయణ, కె.నారాయణ, ఎ.రాము, ఎఐసి రాష్ట్ర నాయకులు ఇంటూరి బాబ్జి తదితరులు ప్రసంగించారు.

దీక్షకు సిపిఎం మద్దతు: సిహెచ్ బాబూరావు

దేవాదాయ శాఖలోని నాయి బ్రాహ్మణులు చేస్తున్న పోరాటం న్యాయ సమ్మతమైందని, కార్మికులు చేస్తున్న పోరాటానికి తమ మద్దతు ఉంటుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు అన్నారు. కార్మికులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అన్ని దేవాలయాల్లో పనిచేస్తున్న క్షురకులను ప్రభుత్వం గుర్తించాలని, వారందరికీ ఉచిత వైద్య సేవలందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రానున్న కాలంలో మీరు చేసే పోరాటానికి మద్దతునిస్తామన్నారు. నాయి బ్రాహ్మణులకు ప్రభుత్వం ఇళ్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. సిఐటియు కృష్ణా జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు, బిసి ఐక్యవేదిక నాయకులు దాలిపర్తి ధన్వంతరి, ఎపిజెఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.కృష్ణాంజనేయులు మద్దతు ప్రకటించిన వారిలో ఉన్నారు.

మరో ఛాన్స్

పూజా హెగ్డేకు ఇటు తెలుగులోనూ, అటు బాలీవుడ్‌లోనూ అవకాశాలు వెతుక్కుంటూ వస్తున్నాయి. అదీ అగ్రనటుల సరసన నటించే ఛాన్స్ వస్తుంది. మొదటిసారి ఇక్కడ అల్లు అర్జున్‌తో నటించింది. తర్వాత 'రంగస్థలం' చిత్రంలో ప్రత్యేక గీతంలో మెప్పించింది. ఎన్టీఆర్‌తో చేసిన 'అరవింద సమేత వీర రాఘవ' మిక్స్‌డ్ రివ్యూలు లభించాయి. ఇప్పుడు తెలుగులో ఒక పక్క మహేశ్ బాబు చిత్రం 'మహర్షి'లోనూ, ప్రభాస్‌తో మరో సినిమాలోనూ చేస్తోంది. ఇది కాకుండా బాలీవుడ్‌లో అక్షయ్ కుమార్‌తో కలసి 'హౌస్‌ఫుల్ 4'లో కథానాయిక ఈమె. రోహిత్ శెట్టి దర్శకత్వంలో తాజాగా కొత్త చిత్రం సెట్స్‌పైకి వెళ్లబోతుంది. అందులోనూ అక్షయ్ కుమారే కథానాయకుడు. ఈ చిత్రంలోనూ హెగ్డేనే కథానాయిక తీసుకునే ఆలోచనలో చిత్రబృందం ఉన్నట్టు తెలిసింది. ఈ చిత్రంలో నటించే ఛాన్స్ వస్తే బాలీవుడ్‌లో పూజాకు అవకాశాలు పెరిగినట్టే.



వంద థియేటర్లలో 'ఎన్టీఆర్' విగ్రహాలు

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి

మహానటుడు నందమూరి తారకరామారావు జీవితం ఆధారంగా తెరకెక్కిన 'ఎన్టీఆర్ కథానాయకుడు' ఈనెల 9న విడుదల కానుంది. ఈ క్రమంలోనే సరికొత్త ఆలోచనతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది ఈ చిత్రయూనిట్. తెలుగు రాష్ట్రాల్లో ప్రత్యేకంగా ఎంపిక చేసిన 100 థియేటర్లలో ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. తొలి విగ్రహాన్ని బాలకృష్ణ, విద్యాబాలన్, కళ్యాణ్ రామ్ తిరుపతి పీజేఆర్ థియేటర్‌లో మంగళవారం ఆవిష్కరించనున్నారు. సోమవారం బాలకృష్ణ, విద్యాబాలన్, కళ్యాణ్‌రామ్, దర్శకుడు క్రిష్ జాగర్లమూడి హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో నిమ్మకూరు, బెంగళూరు, తిరుపతి వెళ్లి కథానాయకుడు ప్రమోషన్‌లో పాల్గొననున్నారు. ఆ తర్వాత విగ్రహం విడుదల చేయనున్నారు. ఈ షెడ్యూల్ ప్రకారం సోమవారం ఈ చిత్రబృందం సోమవారం నిమ్మకూరు వెళ్లింది. అక్కడ ఎన్టీఆర్, బసవతారకం విగ్రహాలకు ఈ ముగ్గురూ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ 'ఎన్‌టిఆర్ జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతున్న సినిమా ఒక పార్టీకో, ఒక వర్గానికో పరిమితమైంది కాదు. భావితరాలకు తెలుగుజాతి ఆధునిక చరిత్ర సృష్టికర్త, సినీ, రాజకీయ రంగంలో రాణించిన ఎన్‌టిఆర్ చరిత్రను తెలియజెప్పేందుకు ఈ చిత్రాన్ని తీస్తున్నాం. ఈనెల 9వ తేదీన మొదటి భాగం విడుదల కానుంది. ఇప్పటి వరకు 100 రోజులు ఈ చిత్ర షూటింగ్ జరిగింది. రెండో భాగానికి సంబంధించి మరో 10 రోజులు షూటింగ్ మిగిలి ఉంది. సందేశాత్మక కథలతో కూడిన చిత్రాలనే ఎన్‌టిఆర్ తీశారు. బసవతారకం పాత్రలో విద్యాబాలన్ అద్భుతంగా నటించారు. ఎన్‌టిఆర్ రాజకీయ పార్టీ స్థాపించినప్పుడు చైతన్య రథ సారథిగా నిలిచిన హరికృష్ణ పాత్రలో ఆయన కుమారుడు కల్యాణ్‌రామ్ చేశారు. కోట్ల విజయభాస్కరెడ్డి పాత్రలో వర్ల రామయ్య, మండలి కృష్ణారావు పాత్రలో ఆయన కుమారుడు బుద్ధప్రసాద్ ఈ చిత్రంలో నటించారు. ఈ చిత్రంలో వాస్తవానికి దగ్గరగా పాత్రలు చూపేందుకు సురభి టివి సీరియల్ నటులను వివిధ పాత్రలకు తీసుకున్నాం. ఈ చిత్ర ఆడియో ఫంక్షన్‌ను నిమ్మకూరులో ఏర్పాటు చేయాలనుకున్నా తుఫాను కారణంగా సాధ్యపడలేదు. ఈ నేపథ్యంలో చిత్రం విడుదలకు ముందు తల్లిదండ్రులు, బంధువుల ఆశీసులు తీసుకునేందుకు గ్రామానికి వచ్చాం' అని బాలకృష్ణ అన్నారు.

విద్యాబాలన్ మాట్లాడుతూ చారిత్రక ప్రాధాన్యత ఉన్న పాత్రలో తనకు అవకాశం రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ పర్యటనలో తొలుత గ్రామంలోని ఎన్‌టిఆర్, బసవతారకం దంపతుల విగ్రహాలకు, హరికృష్ణ ఇంటి వద్ద ఆయన చిత్రపటానికి బాలకృష్ణతో పాటు ఇతర నటులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామంలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్, సినీ నటుడు హరికృష్ణ కుమారుడు నందమూరి తారకరత్న, ఆర్టీసీ చైర్మన్ వర్ల రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్ర యూనిట్‌కు గ్రామస్తుల స్వాగతం

ఎన్‌టిఆర్ చిత్ర యూనిట్ నిమ్మకూరు వస్తోందని తెలిసి సమీప గ్రామాలకు చెంది ప్రజలు పెద్దసంఖ్యలో గ్రామానికి విచ్చేశారు. ఈ పర్యటనలో బాలయ్య ఎన్‌టిఆర్ గెటప్‌లో పంచకట్టులో నిమ్మకూరులో పర్యటించారు. దీంతో అభిమానులు జై బాలయ్య అంటూ నినాదాలు హోరెత్తించారు. గ్రామస్తులు సాదర స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో 11.30 గంటలకు గ్రామానికి చేరుకున్న చిత్ర యూనిట్ 2 గంటలకు తిరిగి వెళ్లింది.





దేశభక్తే నా శక్తి



బాలీవుడ్‌లో రాజకీయ చిత్రాలు వరుస కడుతున్నాయి. నిన్ననే మాజీ ప్రధాన మంత్రి మన్మోహన్ సింగ్ జీవితం ఆధారంగా రూపొందుతోన్న సినిమా ట్రైలర్‌ను ఆవిష్కరించారు. 'ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' అనే టైటిల్‌తో ఆ చిత్రం రాబోతుంది. నవాజుద్దీన్ సిద్ధిఖీ మన్మోహన్‌గా చేస్తున్నారు. ఆ తర్వాత శివసేన స్థాపకుడు బాలథాక్రే జీవితం వెండితెరపై చూపించబోతున్నారు. 'థాక్రే' పేరుతో కొత్త చిత్రం రూపొందుతోంది. బీజేపీ నేత, నటుడు అనుపమ్ ఖేర్ టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈ చిత్రాలు ఇప్పుడు వివాదాస్పదం అయ్యాయి. తాజాగా ప్రస్తుత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ బయోపిక్‌ను కూడా తెరకెక్కిస్తున్నారు. దానికి 'పీఎం నరేంద్ర మోడీ' అనే టైటిల్‌తో రూపొందిస్తున్నారు. వివేక్ ఒబెరాయ్ మోడీగా చేస్తున్నారు. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను సోమవారం వివేక్ తన ట్విట్టర్ ఖాతా ద్వారా విడుదల చేశారు. ప్రార్థన చేస్తున్నప్పుడు మోడీ నిలబడి ఉన్నట్టు, వెనుక జాతీయ జెండా రెపరెపలాడుతున్నట్టుగా, అతని ముందు భారీ సంఖ్యలో జనం కనిపిస్తున్నారు. మోడీకిపైన దేశభక్తే నా శక్తి అని రాసుంది. ఈ పోస్టర్‌ను మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ విడుదల చేశారు. ఈ చిత్రం 23 భారతీయ భాషల్లో రూపొందుతోంది.ఫస్ట్‌లుక్‌ను ఎనిమిది భాషల్లో విడుదల చేశారు. ఈ చిత్రానికి ఒమాంగ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ బయోపిక్ తీయడం కోసం మోడీ జీవితం గురించి ఈ దర్శకుడు మూడేళ్లుగా పరిశోధన చేశారు. వివేక్ ఒబెరాయ్ తండ్రి సురేశ్ ఒబెరాయ్, సందీప్ సింగ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

విజయమ్మగా అశ్రిత

వైఎస్ రాజశేఖర్ రెడ్డి జీవిత చరిత్ర ఆధారంగా తెరకెక్కుతోన్న చిత్రం 'యాత్ర'. ఈ సినిమా విడుదలకు ఇంకా నెలరోజుల సమయం మాత్రమే ఉండడంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచారు చిత్ర యూనిట్. అందులో భాగంగా చిత్ర ట్రైలర్‌ను సోమవారం విడుదల చేశారు. దానితో పాటు విజయమ్మ లుక్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో సపోర్టింగ్ యాక్టర్ ఆశ్రిత వేముగంటి విజయమ్మ పాత్రలో నటిస్తుంది. ఆమె లుక్ ఆ పాత్రకు కరెక్ట్‌గా సెట్ అయ్యిందని చిత్ర యూనిట్ చెబుతోంది. మహి వి. రాఘవ్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో మలయాళ నటుడు మమ్ముట్టి వైఎస్ పాత్రలో నటిస్తున్నారు. జగపతిబాబు, పోసాని కృష్ణ మురళి, సుహాసిని, అనసూయ ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. 70ఎమ్ఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డిలు సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 8న విడుదలకానుంది.




ముగ్గురన్నదమ్ములు ఒకే తెరపై



దక్షిణాది చలనచిత్రరంగంలో సాయికుమార్ సోదరులకు ప్రత్యేక గుర్తింపు ఉంది. కన్నడలో ముగ్గురు సోదరులు పలు చిత్రాల్లో నటించారు. డైలాగ్ కింగ్‌గా పేరుగాంచిన సాయికుమార్ తన తమ్ముళ్లిద్దరితో కలిసి తొలిసారి వెండితెరను పంచుకోనున్నారు. సోదరులు రవి శంకర్, అయ్యప్పతో కలిసి ఒకే ఫ్రేమ్‌లో కనిపించనున్నారు. సాయి కుమార్‌కు ఉత్తరాదిలో మంచి గుర్తింపు ఉంది. రవి శంకర్ గురించి కొత్తగా పరిచయం అవసరం లేదు. ఆయన నటుడిగా, డబ్బింగ్ ఆర్టిస్టుగా తెలుగు ప్రజలకు సుపరిచితులు. 'అరుంధతి'లో 'బొమ్మాలి..' అంటూ విలన్ తన వాయిస్‌తో భయపెట్టింది రవి గొంతే. అలాగే అయ్యప్ప కూడా తెలుగులో నటించారు. ఇటీవల 'బాహుబలి', 'కాటమరాయుడు', 'కేజీఎఫ్' సినిమాల్లో అయ్యప్ప కనిపించారు. కెజిఎఫ్ మంచి సక్సెస్ అయింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము 'భరాటే' అనే కన్నడ సినిమాలో నటిస్తున్నట్లు చెప్పారు. శ్రీమురళి హీరోగా చేతన్ కుమార్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న ఈ సినిమాలో ముగ్గురివీ ముఖ్యపాత్రలే.

'నిన్ను తలచి' సరికొత్త కథ



వంశీ, స్టెఫీ పాటెల్ హీరో హీరోయిన్లుగా పరిచయమవుతోన్న చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకత్వం. నేదురుమల్లి, అజిత్ రెడ్డి నిర్మిస్తున్నారు. చిత్రీకరణ ముగించుకుని నిర్మాణానంతర పనులు జరుపుకుంటోంది. సోమవారం ఈచిత్ర ఫస్ట్‌లుక్‌ను హైదరాబాద్‌లో విడుదల చేశారు. కొత్తవారితో యూత్‌ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ చిత్రం తీశామని నిర్మాత అజిత్ అన్నారు. దర్శకుడు అనిల్ మాట్లాడుతూ 'ప్రేమకథలు, యూత్ చిత్రాలు చాలానే వచ్చాయి. కానీ ఈ చిత్రంలో సరికొత్త అంశాన్ని టచ్ చేశాం. షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటుంది. ఫిబ్రవరిలో సినిమాని విడుదల చేయడానికి ప్లాన్ చేస్తున్నామ'ని అన్నారు. సంగీత దర్శకుడు పూర్ణచారి మాట్లాడుతూ 'టైటిల్‌కు తగినట్లే సంగీతభరిత చిత్రమిది. టైటిల్‌కు మంచి స్పందన వచ్చింది. సాహిత్యం కుదిరింది. ప్రేమకథలో కొత్త చిత్రమవుతుందనే నమ్మకముంద'ని పేర్కొన్నారు.

ఆ స్వేచ్ఛ సినిమాకుంది



'ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' ట్రైలర్ విడుదలయ్యాక కాంగ్రెస్ నేతలంతచొదొక ప్రాపగాండగా పేర్కొంటే...సినిమా అనేది ప్రజాస్వామ్యం. ఏ విషయాన్ని అయినా చెప్పుకునే స్వేచ్ఛ ఉంటుందని ఆ చిత్రంలో ప్రియాంక పాత్రధారి ఆహానా కుమార్ చెప్పింది. ఈ చిత్రం మన్మోహన్ సింగ్ జీవితంపై తీశారు. మన్మోహన్‌గా అనుపమ్ ఖేర్ నటించారు. మన్మోహన్ ప్రధానిగా ఉన్నప్పుడు అతనికి మీడియా సలహాదారుడిగా పని చేసిన సంజయ్ బారు రాసిన 'ది యాక్సిడెంటల్ ప్రైమ్‌మినిస్టర్' పుస్తకం ఆధారంగా రూపొందుతోంది. ఈ చిత్రం ట్రైలర్ విడుదలైన సందర్భంగా ఆహానా కుమార్ మాట్లాడుతూ "సినిమా అనేది కచ్చితంగా ప్రజాస్వామ్యం. ఏదైనా చెప్పే స్వేచ్ఛ ఉంటుంది. దాన్ని సినిమాలోనే నేను అనుసరిస్తాను. సినిమాను చూడాలా? లేదా? అన్నది మీ చేతుల్లో ఉంది. ఏదో ఒక పక్షాన్ని నిలిచే ఈ సినిమా ఉందని నేను అనుకోవడం లేదు. షూటింగ్‌లో నాకు అలా ఏమీ అనిపించలేదు" అని చెప్పింది.

రాజ్ కందుకూరి తనయుడు హీరోగా

ఇటీవల 'పెళ్లి చూపులు', 'మెంటల్ మదిలో' చిత్రాలని నిర్మించి నేషనల్ అవార్డ్, ఫిల్మ్ ఫేర్ అవార్డులని పొందిన నిర్మాత రాజ్ కందుకూరి. ఇప్పుడు ధర్మపథ క్రియేషన్స్‌పై ఆయన కుమారుడు శివ కందుకూరిని హీరోగా పరిచయం చేయబోతున్నాడు. శివ కందుకూరి అమెరికాలో చదువు పూర్తి చేసుకుని ఈ మధ్యే ఇండియాకి వచ్చారు. అలాగే, ఇంతకు ముందు ప్రముఖ దర్శకులు సుకుమార్, క్రిష్ వద్ద అసిస్టెంట్ డైరెక్టర్‌గా పని చేసిన శేష సింధురావ్‌ని దర్శకురాలుగా పరిచయం చేస్తున్నారు. గోపీ సుందర్ సంగీతం అందిస్తున్నారు. తమిళంలో ఇటీవలే విడుదలై విజయం సాధించిన '96' చిత్రం ఫేమ్ వర్ష బొల్లమ్మ కథానాయికగా తెలుగులో పరిచయం కాబోతున్నారు. 'మహానటి' చిత్రానికి స్క్రీన్‌ప్లే, మాటలు అందించిన పద్మావతి విశ్వేశ్వర్ దర్శకురాలితో కలిసి కథ, స్క్రీన్‌ప్లే, మాటలు అందిస్తున్నారు. రవితేజ గిరజాల ఈ చిత్రానికి ఎడిటర్. వేద రామన్ సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాతలు దగ్గుబాటి సురేష్ బాబు, మధుర శ్రీధర్ ఈ చిత్ర నిర్మాణంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారు.



'ఇస్మార్ట్ శంకర్'కు మణిశర్మ





రామ్ పోతినేని హీరోగా పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తున్న 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకు మణిశర్మ సంగీతం అందించనున్నారు. ఆరోసారి వీళ్ళిద్దరూ కలిసి పని చేయబోతున్నారు. గతంలో పూరీ జగన్నాథ్, మణిశర్మ కలిసి పని చేసిన ఐదు సినిమాలు మ్యూజికల్ హిట్స్‌గా నిలిచాయి. ఈ ఇద్దరూ చివరగా 'టెంపర్'కు కలిసి పనిచేశారు. అది బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఇక రామ్ హీరోగా మణిశర్మ కాంబినేషన్లో వస్తున్న తొలి సినిమా ఇదే. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి రాజ్ తోట సినిమాటోగ్రఫీ అందిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన ఫస్ట్‌లుక్ పలువురిని ఆకర్షించింది. చిత్ర రెగ్యులర్ షూటింగ్ ఈనెలాఖరులో మొదలు కానుంది. పూరీ జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరీ కనెక్ట్స్ నిర్మాణ సంస్థలపై దర్శకుడు పూరీ జగన్నాథ్, ఛార్మి కౌర్ సంయుక్తంగా ఈ సినిమాను నిర్మిస్తున్నారు.



ఫ్యాన్స్ కోసమే 'పేట'

ఆ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకలో అనిరుధ్

"పేట' సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న నిర్మాత అశోక్‌కు ధన్యవాదాలు. ఈ సినిమా రజని ఫాన్స్ కోసమే. ఆయన ఇరగదీశారు. ఇంత మంచి అవకాశం ఇచ్చిన కార్తీక్‌కి కృతజ్ఞతలు. తమిళపరంగానే కాకుండా తెలుగులో చక్కటి అర్థాన్నిచ్చేలా సాహిత్యాన్ని సమకూర్చిన గీతరచయితలకు ప్రత్యేక అభినందనలు. నా గత చిత్రాలను తెలుగులో ఆదరించారు. ఇక ఈ సినిమా అందరికీ నచ్చుతుంది. థియేటర్లలో బాగా ఎంజాయ్ చేస్తార'ని సంగీత దర్శకుడు అనిరుధ్ రవిచందర్ చెప్పారు. రజనీకాంత్ నటించిన చిత్రమిది. సిమ్రాన్, త్రిష కథానాయికలు. ఈనెల 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా ప్రీ రిలీజ్ కార్యక్రమం హైదరాబాద్‌లో జరిగింది.

శ్రీకాంత్ మాట్లాడుతూ 'నవాబ్, సర్కార్ లాంటి సూపర్ హిట్ సినిమాలను రిలీజ్ చేసిన నిర్మాత వల్లభనేని అశోక్‌కి రజినీకాంత్ సినిమా వాటికన్నా పెద్ద హిట్ అవ్వాలని కోరుతున్నాను. పెద్ద పెద్ద సినిమాలతో పోటీపడుతూ సంక్రాంతికి వస్తున్న ఈ సినిమా బాగా ఆడాలి. మా ఆర్టిస్టులందరికీ రజనీకాంత్ స్ఫూర్తి' అని తెలిపారు.

గీత రచయిత రామజోగయ్య శాస్త్రి మాట్లాడుతూ 'రజనీకాంత్ సినిమాకు పాటలు రాసే అవకాశం వచ్చినందుకు చాలా ఆనందంగా ఫీల్ అవుతున్నాను. అయన పాటల్లో మంచి మెసేజ్ ఉంటుంది. ఈ సినిమాలో కూడా నేను మంచి పాట రాసినందుకు గొప్పగా ఫీల్ అవుతున్నాను. ఎంతో ఉత్సాహంతో పాట రాశాను. మంచి సంతృప్తి కలిగించింద'ని పేర్కొన్నారు.

చిత్ర దర్శకుడు కార్తీక్ సుబ్బరాజ్ మాట్లడుతూ 'నామొదటి సినిమా 'పిజ్జా' కోసం హైదరాబాద్ వచ్చాను. మళ్ళీ రజనీకాంత్ సినిమాకు రావడం ఆనందంగా ఉంది. సినిమా చాలా బాగుంటుంది. ఫ్యామిలీ ఓరియెంటెడ్, యాక్షన్ ఫిలిం ఇది. మీ అందరు ఈ సినిమాను చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. మంచి సినిమాని ప్రేక్షకులు ఎప్పుడు ఆదరిస్తారనే నమ్మకం ఉంద'ని అన్నారు.

నిర్మాత వల్లభనేని అశోక్ మాట్లాడుతూ 'సినిమా థియేటర్ల విషయంలో చాలా మంది నన్ను ఇబ్బంది పెడుతున్నారు. వాళ్లకు ఈ సినిమా హిట్‌తో బుద్ధి చెప్పాలనుకుంటున్నాను. దయచేసి ఈ సమస్యను పరిష్కరించాలని కేసీఆర్‌ని కోరుకుంటున్నాను' అని అన్నారు. ఛాంబర్ మాజీ కార్యదర్శి ప్రసన్నకుమార్ మాట్లాడుతూ 'సింహం సింగిల్‌గా వస్తుంది. ఎందరు సినిమాకు థియేటర్లు ఇవ్వకపోయినా సింహం మింగేస్తుంది. ఇకనైనా మనుషులుగా మారండని అడ్డుకుంటున్న వారినుద్దేశించి మాట్లాడారు. ఇక సినిమా పరంగా చెప్పాలంటే 'విజయ్‌సేతుపతి హీరోగా చేస్తున్నా. రజనీకాంత్‌తో చేయాలనే ఇందులో తను విలన్‌గా నటించాడు. సినిమాను ప్రేమించే పెద్ద తారాగణం నటించిన ఈ చిత్రం విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

దర్శకుడు వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ 'టాలీవుడ్‌లో థియేటర్ల సమస్య ఉన్నా కూడా అలాంటి టైంలో స్టార్ కాస్ట్‌ని, సినిమా పట్ల ఇష్టంతో సినిమాలు రిలీజ్ చేస్తూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు. ఆయన చేసిన పెద్ద సాహసం ఇది. ఈ సినిమాతో పూర్వపు రజనీకాంత్‌ని చూస్తున్నాను అనుకుంటున్నాను. కార్తీక్ సుబ్బరాజు ఆయన్ని బాగా ప్రజెంట్ చేశారు. అందరూ కథను నమ్మి సినిమా చేసేవాళ్ళు. అలాంటి వాళ్లను ఈ సినిమాకు ఒప్పించడమంటే అక్కడే సినిమా సూపర్ హిట్ అని అర్థమవుతుంద'ని అన్నారు.





శరీరంలోని అన్ని అవయవాలకన్నా కళ్లు అతి ముఖ్యమైనవి. కంటిచూపు సరిగ్గాలేకపోతే.. చుట్టూ ఉన్న పరిసరాలను, ఎదురుగా ఉన్న దేనినీ చూడడానికి వీలుకాదు. అందుకే మిగిలిన అన్ని అవయవాలూ సక్రమంగా పనిచేస్తూ కూడా కంటిచూపు సరిగా లేకపోతే అదొక పెద్ద ఆరోగ్య సమస్యగానే భావించాలి. శరీరంలో అతి సున్నితమైన అవయవాలూ కళ్లే. జీవితంలో ఏదో ఒక సందర్భంలో కళ్లకు ఏదో ఒక సమస్య ఎదురుకావచ్చు. కొన్ని చిన్న సమస్యలైతే, కొన్ని కంటిచూపును దెబ్బతీసేవీ ఉంటాయి. అందుకే వీటి గురించి తగినంత అవగాహన కలిగి ఉంటే.. కంటిచూపును కాపాడుకోవచ్చు. కళ్లకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలు, వాటిని ఎలా అధిగమించాలో ఈ వారం 'డాక్టర్ స్పెషలిస్ట్'లో తెలుసుకుందాం!



కంటిచూపు చెబుతుంది మన ఆరోగ్యాన్ని!

కళ్లు సరిగా పనిచేస్తుంటేనే ఎవరైనా కళకళలాడుతూ కనిపిస్తారు. అప్పుడే పుట్టిన పసిపాప నుంచి వృద్ధుల వరకూ ఎవరికైనా కళ్లల్లోనే జీవం చైతన్యం రూపంలో తొణికిసలాడుతుంటుంది. కళ్లకు వచ్చే ఆరోగ్య సమస్యలు ఎన్నో రకాలు. కళ్లపై ఒత్తిడి నుంచి, శాశ్వతంగా చూపుని దూరం చేసే గ్లకోమా వరకూ ఇవి ఉన్నాయి. కళ్ల వ్యాధులకు రకరకాల కారణాలున్నాయి. కొన్ని పుట్టుకతో వచ్చేవైతే, మరికొన్ని జీవనశైలి వల్ల, వాతావరణ కాలుష్యం వల్ల, అలర్జీల వల్ల, వయసు పెరగడంతో వచ్చేవి.



ఒత్తిడితో కళ్లు అలసిపోతే ..

మనమంతా ఇప్పుడు డిజిటల్ యుగంలో ఉన్నాం. స్మార్ట్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఎల్ఇడీ స్క్రీన్లు, భారీ లైటింగులు ఇలా ఒకటేమిటి ఎటువైపు చూసినా అన్నీ కళ్లపై ఒత్తిడిని పెంచుతున్నవే. అంతేకాదు ఎక్కువ దూరం వెళ్లడానికి చాలా సమయం పాటు డ్రైవింగ్ చేయడం కూడా కంటిపై ఒత్తిడి పెంచుతుంది. అన్నేసి గంటల పాటు విరామం లేకుండా చూస్తూ ఉండడం వల్ల కళ్లు బాగా అలసిపోతాయి. దాంతో వాటికి విశ్రాంతి అవసరం. కానీ, వీటికి విశ్రాంతినిచ్చేవాళ్లు అరుదుగా ఉంటున్నారు. అధికశాతం మంది తమ కళ్లు ఎంత అలసిపోతున్నా, విశ్రాంతిని కోరుకుంటున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదు. కళ్లు అలసిపోయినప్పుడు కలిగే లక్షణాలను గమనించి, తగిన విశ్రాంతి వంటి జాగ్రత్తలు తీసుకోకుండా రకరకాల కళ్లద్దాలు కొనుక్కుని, కళ్లని మరింత పనిచేయిస్తూ వాటిపై ఒత్తిడిని పెంచుతున్నారు. అలా చేయకుండా ఈ సమస్య ఎదురైతే నేత్రవైద్యుడిని సంప్రదించాలి.

కళ్లల్లో ఎరుపుదనం

చూడడానికి తెల్లగా మధ్యలో నల్లని కనుపాపతో కనిపిస్తున్నా కంటి ఉపరితలం అంతా రక్తనాళాలతో నిండి ఉంటుంది. కళ్లు ఏదైనా అసౌకర్యానికి గానీ, ఇన్ఫెక్షన్‌కు గానీ గురయినప్పుడు ఈ రక్త నాళాల పరిమాణం పెరిగిపోతుంది. దాంతో కళ్లు ఎర్రబారిపోతాయి. కంటిపై ఒత్తిడి వల్ల కూడా కొన్ని సందర్భాల్లో రక్త నాళాల పరిమాణం పెరిగిపోయి, కళ్లు ఎర్రగా మారుతుంటాయి. తగినంత నిద్ర లేకపోవడం, అలర్జీలు, గాయాలకు గురైనా ఈ లక్షణం కనిపిస్తుంది. కంజెంక్టివైటిస్ అనే మరో సమస్య కూడా కళ్లని ఎర్రగా మారుస్తుంది. సుదీర్ఘకాలంపాటే సూర్యకిరణాల తాకిడికి గురైన వారిలోనూ ఈ సమస్య కనిపిస్తుంది. అందువల్ల కళ్లు బాగా ఎరుపురంగుకు మారితే సమస్య ఏమిటన్నది తెలుసుకుని, వెంటనే చికిత్స పొందడానికి నేత్రవైద్య నిపుణుడిని సంప్రదించాలి.

మెల్ల కన్ను

కొంతమందికి తాము చూస్తున్న సమయంలో కళ్లు రెండూ ఒకే కోణంలో ఉండవు. ఈ సమస్యను మెల్లకన్ను అంటారు. ఈ సమస్య ఉన్న వారి కళ్లు వారి నియంత్రణలో ఉండకుండా అసంకల్పితంగా అటూ ఇటూ కదులుతుంటాయి. కొంతమందిలో పుట్టుకతోనే ఈ సమస్య మొదలుకావొచ్చు. అయితే దీనిని సరిచేయడానికి చాలా రకాల చికిత్సలు ఉన్నాయి. విజన్ థెరపీ ద్వారా కళ్లను బలోపేతం చేయొచ్చు. కొన్ని సందర్భాల్లో పరిస్థితిని బట్టి సర్జరీ కూడా అవసరమవుతుంది. ఇది పరిష్కారం లేని సమస్య ఎంత మాత్రమూ కాదు.

రే చీకటి

రాత్రి వేళల్లోనూ, తక్కువ వెలుగున్న ప్రాంతాల్లో కొంతమందికి కంటిచూపు సక్రమంగా ఉండదు. కళ్ల ముందు ఏముందో కన్పించక ఆందోళన పడుతుంటారు. మరీ దగ్గరకు వచ్చే వరకూ ఏమీ కనిపించవు. థియేటర్‌లో దారి కనిపించకపోవడం కూడా ఇలాంటి సమస్యే. ఈ లక్షణానికి రేచీకటి, మయోపియా (దూరం చూపు సమస్య) కారణం కావచ్చు. లేదా క్యాటరాక్ట్, కెరోకోనస్, విటమిన్ ఏ లోపం వల్ల కూడా ఈ సమస్య ఏర్పడే అవకాశముంది. కొందరిలో పుట్టుకతో కూడా ఈ సమస్య ఉంటుంది. దీనికి కారణమేమిటో వైద్యులే పరీక్షల ద్వారా నిర్ధారించి, చికిత్స చేస్తారు. అయితే ఇందులో రెటీనాకు సంబంధించి మాక్యులర్ రీజెనరేటివ్ సమస్యకు చికిత్స లేదు. ఇటువంటి వారు తక్కువ వెలుగులో జీవితాంతం జాగ్రత్తలు తీసుకొని, మసలుకోవాలి.

యువెటిస్

శరీరానికి వచ్చే కొన్నిరకాల వ్యాధుల వల్ల కంటిలోపలి నల్లగుడ్డు వాపునకు దారితీస్తుంది. కంటి మధ్యలోని ఈ భాగం ఎన్నో రక్త నాళాల సమూహం. ఈ వ్యాధులు కంటి కణజాలాన్ని దెబ్బతీస్తాయి. దాంతో కంటిచూపును కోల్పోయే ప్రమాదం ఉంటుంది. ఏ వయసు వారికైనా ఈ సమస్య వచ్చిన వెంటనే తగ్గిపోతుంది. కొంతమందిలో దీర్ఘకాలం పాటు ఈ సమస్య కొనసాగొచ్చు. ఎయిడ్స్, రుమటాయిడ్ ఆర్థరైటిస్, అల్సరేటివ్ కొలైటిస్ ఎక్కువగా యువెటిస్‌కు కారణం అవుతాయి. ఈ సమస్య వస్తే చూపు మసక బారిపోవడం, కళ్లు నొప్పిగా ఉండడం, ఎర్రబారడం వంటివి కనిపిస్తాయి. ఈ లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా డాక్టర్‌ని సంప్రదించాలి. అయితే చికిత్స అనేది ఏ తరహా యువెటిస్ అనే దానిపైనే ఆధారపడి ఉంటుంది.

హ్రస్వ దృష్టి

హ్రస్వ దృష్టినే ప్రెస్బిమోపియా అంటారు. ఈ సమస్య ఉన్నవారికి దూరం చూపు బాగానే ఉన్నా, కంటికి దగ్గరగా ఉన్న వాటిని చూడడంలో కష్టంగా ఉంటుంది. సాధారణంగా 40 ఏళ్ల వయసులో ఇది ఎవరికైనా వస్తుంటుంది. ఈ సమస్యతో ఉన్నవారు చదివే సమయంలో పుస్తకాన్ని కంటికి కొంచెం దూరంగా ఉంచి, చదువుతుంటారు. రీడింగ్ గ్లాసెస్ వాడడం ద్వారా ఈ సమస్య నుంచి కొంతవరకూ బయటపడొచ్చు. కాంటాక్టు లెన్స్, లాసిక్ తరహా సర్జరీలతోనూ ఈ సమస్యకు పరిష్కారం కుదురుతుంది.



వర్ణ అంధత్వం

వర్ణ అంధత్వాన్ని కలర్ బ్లయిండ్ నెస్ అని వ్యవహరిస్తారు. కొంతమందిలో కొన్ని రకాల రంగుల్ని గుర్తించలేరు. రంగుల మధ్య తేడాని కూడా పోల్చలేరు. ఎరుపు, ఆకుపచ్చ మధ్య తేడాలను గుర్తించలేని పరిస్థితి వీరిలో అతి సాధారణం. కంట్లోని కలర్ సెల్స్ అచేతనంగా మారిపోవడం వల్ల ఈ సమస్య వస్తుంది. ఇది తీవ్రంగా ఉన్న వారికి ఆయా రంగులు కేవలం బూడిద రంగులోనే కనపడతాయి. ఈ సమస్య పుట్టుకతో రావచ్చు. లేదా కొన్ని రకాల మందులు, వ్యాధుల వల్ల కూడా దీని బారిన పడొచ్చు. మహిళల్లో కంటే పురుషుల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంటుంది. పుట్టుకతో ఈ సమస్య ఉంటే దాన్ని సరిచేయలేరు. ఆ తర్వాత ఏర్పడిన వారికి కొన్ని రకాల గ్లాసెస్‌తో తాత్కాలిక ఉపశమనాన్ని కలిగించవచ్చు.

కండ్ల కలక

దీనినే కంజెంక్టివైటిస్ అంటారు. ఈ సమస్య వస్తే కనురెప్పల వెనుకనున్న కణజాలం వాచిపోతుంది. దీంతో కళ్లు ఎర్రబారడం, దురద, మంట, నీరు కారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఏ వయసువారికైనా ఇది రావచ్చు. ఇన్ఫెక్షన్, రసాయనాల వల్ల ఇరిటేషన్‌కు గురైన సమయాల్లోనూ, అలర్జీల కారణంగా ఈ సమస్య ఎదురవుతుంది. తరచుగా చేతులను శుభ్రం చేసుకోవడం, వ్యక్తిగతమైన శుభ్రత వంటివాటితో ఈ సమస్యని దూరంగా ఉంచొచ్చు.

ఫ్లోటర్స్

చిన్న సైజులో చుక్కలు, మచ్చలు కంటి చుట్టూ కదులుతూ కన్పిస్తుంటాయి. ఎక్కువ వెలుగున్న చోట, మండే ఎండలో దీన్ని గుర్తించొచ్చు. ఇవి సహజమే అయినప్పటికీ ఒక్కోసారి తీవ్రమైన



సమస్యలకు ఇవి కారణం కావొచ్చు. రెటీనల్ డీటాచ్‌మెంట్‌లో కంటి వెనుకనున్న రెటీనా పక్కకు జరుగుంది. ఇలా జరిగినప్పుడు లైట్ ఫ్లాషెస్ కూడా కనిపిస్తుంటాయి. నీడలు కూడా వెళుతున్నట్టు అనిపిస్తుంది. ఇలా తరచుగా చుక్కలు కనిపిస్తూ వాటి సంఖ్య కూడా పెరుగుతుంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి.

కళ్లు పొడిబారడం

కళ్లు పొడిబారిపోవడాన్ని డ్రై ఐస్ అంటారు. తగినంత నీరు కళ్లలో ఉత్పత్తి కానప్పుడు ఈ సమస్య ఎదురవుతుంది. అరుదుగా ఇలా పొడిబారిపోవడం వల్ల కంటిచూపు నష్టపోయే ప్రమాదం ఉంటుంది. ప్రత్యేక ఐ డ్రాప్స్‌ను వాడడం ద్వారా సమస్యను తొలగించుకోవచ్చు. దీనికి న్యూట్రిషనల్ సప్లిమెంట్లను కూడా డాక్టర్ సలహాపై వాడుతుండాలి.

కళ్ల నుంచి నీరు కారడం

కంట్లో ఉండాల్సిన నీటి పరిమాణం తగ్గిపోవడం ఒక సమస్య అయితే, పెరిగిపోవడం కూడా సమస్యే. కాంతి, గాలి లేదా ఉష్ణోగ్రత విషయంలో సెన్సిటివ్‌గా ఉండే వారి కళ్లల్లో అధికంగా నీరు కారడం కనిపిస్తుంది. అందుకే బయటి అంశాల ప్రభావం కంటిపై పడకుండా జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా దీన్ని నివారించుకోవచ్చు.

క్యాటరాక్ట్

కంట్లో ఉండే లెన్స్ ఆరోగ్యంగా ఉంటే అవి కెమేరా కళ్లలా ఉంటాయి. బయటి దృశ్యాలకు చెందిన వెలుగు నేరుగా రెటీనాకు వెళ్లిపోవాలి. అప్పుడే చూపు బాగుంటుంది. క్యాటరాక్ట్ సమస్యలో వెలుగు అంత సాఫీగా రెటీనాను చేరదు. దీంతో చూపులో స్పష్టత తగ్గుతుంది. రాత్రి సమయాల్లో బల్బ్‌లను చూస్తున్నప్పుడు చుట్టూ వృత్తంలా కనిపిస్తుంది. ఈ క్యాటరాక్ట్ సమస్య ఒక్కసారిగా ఏర్పడదు. కొద్దికొద్దిగా పెరుగుతుంది. నొప్పి, ఎర్రబారడం, నీరు కారడం తరహా లక్షణాలేవీ ఇందులో ఉండవు. ముదిరిపోతే చూపుని కోల్పోక తప్పదు. ఈ సమస్యని సర్జరీ ద్వారా పరిష్కరించవచ్చు.

గ్లకోమా

కంటిచూపును పూర్తిగా దెబ్బతీసే సమస్య గ్లకోమా. కంట్లో కొంత ఒత్తిడి అన్నది సహజంగా ఉన్నప్పటికీ కొన్నిసార్లు అది పెరిగిపోతే ఆప్టిక్ నెర్వ్ దెబ్బతింటుంది. ఈ పరిస్థితిని కల్పించే కొన్ని వ్యాధుల సమూహమే గ్లకోమా. ఈ సమస్య బారిన పడిన వారిలో తొలి నాళ్లలో ఎటువంటి లక్షణాలూ బయటపడవు. కొన్నాళ్లకు చూపు శాశ్వతంగా పోతుంది. అందుకే ఎవరైనా సరే ఆరునెలలకు ఒకసారి నేత్రవైద్యుడిని సంప్రదిస్తుండాలి.

డయాబెటిక్ రెటినోపతి

రెటీనా సమస్యల్లో అతి తీవ్రమైనది డయాబెటిక్ రెటీనోపతి. కంటి వెనుక భాగంలో అతి పల్చని పొరే రెటీనా. ఇది కణాల కలయికతో ఉంటుంది. కంటి ముందున్న దృశ్యాలను గ్రహించి, వాటిని మెదడుకు పంపిస్తుంది. రెటీనాలో సమస్య ఏదైనా ఈ వ్యవస్థకు విఘాతం కలుగుతుంది. వయసు కారణంగా ఏర్పడే మాక్యులర్ డీజనరేషన్‌తో రెటీనా కొంతభాగం క్షీణిస్తుంది. డయాబెటిక్ రెటినోపతితో రెటీనాకు సంబంధించిన రక్తనాళాలను దెబ్బతీయడం ముఖ్యమైన కారణం. అందువల్ల మధుమేహంతో ఉన్నవారు మిగిలిన శరీరభాగాల కన్నా చాలా శ్రద్ధతో కళ్లని కాపాడుకోవాలి. షుగర్ స్థాయిలను అదుపులో ఉంచుకోవాలి.




వయసు పెరుగుతున్న కొద్దీ చూపు మందగిస్తుంటుంది. ఇది సహజం. ఈ సమయంలో కళ్లద్దాలు ధరిస్తే సరిపోతుంది. లాసిక్ తరహా సర్జరీనీ ఎంచుకోవచ్చు. ఈ సర్జరీలో చూపును చక్కదిద్దుతారు. మాక్యులర్ డీజనరేషన్, గ్లకోమా, క్యాటరాక్ట్ కారణంగా చూపులో సమస్యలు ఏర్పడతాయి. ఈ వయసులో చూపు మందగించడం సహజమే కదా.. అని ఉపేక్షించకూడదు. డయాబెటిక్ రెటినోపతి తీవ్రమైతే ఉన్న కొద్దిచూపునూ కోల్పోయే ప్రమాదం ఉంటుంది. అందువల్ల ఈ విషయంలో అప్రమత్తంగా ఉండాలి.

డాక్టర్ బి సుబ్బారావు
ఎండి (ఆఫ్తాల్మాలజీ),
ఎస్‌కె సూపర్‌స్పెషాలిటీ
లేజర్ ఐ హాస్పిటల్,
సూర్యారావు పేట, విజయవాడ.





చుక్కలు కలపండి!




పిల్లలూ! పక్కనున్న చిత్రంలోని చుక్కలను కలిపి, బొమ్మ ఏమిటో కనిపెట్టండి!

జోక్:

రాము : నా చెక్కుబుక్కు పోయింది..
సోము : దొరికినవాళ్లు నీ సంతకం పెట్టేస్తారేమో?
రాము : ఆ భయమేం లేదు, నేను అన్ని చెక్కులపై ముందే సంతకం పెట్టేశా !


పొడుపు కథ

ఈ కాయంటే తెలుగువాళ్ళకు భలే ఇష్టం, ఇది ఎర్రగా ఉంటుంది. కాని చెట్టుకు కాయదు.



జవాబు : ఆవకాయ

దారి చూపండి!



పిల్లలూ! ఈ చిత్రంలోని కుక్కపిల్ల తన ఇంటిని చేరే దారిని చూపండి.!

నవ్వుల పిల్లలం

పిల్లలనే మొక్కలకు
అక్షరాలనే నీళ్లను పోస్తే
జ్ఞానమనే పువ్వులుగా వికసిస్తాము!


పుస్తకాలనే మెట్లను దాటి
తరగతులనే భవనాలను ఎక్కి
అభివృద్ధి ఫలాలు అందుకుంటాము!

కలాలనే ఆయుధాలతో
పరీక్షలనే యుద్ధం చేసి
విజయాలను అందుకుంటాము!

గురువుల ప్రేమతో
తోటివారి స్నేహంతో
సంతోష పరిమళాలు వెదజల్లుతాము!

- తులసి
8 వ తరగతి
గురుకుల పాఠశాల
కొత్తకోట
చిత్తూరు జిల్లా





నేను గీసిన బొమ్మ

జి. అఖిల్,
8వ తరగతి,
జెడ్.పి.హెచ్. స్కూల్,
పెనుమాక,
తాడేపల్లి మండలం.





పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపాల్సిన మా చిరునామా

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ-2.
ఇ మెయిల్ -Chinnaarips@gmail.com





ఆస్ట్రేలియాపై టెస్ట్ సిరీస్ గెలిచిన తొలి ఆసియా కెప్టెన్‌గా కోహ్లీ రికార్డు

భారత్ తొలి ఇన్నింగ్స్	-662/7 డిక్లేర్డ్
ఆసీస్ తొలి ఇన్నింగ్స్	- 300
ఆసీస్ రెండో ఇన్నింగ్స్	- 6/0

21 వికెట్లతో బూమ్రా అగ్రస్థానంలో నిలిచాడు

521 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచిన పుజారా

ఏడు దశాబ్దాల కల నెరవేరింది

ఏడు దశాబ్దాల చరిత్రకు కోహ్లీ సేన ముగింపు పలికింది. దిగ్గజ సారథులకు సైతం సాధ్యం కాని ఘనతను కోహ్లీ సాధించాడు. ఇప్పటివరకూ ఆస్ట్రేలియాలో 11 పర్యాయాలు పర్యటించిన టీమిండియా 47 టెస్టుల్లో కేవలం ఏడు విజయాలను మాత్రమే నమోదు చేసుకోగల్గింది. సిడ్నీ టెస్ట్ డ్రా గా ముగియడంతో నాలుగు టెస్టుల సిరీస్‌ను టీమిండియా 2-1తో గెలిచి చరిత్ర సృష్టించింది. దీంతో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ భారత్ వశమైంది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ పుజారాకు దక్కగా, ట్రోఫీ గెల్చిన కోహ్లీ సేనకు రాష్ట్రపతి, ప్రధాని, సచిన్ శుభాకాంక్షలు తెలిపారు.

సిడ్నీ టెస్ట్ డ్రా • సిరీస్ 2-1తో కోహ్లీ సేన కైవసం
• మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, సిరీస్ పుజారా • టీమిండియాపై ప్రశంసల జల్లు

సిడ్నీ : ఆస్ట్రేలియా గడ్డపై కోహ్లీసేన చరిత్ర సృష్టించింది. బోర్డర్-గవాస్కర్ టెస్ట్ సిరీస్ ట్రోఫీని 2-1తో కైవసం చేసుకొని పలు రికార్డులు తిరగరాసింది. సిడ్నీ వేదికగా జరిగిన ఆఖరి టెస్టు చివరిరోజు ఆట వర్షం కారణంగా పూర్తిగా రద్దు కావడంతో టీమిండియా నాలుగు టెస్టుల సిరీస్‌ను 2-1 తేడాతో గెల్చుకున్నట్లయ్యింది. దీంతో కంగారూ గడ్డపై 72 ఏళ్లలో సాధ్యంకాని టెస్టు సిరీస్ విజయాన్ని కోహ్లీ సేన సొంతం చేసుకుని రికార్డు నెలకొల్పింది. ఇంతకుముందు 1980, 1985, 2002, 2004 పర్యటనల్లో మాత్రం భారత్ టెస్ట్ సిరీస్‌లను డ్రా చేసుకోగల్గింది. ఇప్పటివరకూ భారత్ 11 పర్యాయాల్లో ఆస్ట్రేలియాతో ఆడిన 47 టెస్టుల్లో కేవలం ఏడు మ్యాచ్‌లలో మాత్రమే విజయాలను నమోదు చేసుకోగల్గింది. గత ఏడాది జనవరిలో దక్షిణాఫ్రికాతో జరిగిన టెస్టు సిరీస్, ఆ తర్వాత ఇంగ్లాండ్ సిరీస్‌లలో టీమిండియా ఓడిపోయింది.

నాల్గోటెస్ట్‌లో కుల్దీప్ ఐదు వికెట్లతో విజృంభించడంతో ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 300 పరుగులకు ఆలౌటైంది. దీంతో టీమిండియాకు 322 పరుగుల భారీ ఆధిక్యత లభించింది. కోహ్లీ ఆసీస్‌ను ఫాలోఆన్‌కు ఆహ్వానించగా వెలుతురులేమితో నాలుగో రోజు ఆట నిలిచిపోయే సమయానికి ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ నష్టపోకుండా ఆరు పరుగులు చేసింది. అనంతరం ఆటకు వర్షం అంతరాయం కలిగించడంతో నాలుగో రోజు ఆట ముగిసింది. వరణుడు ఐదోరోజు కూడా కరుణించకపోవడంతో సోమవారం ఒక్క బంతి కూడా పడకుండానే ఆట తుడిచి పెట్టుకుపోయింది. ఇప్పటికే టెస్ట్ సిరీస్‌లో 2-1తో ఆధిక్యంలో ఉన్న భారత్ సిరీస్‌ను కైవసం చేసుకున్నట్లయ్యింది. ఈ సిరీస్‌లో మూడు సెంచరీలు నమోదు చేసిన భారత నయావాల్ పుజారాకు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌తో పాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్ దక్కాయి.

ఈ విజయం నాకు ప్రపంచకప్ కంటే గొప్పది : కోహ్లీ

ఆస్ట్రేలియాలో భారత్ టెస్టు సిరీస్‌ను 2-1 తేడాతో తొలిసారి చారిత్రక విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ గెలుపుతో ఆసీస్ గడ్డపై సిరీస్ విజయాన్ని నమోదు చేసిన తొలి ఆసియా కెప్టెన్‌గా విరాట్ కోహ్లీ చరిత్ర పుటల్లోకెక్కాడు. ట్రోఫీ ప్రదానోత్సవం అనంతరం కోహ్లీ మీడియాతో మాట్లాడుతూ 2011 ప్రపంచకప్ విజయం కంటే ఈ గెలుపు తనకు ఎంతో గొప్పదని కోహ్లీ పేర్కొన్నాడు. 'మా ఆటగాళ్లను చూసి నేను ఎంతో గర్వపడుతున్నా. ఇది వారి విజయమే. ముఖ్యంగా బౌలర్లు ప్రదర్శించిన ఆధిపత్యం గతంలో ఎప్పుడూ నేను చూడలేదు. ఇక్కడే కాదు ఇంగ్లాండ్, దక్షిణాఫ్రికాల్లో కూడా బౌలర్లు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ విజయం యువ జట్టుకు ఒక పునాది రాయి లాంటిది.' అని విరాట్ అన్నాడు.

టీమిండియాపై ప్రశంసల జల్లు

ఆస్ట్రేలియా గడ్డపై చారిత్రక టెస్టు విజయం దేశాన్ని గర్వపడేలా చేసింది : రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్

ఆస్ట్రేలియాలో టెస్టు సిరీస్ గెలిచిన కోహ్లీ సేన చరిత్ర సృష్టించింది : ఐసిసి

మరిచిపోలేని ఈ విజయాన్ని అందించిన టీమిండియాకు అభినందనలు. భారత్‌లోని ప్రతి క్రికెట్ అభిమాని గర్వపడుతున్నాడు. సమిష్టి కృషితోనే ఈ విజయం : వీరేంద్ర సెహ్వాగ్





కుప్పకూలిన ఆంధ్ర

ఇండోర్ : రంజీట్రోఫీ ఎలైట్ గ్రూప్-బి 9వ రౌండ్ పోటీల్లో భాగంగా సోమవారం నుంచి మధ్యప్రదేశ్‌తో ప్రారంభమైన మ్యాచ్‌లో ఆంధ్ర జట్టు కుప్పకూలింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్రప్రదేశ్ జట్టు మధ్యప్రదేశ్ బౌలర్ల ధాటికి తొలి ఇన్నింగ్స్‌లో 132 పరుగులకే పరిమితమైంది. ఓపెనర్ ప్రశాంత్ కుమార్ 29, కరణ్ శర్మ 23 పరుగులు చేశారు. ఈశ్వర్ పాండే నాలుగు, గౌరవ్ యాదవ్, కార్తికేయకు మూడేసి వికెట్లు దక్కాయి. అనంతరం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన మధ్యప్రదేశ్ జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 24 పరుగులకే మూడు వికెట్లు చేజార్చుకుంది. పటిధర్ 19 పరుగులతో క్రీజ్‌లో ఉన్నాడు. విజయ్‌కుమార్, రెడ్డి, మనీష్‌కు తలా ఒక వికెట్ దక్కాయి.

ఖేలో ఇండియా యూత్ పోటీలకు మహారాష్ట్ర ఆతిథ్యం

ముంబయి : పూణేలో జనవరి 9 నుండి ప్రారంభం కానున్న రెండో ఖేలో ఇండియా యూత్ క్రీడలకు మహారాష్ట్ర ఆతిథ్యమివ్వనుంది. షూటింగ్‌తో పాటు ఆయా క్రీడాంశాల్లో యువతలో ఉన్న క్రీడా నైపుణ్యాన్ని వెలికితీసేందుకు ఈ పోటీలు ఎంతో దోహదం చేయనున్నాయని మహారాష్ట్ర క్రీడల మంత్రి వినోద్ థాడే తెలిపారు. సోమవారం మంత్రి మాట్లాడుతూ 18 క్రీడాంశాల్లో మహారాష్ట్ర తరపున 900మంది యువ అథ్లెట్లు బరిలోకి దిగనున్నట్లు చెప్పారు. తమ రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యమిచ్చే ఈ పోటీలు పూణేలోని బలెవాడీ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్నాయని, అన్ని రాష్ట్రాలనుంచి సుమారు 14 వేల మంది ఈ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. 9 వేల మంది అథ్లెట్లతోపాటు 4 వేలమంది మేనేజర్లు, మరో వెయ్యిమంది ఇతర సహాయ సిబ్బంది రానున్నట్లు తెలిపారు. ఇటీవల జరిగిన యూత్ ఒలింపిక్స్ షూటింగ్‌లో సత్తాచాటిన మనూ భాకర్, సౌరభ్ చౌదరి, తేజశ్వరి సావంత్, రజిత మిశ్రాలు కూడా పోటీల్లో పాల్గొంటున్నట్లు చెప్పారు.

అవధే ముందుకు

బెంగళూరు : ప్రిమియర్ బ్యాడ్మింటన్ లీగ్‌లో భాగంగా సోమవారం జరిగిన పోటీల్లో అవధే వారియర్స్ జట్టు చెన్నై స్మాషర్స్‌పై 4-3తో గెలిచింది. పురుషుల డబుల్స్ ట్రంప్, సింగిల్స్ మ్యాచ్‌లో అవధే గెలిచి 3-0 ఆధిక్యత సాధించింది. మహిళల సింగిల్స్ ట్రంప్, మిక్స్‌డ్ డబుల్స్‌లో ఢిల్లీ గెలిచి 3-3తో సమంగా నిలిచింది. నిర్ణయాత్మక పురుషుల సింగిల్స్ రెండో మ్యాచ్‌లో ఎస్.డబ్ల్యు.హో (అవధే) 15-6, 15-6తో ఓసెఫ్(ఢిల్లీ)పై గెలిచి మ్యాచ్‌ను ముగించాడు. మిక్స్‌డ్ డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప-క్రిస్టియన్(అవధే) జోడీ 13-15, 15-9, 14-15 పాయింట్ల తేడాతో ఎడ్‌కాక్(ఢిల్లీ)చేతిలో అనూహ్యంగా ఓడింది.

వినతులు స్వీకరిస్తూ కొనసాగిన ప్రజాసంకల్పయాత్ర

ప్రజాశక్తి - కవిటి (శ్రీకాకుళం జిల్లా)

రాష్ట్ర ప్రతిపక్ష నేత, వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్పయాత్ర వినతులను స్వీకరిస్తూ, సమస్యలను తెలుసుకుంటూ సోమవారం సాగింది. మాణిక్యపురం శివారు నుంచి ప్రారంభమైన పాదయాత్ర మాణిక్యపురం, చిన్నబల్లిపుట్టుగ, బల్లిపుట్టుగ, కుసుమపురం, పరక, బొరివంక, బెజ్జిపుట్టుగ మీదుగా జగతి వరకూ కొనసాగింది. 10.2 కిలోమీటర్లు నడిచిన ఆయన ఇప్పటివరకూ 3,628.2 కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేశారు. పాదయాత్ర పొడవునా జగన్ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ గ్రామంలోని తాగునీటి సౌకర్యంపై అధికారులను ఎన్నోదఫాలు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఒంటూరుకు చెందిన మహిళలు వాపోయారు. తమకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో ఉన్నత విద్య, ఉద్యోగాల్లో అవకాశాలను కోల్పోతున్నామని బెంతు ఒరియాలు ఆవేదన వ్యక్తం చేశారు. తిత్లీ తుపానులో తాము నష్టపోయినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయమూ అందలేదని మత్స్యకారులు వాపోయారు. సిపిఎస్ ఉద్యోగులు జగన్ కలిసి సిపిఎస్ రద్దుకు కృషి చేయాలని కోరారు. సిపిఎస్‌ను రద్దు చేయాలనే ప్లకార్డును చేతపట్టి జగన్ కొంతదూరం ముందుకుసాగారు. విదేశాల్లో ఉండి వైసిపి కోసం పనిచేస్తున్న పలువురు ప్రవాసాంధ్రులు బల్లిపుట్టుగ వద్ద జగన్‌ను కలిశారు. పాదయాత్ర ప్రారంభంలో కవిటి ఎంపిపి కిరణ్‌కుమారి టిడిపిని వీడి జగన్ సమక్షంలో వైసిపిలో చేరారు. జగన్ సుదీర్ఘ పాదయాత్ర విశేషాలతో తాము రూపొందించిన డైరీని జగన్‌కు పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన అక్కాచెల్లెళ్లు విమల, నిర్మల బహూకరించారు.

అక్కడ వరికి ఉరి!

- బోర్లు, లిఫ్టుల కింద ఉద్యానవనాలే
- తొలిదశలో ఎన్టీయార్ జలసిరి ఆయకట్టు
- తర్వాత ఉచిత విద్యుత్ లబ్ధిదారులు
- పంట కుంటలకూ వర్తింపు
- సూక్ష్మ సేద్యంతో రైతులకు వల
- కంపెనీ సాగుకు బాట

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఎత్తిపోతల పథకాల ఆయకట్టులో, బోరు బావుల కింద రైతుల చేత వరి సాగును బలవంతంగా మాన్పించాలని చంద్రబాబు సర్కారు ఒక విధానం కింద తీసుకుంది. ఆయా ప్రాంతాల్లో క్రమంగా వరి సాగు నుంచి ఉద్యానవనాల వైపునకు రైతులను మళ్లించేందుకు అనుగుణంగా ప్రత్యేక ప్రణాళికలు రచించింది. తన విధాన లక్ష్యాన్ని చేరుకునేందుకు సూక్ష్మ సేద్యం (మైక్రో ఇరిగేషన్) విస్తరణను పక్కా వ్యూహంతో చేపట్టింది. సూక్ష్మ సేద్యం విస్తరణకు ఎత్తిపోతల పథకాల (లిఫ్ట్ ఇరిగేషన్) ఆయకట్టును గుర్తించింది. అలాగే ప్రభుత్వం ఇచ్చే ఉచిత విద్యుత్‌తో బోరు బావుల కింద వ్యవసాయం చేస్తున్న రైతులను ఎంపిక చేసుకుంది. గతంలోని ఇందిర జలప్రభ స్కీంను కాస్తా ఎన్‌టిఆర్ జలసిరిగా పేరు మార్చిన సర్కారు, దాని లబ్ధిదారులైన ఎస్‌సి, ఎస్‌టి రైతులకు సాగు నిమిత్తం సబ్సిడీపై బోరు బావులను మంజూరు చేస్తోంది. వాటి ఆయకట్టు పరిధిలో మైక్రో ఇరిగేషన్‌ను ప్రవేశపెట్టి తద్వారా వరికి బదులు ఉద్యానవన పంటలను, పండ్ల తోటలను పండించేందుకు ఎత్తు వేసింది. లిఫ్టులు, బోర్లు ఎక్కువగా రాయలసీమ జిల్లాల్లో, రాష్ట్రంలోని ఇతర మెట్ట ప్రాంతాల్లోనే ఉన్నాయి. అక్కడి రైతులకు అందివచ్చిన కొద్దిపాటి నీటి వనరులను తిండి గింజల సాగు కోసం కాకుండా కార్పొరేట్ల అవసరాలకనుగుణంగా తోటలు పెంచాలంటోంది సర్కారు.

25 లక్షల హెక్టార్లు

రాష్ట్రంలో 25 లక్షల హెక్టార్లను సూక్ష్మ సేద్యం కిందకు తీసుకొచ్చేందుకు అవకాశాలు మెండుగా ఉన్నాయని ఉద్యానవన శాఖ ప్రణాళికలు రూపొందించింది. ఉచిత విద్యుత్ ఆధారిత బోరు బావులు 13.23 లక్షలు ఉండగా, వాటి కింద 21.44 లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణం ఉందని పేర్కొంది. రాష్ట్రం మొత్తమ్మీద 1,196 లిఫ్ట్ ఇరిగేషన్ స్కీంల కింద 2.80 లక్షల హెక్టార్ల ఆయకట్టు ఉందని తెలిపింది. 'ఎన్‌టిఆర్ జలసిరి' పథకాల కింద 80 వేల హెక్టార్లు సాగవుతున్నాయని తేల్చింది. ఇదంతా కలిపితే 25 లక్షల హెక్టార్లవుతుందని, ఈ ఆయకట్టులో ఉద్యానవన పంటలను మాత్రమే సాగు చేయించాలని సూత్రప్రాయంగా నిర్ణయించింది. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు అమల్లోకొచ్చిన ఇన్నేళ్లల్లో 11.57 లక్షల హెక్టార్లను బిందు (డ్రిప్), స్ప్రింక్లరు (తుంపర్లు) సేద్యం కిందకు తెచ్చారని, ఇంకా 13.47 లక్షల హెక్టార్లలో మైక్రోను ప్రవేశపెట్టాల్సి ఉందని పేర్కొంది. సూక్ష్మ సేద్యాన్ని అమలు చేసే క్రమంలో ఉచిత విద్యుత్ వాడుకునే బోరు బావుల రైతులను, ఎన్‌టిఆర్ జలసిరి లబ్ధిదారులను, ఎత్తిపోతల పథకాల పరిధిలోని రైతులను లక్ష్యంగా చేసుకోవాలని కలెక్టర్లను ఆదేశించింది. వేలాదిగా రైతుల పొలాల్లో తవ్విన పంట కుంటలకు సైతం సూక్ష్మసేద్యాన్ని అనుసంధానం చేయాలంది. అన్ని జిల్లాల్లోనూ వరిని మైక్రో ఇరిగేషన్ కిందకు తెచ్చేందుకు పైలెట్ ప్రాజెక్టులను అమలు చేయాలని ప్రతిపాదించింది. మొత్తంగా ఈ ఏడాది 2.4 లక్షల హెక్టార్లలో మైక్రో ఇరిగేషన్ అమలుకు టార్గెట్ విధించింది.



ఉద్యానవనాల లక్ష్యం

వివరం	ఆయకట్టు లక్షల హెక్టార్లు
బోరు బావులు	21.44
ఎత్తిపోతలు	2.80
ఎన్‌టిఆర్ జలసిరి	0.80
మొత్తం	25.04

రాయితీల ఎర

ప్రభుత్వం తొలుత రైతులకు కొద్దిపాటి రాయితీలిచ్చి సూక్ష్మ సేద్యాన్ని పొలాల్లో ప్రవేశపెడుతోంది. ఆపై క్రమంగా ఉద్యానవనాల సాగును బలవంతంగా రైతులపై రుద్దుతోంది. అందుకు జల సంరక్షణ, తక్కువ నీటితో లాభదాయక సేద్యం అని ముద్దు మాటలతో నమ్మబలుకుతోంది. వ్యవసాయంలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి) పద్ధతిని తీసుకొస్తామని సర్కారు ఎప్పుడో ప్రకటించింది. అందులో భాగంగా రైతు ఉత్పత్తిదారుల సంఘాల (ఎఫ్‌పిఓ)లను నెలకొల్పి దద్వారా రైతులను సమీకరించి కార్పొరేట్ కంపెనీలకు, రైతులకు మధ్య ఒప్పందాలు కుదుర్చుతోంది. సూక్ష్మ సేద్యం ముసుగులో కంపెనీలకు లాభాలు తెచ్చిపెట్టే ఎగుమతి ఆధారిత పంటలను రైతులతో సాగు చేయించేందుకు ప్రణాళిక వేసింది.



టోనీ బ్లెయిర్‌కి జ్ఞాపికను అందజేస్తున్న సిఎం చంద్రబాబు

ఇలాంటి విధానం ఎక్కడా లేదు

- ఆర్టీజిఎస్‌కు బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ ప్రశంస
- సచివాలయంలో గంటసేపు గడిపిన టోనీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వెలగపూడి సచివాలయంలోని ఆర్టీజిఎస్ కేంద్రాన్ని బ్రిటన్ మాజీ ప్రధాని టోనీ బ్లెయిర్ సోమవారం సాయంత్రం సందర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనకు ఆహ్వానం పలికారు. టోనీకీ, తనకూ మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ఆర్టీజిఎస్ పనితీరు గురించి టోనీ బ్లెయిర్‌కు సిఎం వివరించారు. విభజన తర్వాత నవ్యాంధ్రలో అన్ని రంగాల్లో కింది స్థాయి నుంచి మొదలు పెట్టుకోవాల్సిన వచ్చిందని టోనికి వివరించారు. ఈ సందర్భంగా టోనీ బ్లెయిర్ మాట్లాడుతూ ఆర్టీజిఎస్ లాంటి విధానం ప్రపంచంలో ఎక్కడా లేదని టోనీ ప్రశంసించారు. రాష్ట్రంలో ఇ-ఆఫీసును ప్రవేశ పెట్టినట్లు ఆయనకు సిఎం వివరించారు. బయోమెట్రిక్ ప్రవేశపెట్టామని, ప్రధానంగా పాఠశాలల్లో ఫలితాలనిస్తోందని తెలిపారు. పరిపాలనకు సంబందించి ఏపీ క్లౌడ్ హబ్, బిగ్ డేటా సెంటర్‌ను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ విభాగంలో ఇద్దరు సాంకేతిక నిపుణులతో సంప్రదింపులు జరిగాయని, కంటెంట్ నాలెడ్జ్ కూడా ఏర్పాటు చేస్తున్నామని చంద్రబాబు టోనీకి వివరించారు. భూగర్భజలాలు, రిజర్వాయర్ల సామర్థ్యం, వర్షపాతం, గాలి సాంద్రత, వాతావరణంపై రియల్ టైం సమాచారాన్ని సేకరిస్తున్నట్లు సిఎం వివరించారు. వ్యవసాయరంగం సాగులోనూ ఆర్టీజిఎస్‌ను ఉపయోగిస్తున్న తీరును వ్యవసాయ శాఖ కార్యదర్శి రాజశేఖర్ వివరించారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో ఇరవై వేల సిసి కెమెరాల ఏర్పాటుపై టోనీ బ్లెయిర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. నాలుగు వేల ప్రభుత్వ పాఠశాలల్లో వర్చువల్ తరగతి గదుల ఏర్పాటు గురించి టోనీకి సిఎం వివరించారు. ఆర్టీజిఎస్ సందర్శకుల పుస్తకంలో టోనీ బ్లెయిర్ సంతకం చేశారు. దాదాపు గంట సేపు సచివాలయంలో టోనీ బ్లెయిర్ గడిపారు. టోనీ బ్లెయిర్‌ను కలిసిన వారిలో మంత్రులు లోకేశ్, పుల్లారావు, నక్కా ఆనందబాబు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అనిల్ చంద్ర పునేఠా, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి సతీష్‌చంద్ర, ఆర్టీజిఎస్ సిఇవో అహ్మద్‌బాబు తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ చార్జీలపై బహిరంగ విచారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విద్యుత్ టారిఫ్ 2019-20కు సంబంధించిన టారిఫ్ నిర్ణయానికి సంబంధించిన బహిరంగ ప్రజాభిప్రాయ సేకరణ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఎపిఈఆర్‌సి) మంగళవారం నిర్వహించనుంది. విజయవాడలోని పిడబ్ల్యుడి గ్రౌండ్ వద్ద నున్న విద్యుత్ కార్యాలయంలో ఈ కార్యక్రమం జరగనుంది. 2019-20 ఏడాదికి రూ.38,204కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేయగా, విద్యుత్ చార్జీలు ద్వారా రూ.29,241కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. సుమారు రూ.8,963వేల కోట్ల రెవెన్యూ లోటుగా నియంత్రణ మండలి చూపిస్తోంది. దీనిపై నేడు బహిరంగ విచారణ జరపనుంది. ఈ నెల 9న తిరుపతిలో జనవరి 18,25 తేదిల్లో, అలాగే ఫిబ్రవరి 1 హైదరాబాద్‌లో ప్రజాభిప్రాయ సేకరణను నియంత్రణ మండలి నిర్వహించనుంది.

కేంద్ర ప్రాయోజిత పథకాల నిధులపై ప్రత్యేక దృష్టి

శాఖలతో ఎపి భవన్ అనుసంధానం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

కేంద్రం నుంచి వచ్చే నిధులపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఇటీవల జరిగిన కార్యదర్శుల సమీక్ష అనంతరం కొన్ని కీలక నిర్ణయాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పునేఠా, రెవెన్యూ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి మన్మోహన్‌సింగ్‌లు అన్ని శాఖలకు సర్క్యులర్లు జారీ చేశారు. పలు అంశాలపై తీసుకున్న చర్యలను వివరిస్తూ ఈనెల 11 లోగా నివేదికలు పంపించాలని నిర్దేశించారు.

కేంద్రం నుంచి రావాల్సిన నిధులు, ఇప్పటివరకు వచ్చిన నిధులపై ఆర్థిక శాఖ ఒక నివేదిక తయారుచేయాలని, దాని ఆధారంగా అన్ని శాఖలూ ఢిల్లీలోని ఎపి భవన్ అధికారులతో సమన్వయం చేసుకుని, కేంద్రం నుంచి అదనపు నిధులొచ్చేలా ప్రయత్నించాలని వారు సూచించారు. త్వరలోనే ముఖ్యమంత్రి కూడా ఇదే అంశంపై సమీక్షించనున్నారని వారు వివరించారు. అలాగే సేవా రంగంలో వృద్ధిని పెంచేందుకు ఏర్పాటుచేసిన కమిటీతో మూడో వారంలో సమీక్షించాలని నిర్ణయించారు. దీనికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా సిద్ధం చేయాలని వారు ఆదేశించారు. పౌర సరఫరాల శాఖపై ప్రజలలో పెరుగుతున్న అసంతృప్తిపైనా వారు స్పందిస్తూ అసంతృప్తిని తగ్గించే చర్యలపై ఆర్టీజి అమలు చేస్తున్న విధానాలను ఇంకా కొనసాగించాలని పలు దఫాలుగా వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలని సూచించారు. యువనేస్తానికి సంబంధించి కూడా కొన్ని సూచనలు చేశారు. వివిధ శాఖలను యువనేస్తంతో అనుసంధానం చేసేందుకు ప్రతి 15 రోజులకు ఒకసారి సమావేశాలు నిర్వహించాలని స్పష్టం చేశారు.

దీనికోసం అవసరమైన వనరులను కూడా సిద్ధం చేసి ఫైలును వెంటనే ప్రభుత్వానికి పంపించాలని ఆదేశించారు. యువనేస్తం ద్వారా 35 వేల మంది వ్యవసాయం, అనుబంధ రంగాల్లో వృత్తి శిక్షణకు దరఖాస్తు చేసుకున్నారని, అందువల్ల వాటికి సంబంధించిన శాఖలు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పింఛన్లు, ఇళ్లు, ఇతర లబ్ధికి సంబంధించిన దరఖాస్తులను వెంటనే అధ్యయనం చేసి జన్మభూమి చివరి రోజున ప్రకటించాలని సూచించారు.

సీమకు తాగునీరు...

వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకుని ఇప్పటినుంచే తాగునీటిపై దృష్టి సారించాలని ఆదేశించారు. ప్రధానంగా ప్రకాశం, రాయలసీమ జిల్లాలకు ఇబ్బందులు లేకుండా నీటి సరఫరా చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. విశాఖ గ్రామీణంలో ఏర్పాటుచేస్తున్న పెట్రోలియం సంస్థకు కావాల్సిన నీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం అమలు కోసం ట్రైసైకిళ్లు, చెత్తకుండీలతోపాటు, ఎల్ఇడి వీధిదీపాలను కూడా సిద్ధం చేయాలని, దీనికోసం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డ్రోన్ల వినియోగంపై రోడ్ మ్యాప్ సిద్ధం చేయాలని, త్వరలోనే దీనిపై సమీక్ష నిర్వహించనున్నట్లు వారు వెల్లడించారు.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68